
'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 | సంచిక: 171

SUNDAY Special | ఆదివారం 11-9-2022


SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



స్టెంట్లు మళ్లీ పూడుకుపోతే?

స్టెంట్ వేశాక.. మళ్లీ ఆ రక్తనాళం పూడుకుపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డాక్టర్లు సూచించే చికిత్సలపై ప్రత్యేక కథనం.

- వివరాలు 11లో



'నంబర్ వన్' సమరం.. అల్‌కరాజ్ X రూడ్

పురుషుల టెన్నిస్ చరిత్రలో తొలిసారి ఇద్దరు క్రీడాకారులు తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో పాటు నంబర్‌వన్ ర్యాంకు కోసం పోటీపడుతున్నారు.

- వివరాలు 12లో



బ్రిటన్ రాజుగా చార్లెస్ ప్రమాణం

బ్రిటన్ రాజుగా 73 ఏళ్ల చార్లెస్–3 శనివారం ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. తన తల్లిని తలుచుకొని కన్నీటిపర్యంతమయ్యారు.

వివరాలు 6లో



పారదర్శకంగా నిర్వహించండి

కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికను పారదర్శకంగా నిర్వహించాలని ఆ పార్టీ ఎన్నికల చీఫ్ మధుసూదన్‌కు ఐదుగురు ఎంపీలు లేఖ రాశారు.

వివరాలు 6లో



'ఈ-నగ్గెట్స్'లో ఈడీ సోదాలు

కోల్‌కతాకు చెందిన గేమింగ్ యాప్ కంపెనీ ఈ-నగ్గెట్స్ ప్రమోటర్ల నివాసాల్లో ఈడీ సోదాలు చేసి రూ.17 కోట్లు స్వాధీనం చేసుకుంది.

వివరాలు 6లో



కేరళలోకి ప్రవేశం

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేస్తున్న 'భారత్ జోడో యాత్ర' శనివారం తమిళనాడులో పూర్తయ్యి.. కేరళలోకి ప్రవేశించింది.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు



కుటుంబ కలహాల వల్లే ఎక్కువ ఆత్మహత్యలు జరుగుతున్నాయని.. దీనిని నివారించేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా విజయవాడలో విద్యార్థులు, పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు.

వివరాలు 5లో ▸

పూతరేకులు.. చాలా ఈజీ



ఆంధ్ర సంప్రదాయ స్వీట్లలో పూతరేకులది ప్రత్యేక స్థానం. సంప్రదాయ పద్ధతిలో కాస్త కష్టతరమైన వీటి తయారీ ఇప్పుడు సులభతరమైంది. వీటి తయారీకి అనకాపల్లి ఆర్‌ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు రూపొందించిన యంత్రంపై కథనం.

వివరాలు 2లో ▸

ఉత్తరాంధ్రపై చంద్రబాబు దాడి



అమరావతి పరిరక్షణ పేరుతో చేపట్టిన యాత్ర ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు దాడి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు టీడీపీయే కారణమని, విశాఖను పరిపాలన రాజధాని కాకుండా కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు.

వివరాలు 10లో ▸

కళ్యాణం కమనీయం

అక్టోబర్ 1 నుంచి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికులు, ముస్లిం మైనారిటీ పేద అమ్మాయిల వివాహాలకు ఆర్థికంగా అండ
- జీవో జారీతో మేనిఫెస్టోలో మరో కీలక హామీని అమల్లోకి తెచ్చిన సీఎం వైఎస్ జగన్
- ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలుతో సరికొత్త రికార్డు
- గత ప్రభుత్వంలో పథకం ఉన్నా కాగితాలకే పరిమితం
- 17,909 జంటలకు చంద్రబాబు సర్కారు పెళ్లి కానుక డబ్బులు రూ.68.68 కోట్లు ఎగనామం
- ఇప్పుడు అర్హులైన వారందరికీ వర్తించేలా వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా
- గత ప్రభుత్వంలో ప్రకటించిన దానికంటే అధికంగా నగదు



ప్రస్తుత వైఎస్ జగన్ సర్కారులో..	చంద్రబాబు సర్కారులో ఇలా..
ఎస్సీ, ఎస్టీలకు: రూ.లక్ష	ఎస్సీలకు: రూ.40 వేలు
ఎస్సీ, ఎస్టీల కులాంతర వివాహాలకు: రూ.1.20 లక్షలు	ఎస్సీల కులాంతర వివాహాలకు: రూ.75 వేలు
బీసీలకు: రూ.50 వేలు	ఎస్టీలకు: రూ.50 వేలు
బీసీల కులాంతర వివాహాలకు: రూ.75 వేలు	ఎస్టీల కులాంతర వివాహాలకు: రూ.75 వేలు
మైనార్టీలకు: రూ. లక్ష	బీసీలకు: రూ.35 వేలు
వికలాంగులకు: రూ.1.50 లక్షలు	బీసీల కులాంతర వివాహాలకు: రూ.50 వేలు
భవన నిర్మాణ కార్మికులకు: రూ.40 వేలు	మైనార్టీలకు: రూ.50 వేలు
	వికలాంగులకు: రూ.లక్ష
	భవన నిర్మాణ కార్మికులకు: రూ.20 వేలు

సాక్షి, అమరావతి : ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన మరో కీలక హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తీసుకువచ్చారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాను అమలు చేసేలా సమగ్ర మార్గదర్శకాలతో కూడిన జీవోను సాంఘిక సంక్షేమ శాఖ శనివారం జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగుల, భవన నిర్మాణ కార్మికుల పేద అమ్మాయిల వివాహాలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, ముస్లిం మైనారిటీ పేద అమ్మాయిల పెళ్లిళ్లకు వైఎస్సార్ షాదీ తోఫా అమలు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. దీంతో సీఎం జగన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలు చేసినట్లయ్యింది. మేనిఫెస్టోను

మిగతా 2వ పేజీలో ▶

వేలల్లో రుణం.. లక్షల్లో వసూళ్లు

- చైనా నుంచే మొత్తం వ్యవహారం
- యాప్ డౌన్‌లోడ్ సమయంలో కాంటాక్ట్ నంబర్లు, ఫొటోల సేకరణ
- భారత్‌లో ఉంటున్న వారి బ్యాంకు ఖాతాల కొనుగోలు
- వాటి ద్వారా లావాదేవీలు..
- ప్రత్యేక ఏజెన్సీ ద్వారా ఇండియా సిమ్‌లు కొనుగోలు
- ప్రత్యేకంగా నేపాల్, బంగ్లాదేశ్‌లో కార్యాలయాలు
- రుణం చెల్లించకుంటే మార్ఫింగ్ వీడియోలతో బెదిరింపులు
- నేపాల్‌లో 2 వేల మంది ఉద్యోగులతో కార్యాలయం



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: రాజమహేంద్రవరానికి చెందిన దుర్గారావు దంపతులు, పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన శివ రుణ యాప్‌ల వేధింపులు తాళలేక ఇటీవల ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఇలా దేశ వ్యాప్తంగా ఎంతో మంది యాప్‌ల నిర్వాహకులు పంపిన అసభ్యకర మార్ఫింగ్ వీడియోలకు జడిసి అర్ధంతరంగా తనువు చాలించడం చర్చనీయాంశమైంది. కొంత మంది బాధితులు మాత్రమే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. తాజాగా విశాఖపట్నంలోనూ ఒక మహిళ తాను తీసుకున్న రూ.5 వేల రుణానికి రూ.12 వేలకుపైగా చెల్లించినా.. అసభ్య వీడియోలతో బెదిరించడంతో విశాఖ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించింది. ఈ వ్యవహారంలో విశాఖ పోలీసుల విచారణలో విస్తుగొలిపే అంశాలు బయటకొచ్చాయి. రుణ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో మన ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లు, గ్యాలరీలోని ఫొటోలకు యాక్సెస్‌ను తీసుకుంటారు. తద్వారా మన కాంటాక్ట్‌లోని నంబర్లకు రుణం తీసుకున్న వారి గురించి చెడుగా ప్రచారం చేయడంతో పాటు గ్యాలరీలో నుంచి కుటుంబ సభ్యుల ఫొటోలను తీసుకుని మార్ఫింగ్ చేసి అసభ్యంగా మార్చి భయపెడుతున్నారు. చైనా నుంచి ఆపరేట్ అవుతున్న ఈ రుణయాప్‌ల స్థావరాలు నేపాల్, బంగ్లాదేశ్‌లో ఉన్నట్టు

మిగతా 2వ పేజీలో ▶

ఏపీ వైపు 'ఐటీ' చూపు

యూనిట్ల ఏర్పాటుకు తాజాగా 7 కంపెనీలు సుముఖం

- తిరుపతిలో ఐజెన్ అమెరికా, కాన్‌ఫ్లక్స్, మాగంటి సాఫ్ట్‌వేర్, నెట్‌ల్యాబ్, లోమా, సాగర్ సాఫ్ట్‌వేర్ సంస్థల ఏర్పాటు
- విశాఖ, తిరుపతిలో ఫ్రాన్స్‌కు చెందిన రాన్‌స్టాండ్ కార్యాలయం
- ఈ కంపెనీల ద్వారా 4,720 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో కార్యాలయాలు తెరుస్తున్న ఐటీ సంస్థలు



సాక్షి, అమరావతి: ఇన్ఫోసిస్, అసెంచర్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ వంటి ఐటీ దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో కొత్తగా కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతుండటంతో చిన్న, మధ్య స్థాయి కంపెనీలు యూనిట్లు ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఐటీ పెట్టుబడులకు అనువైనవిగా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాలను ప్రమోట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. పెద్ద ఐటీ కంపెనీలు విశాఖ, విజయవాడలను ఎంచుకుంటుండగా, చిన్న స్థాయి కంపెనీలు తిరుపతి వైపు మొగ్గు చూపుతున్నాయి. ఐటీ ఆధారిత సేవలు అందించే ఏడు కంపెనీలు తాజాగా తిరుపతిలో తమ కార్యాలయాలను ప్రారంభించడానికి ముందుకు వచ్చినట్లు రాష్ట్ర ఐటీ శాఖ అధికారులు వెల్లడించారు. ఐజెన్ అమెరికన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, కాన్‌ఫ్లక్స్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్, లోమా ఐటీ సొల్యూషన్స్, మాగంటి సాఫ్ట్‌వేర్, సాగర్ సాఫ్ట్‌వేర్, నెట్ ల్యాబ్ వంటి సంస్థలు

మిగతా 2వ పేజీలో ▶

వైర్లు లేకుండా విద్యుత్

- ఇన్‌ఫ్రారెడ్ కాంతితో వైర్‌లెస్ విద్యుత్
- ఇప్పటికే గాలిపటాలతో, డ్యాన్స్‌తో విద్యుత్ పుట్టించే ప్రయత్నం
- వాటిని మించిన కొత్త ఆవిష్కరణలు ఇప్పుడు వెలుగులోకి
- రాత్రిపూటా విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ ప్యానెల్స్ రూపకల్పన
- ఇసుకతో పనిచేసే బ్యాటరీతో నెల పాటు గ్రీన్ పవర్ నిల్వ

వివరాలు 14లో ▸

పొంగిన పాల సేకరణ ధర

నాలుగోసారి పెంచిన అమూల్

- పాడి రైతుకు మరింత లబ్ధిచేకూర్చేలా నిర్ణయం
- గేదె పాలపై గరిష్టంగా లీటర్‌కు రూ.3.93 చొప్పున పెంపు
- 200 లీటర్లు పాలుపోసే రైతులకు, సొసైటీలకు ప్రత్యేక ఇన్సెంటివ్.. లీటర్‌పై రైతులకు రూ.2.25 ప్రోత్సాహం
- అమూల్‌తో పోటీపడి పాలసేకరణ ధరలు పెంచుతున్న ప్రైవేటు డెయిరీలు


14 లో



చరిత్రలో తొలిసారి

ఐదు నదులూ ఒకే సమయంలో సముద్రం వైపు

- విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వరద ఉధృతి
- పోటెత్తిన కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార, నాగావళి
- ప్రాజెక్టులన్నీ నిండి, మిగులు జలాలు సముద్రంలోకి



శ్రీశైలం ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్టు/ విజయపురి సౌత్: చరిత్రలో తొలిసారిగా రాష్ట్రంలో ప్రవహించే 5 నదులూ ఒకేసారి సముద్రంలో కలుస్తున్నాయి. పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార, నాగావళి నదులు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో ఈ నదుల జలాలు కడలి వైపు పరుగులు తీస్తున్నాయి. ఐదు నదులపై ఉన్న ప్రాజెక్టులన్నీ నిండి, మిగులు జలాలు ఒకేసారి సముద్రంలో కలవడం చరిత్రలో ఇదే తొలి సారి. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బ్యారేజ్ నుంచి 4.22 లక్షల క్యూసెక్కుల కృష్ణా జలాలు, ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 3.33 లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు, నెల్లూరు బ్యారేజ్ నుంచి 35 వేల క్యూసెక్కుల పెన్నా జలాలు, గొట్టా బ్యారేజ్ నుంచి 18,702 క్యూసెక్కుల వంశధార జలాలు, నారాయణపురం ఆనకట్ట నుంచి 20 వేల క్యూసెక్కుల నాగావళి జలాలు బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. కృష్ణా , ఉప నదులు తుంగభద్ర, వేదవతి, భీమా, హంద్రీలు ఉరకలు వేస్తుండటంతో

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా

ముగ్గురు ఐఏఎస్‌ల బదిలీ

- రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్‌గా గిరిజా శంకర్
- పౌరసరఫరాల కమిషనర్‌గా అరుణ్‌కుమార్
- పోలా భాస్కర్‌కు జీఏడీ (సర్వీసెస్) అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న గిరిజా శంకర్‌ను రాష్ట్ర పన్నుల (వాణిజ్య) శాఖ చీఫ్ కమిషనర్‌గా నియమించింది. ప్రస్తుతం రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సీహెచ్ రాజేశ్వర రెడ్డిని ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్) కార్యదర్శిగా ఉన్న హెచ్.అరుణ్‌కుమార్‌ను పౌరసరఫరాల కమిషనర్‌గా బదిలీ చేసింది. అదేవిధంగా అరుణ్ కుమార్ ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పోలా భాస్కర్‌కు సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్) కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు.

ముస్లింల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి : ముస్లింల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. షాదీ తోఫాను ప్రకటించిన సీఎంకు ముస్లింలందరూ రుణపడి ఉంటారని, దీనిని అర్హులైన వారందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముస్లింలు సుభిక్షంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు మరోసారి ఘన విజయం చేకూర్చేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారని శనివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

27న టీచర్స్ గిల్డ్ వజ్రోత్సవ మహాసభ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ వజ్రోత్సవ మహాసభ ఈనెల 27న విజయవాడలో శ్రీ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన క్షేత్రంలో నిర్వహించనున్నారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొంటారని టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, చిన్నప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పూడిమడకలో హైడ్రోజన్ ఎకో సిస్టమ్ పార్క్!

అవకాశాలను పరిశీలించిన ఆస్ట్రేలియా బృందం



పూడిమడకలోని ఎన్టీపీసీ స్థలాన్ని పరిశీలిస్తున్న బృందం

పరవాడ (పెందుర్తి): అనకాపల్లి జిల్లా పూడిమడకలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) స్థలంలో హైడ్రోజన్ ఎకో సిస్టమ్ పార్క్ ఏర్పాటుకు గల అవకాశాలను ఆస్ట్రేలియాకు చెందిన ఫోర్టెస్క్యూ ఫ్యూచర్ ఇండస్ట్రీస్ (ఎఫ్ఎఫ్ఐ) అధికార బృందం శనివారం పరిశీలించింది. పూడిమడకలో నాలుగు వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కోసం 2014లో రాష్ట్ర ప్రభుత్వం 1,200 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అనివార్య కారణాల వల్ల 2018లో ప్లాంట్ నిర్మాణం నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఈ స్థలంలో ఎఫ్ఎఫ్ఐ సహకారంతో హైడ్రోజన్ ఎకో సిస్టమ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ఎన్టీపీసీ యాజమాన్యం యోచిస్తోంది. ఈ మేరకు ఆ సంస్థ సీనియర్ అధికారులు సీఎండీతో చర్చలు జరిపారు. ఈ మేరకు ఎన్టీపీసీ ప్రభుత్వానికి కూడా ప్రతిపాదన సమర్పించింది.

'బాలాపూర్'.. రికార్డు బద్దలు

అల్వాల్ కానాజీగూడ లడ్డూ వేలం రూ.46 లక్షలు

అల్వాల్(హైదరాబాద్): హైదరాబాద్ శివారులో ఉన్న బాలాపూర్ గణపతి మండపంలోని లడ్డూ వేలంపాటలో ఈసారి రూ.24.60 లక్షలు పలుకగా, అల్వాల్ కానాజీగూడ లడ్డూ దానిని బ్రేక్ చేసింది. కానాజీగుడకు చెందిన మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ మండపంలో లడ్డూను నగరానికి చెందిన డాక్టర్ తాళ్లూరు వెంకట్రావు, గీతప్రియ దంపతులు రూ.45,99,999కి దక్కించుకున్నారు. వెంకట్రావు విదేశాలలో లార్డ్ ఇన్‌స్టిట్యూషన్స్, లోక్‌ప్రదీప్ విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. గతేడాది కూడా వీరే రూ.17,81,999కు లడ్డూను దక్కించుకున్నారు. ఈసారి కూడా రికార్డు స్థాయిలో పాటపాడి లడ్డూను సొంతం చేసుకున్నారు. మరకత గణపతిపై అచంచల విశ్వాసం ఉందని, ఈ లడ్డూను దక్కించుకోడం వల్ల తమకు మరింత మేలు జరుగుతుందన్న విశ్వాసం ఉందని వారు అన్నారు.

పూతరేకులు.. చాలా ఈజీ

- రోజూ 1,200 వరకు తయారుచేసేలా యంత్రం తయారీ
- ఆత్రేయపురంలో ప్రయోగాత్మకంగా తయారుచేసిన ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు
- కేవలం రూ.35 వేలతో సులువుగా పూతరేకులు చేసుకోవచ్చు
- నాలుగో పేటెంట్ హక్కు సాధించిన అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్



అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు తయారుచేసిన పూతరేకుల తయారీ యంత్రం



తయారైన పూతరేకులు

సాక్షి, అనకాపల్లి: పూతరేకులంటే అందరికీ ఠక్కున గుర్తుకొచ్చేది ఆత్రేయపురం. ఆంధ్ర సంప్రదాయ స్వీట్ల వంటకాల్లో వీటిది ప్రత్యేక స్థానం. నోట్లో వేస్తే చటుక్కున కరిగిపోయే లక్షణమున్న వీటిని ఉమ్మడి తూర్పు గోదావరి, విజయనగరం- విశాఖపట్నం, గుంటూరు జిల్లాల సరిహద్దు గ్రామాల్లో సాధారణ పద్ధతుల్లో ఎక్కువగా తయారుచేస్తుంటారు. కానీ, ఈ ప్రాంతాలు ఆత్రేయపురం అంత ప్రసిద్ధి కాదనే చెప్పుకోవచ్చు. ఇక సంప్రదాయ పద్ధతిలో కొంచెం కష్టతరమైన వీటి తయారీ ఇప్పుడు చాలా సులభతరమైంది. అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు వీటి తయారీకి ప్రత్యేక యంత్రాన్ని రూపొందించారు.

సాధారణ పద్ధతిలో తయారీ ఇలా..

పూతరేకుల తయారీకి ప్రత్యేకంగా తయారుచేసిన మట్టికుండను వాడతారు. కుండ పైభాగం నున్నగా వెడల్పుగా ఉంటూ. మంటపెట్టడానికి కింది భాగంలో రంధ్రాన్ని పెడతారు. ఇక బియ్యాన్ని ఒకరోజు ముందుగా నీటిలో నానబెట్టి మరుసటి రోజు రుబ్బురోలులో రుబ్బేవారు. ఈ ప్రక్రియ కష్టతరంగా మారడంతో మారుతున్న కాలానుగుణంగా గ్రైండర్‌లలో రుబ్బుతున్నారు. ఇలా.. మెత్తగా రుబ్బిన పిండిలో తగిన మోతాదులో నీటిని కలిపి పలచగా జాలుగా వచ్చేలా చేస్తారు. బోర్లించిన కుండ అడుగుభాగం నుంచి కొబ్బరి ఆకులతో సన్నని మంట పెడుతూ కుండ వేడెక్కిన తర్వాత పూతరేకుల తయారీ ప్రక్రియ ప్రారంభిస్తారు. మంచినూనే లేదా నేతిని కుండ పైభాగాన రాస్తారు. పలుచని వస్త్రాన్ని జాలుగా ఉన్న బియ్యపు పిండిలో ముంచి కుండ వేడెక్కిన తరువాత ఆ వస్త్రాన్ని కుండపై ఒకవైపు నుంచి మరొక వైపుకు లాగుతారు. కుండ వేడికి పిండి పలుచని పొరలా వస్తుంది. మంట ఎక్కువైనా తక్కువైనా పూతరేకులు విరిగిపోతాయి. ఇలా వీటిని ఈ విధానంలో రోజుకు కేవలం 200వరకు మాత్రమే చేయగల్గుతారు.

తయారీ సులభతరానికి యంత్రం

ఈ నేపథ్యంలో.. సాంకేతికత జోడించి పూతరేకుల తయారీని సులభతరం చేయాలన్న ఆలోచన అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలకు 2016లో కల్గింది. అంతే.. ఈ ఆలోచనను శాస్త్రవేత్తలు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, డాక్టర్ పి. శ్రీదేవిలు కార్యరూపం దాల్చారు. పూతరేకులను తయారు చేసే యంత్రాన్ని రూపొందించారు. కరెంట్ ఆధారంగా పనిచేసే ఈ యంత్రంపై పూతరేకులను ఒకదాని తర్వాత ఒకటి వేగంగా తీయ్యొచ్చు. అదే పాత విధానంలో అయితే కుండకు పెట్టే మంట అటు ఎక్కువ కాకుండా, ఇటు తక్కువ కాకుండా చూసుకోవడంలో ఎక్కువ సమయం పడుతుంది. దీంతో యంత్రం రాకతో వాటి తయారీ మరింత సులభతరమైంది.

నాలుగు పేటెంట్లు సాధించిన ఆర్ఏఆర్ఎస్

గతంలో అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఉప్పుడు బియ్యం యంత్రానికి, ప్రాసెస్ పౌడర్ బెల్లానికి, మిషనరీ పౌడర్ బెల్లానికి మూడు పేటెంట్లు పొందారు. ఇప్పుడు తాజాగా పూతరేకుల తయారీ యంత్రానికి చెన్నైలో ఉన్న సౌత్ ఇండియా ఇంటెలెక్చువల్ సంస్థ ఈనెల 7న పేటెంట్ హక్కులను కల్పిస్తూ ఆర్ఏఆర్ఎస్‌కు అనుమతినిచ్చింది.

రోజుకు 200 నుంచి 1,200కు పెరుగుదల

సాధారణ విధానంతో రోజుకి గరిష్ఠంగా 200 వరకు పూతరేకులు తయారుచేస్తారు. పెట్టుబడిపోను రూ.650 వరకు మిగులుతోంది. ఈ నేపథ్యంలో.. ఆర్ఏఆర్ఎస్ వారు తయారుచేసిన యంత్రం ద్వారా అయితే రోజుకు గరిష్ఠంగా 1,200 వరకు తయారు చేయవచ్చు. పెట్టుబడి ఖర్చులు పోను.. రూ.2వేల వరకు లాభం ఆర్జించవచ్చు. ఈ యంత్రం ఖరీదు దాదాపు రూ.35 వేలు.

రుచిలో ఏమాత్రం తేడాలేదు



ఆత్రేయపురంలో మా బృందం నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించాం. పూతరేకుల తయారీ వివరాలను అడిగి తెలుసుకున్నాం. యంత్రం రూపొందించిన తర్వాత తయారుచేసిన పూతరేకులకు, సాధారణ పద్ధతుల్లో తయారుచేసిన పూతరేకులకు మధ్య రుచి వ్యత్యాసం కూడా పరిశీలించాం. రెండింటికీ ఒకే రుచి వచ్చాయి.

– పీవీకే జగన్నాథరావు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త

హైకోర్టులో 35 మంది ప్యానెల్ అడ్వొకేట్ల నియామకం

రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో మరో ఏడుగురు

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టులో కేంద్రం తరఫున వాదనలు వినిపించేందుకు 35 మంది న్యాయవాదులతో కూడిన ప్యానెల్‌ను నియమిస్తూ కేంద్ర న్యాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (అమరావతి)లో వాదనలు వినిపించేందుకు మరో ఏడుగురు న్యాయవాదులను నియమించింది. వీరంతా మూడేళ్ల లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈ పోస్టుల్లో కొనసాగుతారు. హైకోర్టులో నియమితులైన న్యాయవాదులంతా కూడా అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్.హరినాథ్ మార్గదర్శకత్వంలో పనిచేశారు. కేంద్ర ప్రభుత్వ ప్యానెల్ న్యాయవాదులుగా నియమితులైనవారిలో సాగి శ్రీనివాసవర్మ, జోస్యుల భాస్కరరావు, బొమ్మినాయుని అప్పారావు, ఏవీఎస్ రామకృష్ణ, తాత సింగయ్య గౌడ్, గేదెల తుహిన్ కుమార్, అంబటి సత్యనారాయణ, మల్లంపల్లి శ్రీనివాస్, సీవీఆర్ రుద్రప్రసాద్, అరవల శ్రీనివాసరావు, మంచాల ఉమాదేవి, పోతంశెట్టి విజయకుమారి, బేతంపల్లి సూర్యనారాయణ, బాచిన హనుమంతరావు, తానేపల్లి నిరంజన్, అరవ రవీంద్రబాబు, గుడిసేవ నరసింహారావు, గుండుబోయిన వెంకటేశ్వర్లు, పసల పున్నారావు, గేదెల సాయి నారాయణరావు, వి.వెంకట నాగరాజు, ఇ.అంజనారెడ్డి, కామిని వెంకటేశ్వర్లు, తుమ్మలపూడి శ్రీధర్, ఓరుగంటి ఉదయ్ కుమార్, కె.శ్రీధర్ మూర్తి, సోమిశెట్టి గణేష్ బాబు, తడసిన అలేఖ్య రెడ్డి, వైవీ అనిల్ కుమార్, సోమసాని దిలీప్ జయరామ్, పల్లేటి రాజేష్ కుమార్, పామర్తి కామేశ్వరరావు, మన్నవ అపరాజిత, షేక్ బాజీ, గొర్రెముచ్చు అరుణ్ శౌరి ఉన్నారు. రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో నియమితులైన వారిలో కవిపురపు పట్టాభి రాముడు, గొరికపూడి అంకమ్మరావు, ఎన్.వీరప్రసాద్, సీతిరాజు రామకృష్ణ, మాదాల ఆదిలక్ష్మి, షేక్ మంజూర్ అహ్మద్, బి.బి.లక్ష్మయ్య ఉన్నారు.

కోవిడ్ వ్యాక్సిన్లతో వైద్య సంక్షోభం!

- వ్యాక్సిన్ దుష్ప్రభావాలపై పోరాడుతున్న వైద్యుల బృందం ఆరోపణ
- దీర్ఘకాలిక ప్రభావాలను గుర్తించకుండానే కోవిడ్ వ్యాక్సిన్ల విడుదల
- వాటితో ప్రపంచవ్యాప్తంగా కోటీ పది లక్షల మందిలో ప్రతికూల ప్రభావాలు
- వీరిలో దాదాపు 70 వేల మందికిపైగా మృత్యువాత పడ్డారు
- క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య ఎక్కువే ఉండొచ్చన్న వైద్యులు
- వ్యాక్సినేషన్‌ను నిలిపేసి.. రిస్క్ తగ్గించే ప్రయత్నాలు చేపట్టాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేసిన వ్యాక్సిన్లతో అంతర్జాతీయ వైద్య సంక్షోభం తలెత్తిందని ఈ వ్యాక్సిన్ల దుష్ప్రభావాలపై పోరాడుతున్న వైద్య బృందం ఆరోపించారు. ఈ వ్యాక్సినేషన్ ప్రభావంపై మెడికల్ క్రైసెస్ డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేసింది. శనివారం జూమ్ యాప్ ద్వారా పలు దేశాలకు చెందిన వైద్యుల బృందం ఈ అంశంపై మీడియా సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా డాక్టర్ గాయత్రి పండిట్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కోవిడ్ వ్యాక్సిన్లతో తలెత్తిన ప్రతికూల పరిస్థితులను వివరించారు. ''ఆరోగ్యవంతమైన వ్యక్తులు కోవిడ్ వ్యాక్సిన్లు వేసుకున్నాక అనారోగ్యాల బారిపడినట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. యూకేలోని యెల్లోకార్డ్ సిస్టం, ఆస్ట్రేలియన్ అడ్వర్స్ ఈవెంట్ మానిటరింగ్ సిస్టం, యూరప్‌లోని యుడ్రా విజిలెన్స్ సిస్టంలతోపాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ వీజీ యాక్సిస్ డేటాబేస్ ద్వారా మేం గణాంకాలను సేకరించి పరిశీలించాం. ఆ లెక్కల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 11 మిలియన్ల (కోటీ 10 లక్షల) మంది కోవిడ్ వ్యాక్సిన్ల దుష్ప్రభావాలకు లోనయ్యారు. అందులో సుమారు 70 వేల మంది వ్యాక్సినేషన్ తదనంతర కారణాలతోనే చనిపోయినట్టు పలు సంస్థల గణాంకాలు చెప్తున్నాయి. నిజానికి క్షేత్రస్థాయిలో బాధితుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది..'' అని వైద్యుల బృందం పేర్కొంది. తక్షణమే కోవిడ్ వ్యాక్సినేషన్లను నిలిపివేసి, వాటిద్వారా తలెత్తిన దుష్ప్రబావాలను గుర్తించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది.



34 దేశాల ప్రతినిధుల మద్దతు

కోవిడ్ వ్యాక్సినేషన్‌తో అంతర్జాతీయ వైద్య సంక్షోభం (ఇంటర్నేషనల్ మెడికల్ క్రైసెస్) తలెత్తుతోందన్న వాదనకు ప్రపంచవ్యాప్తంగా 34 దేశాల వైద్యులు మద్దతు పలుకుతున్నట్టు ఈ బృందం పేర్కొంది. కోవిడ్ వ్యాక్సిన్లను హడావుడిగా తయారు చేసి, అతి తక్కువ కాలంలో క్లినికల్ ట్రయల్స్ జరిపి.. ప్రజలకు అందించారని.. ఈ క్రమంలో వ్యాక్సిన్ల దీర్ఘకాలిక ప్రభావాల సంగతిని తేల్చలేదని వివరించింది. వ్యాక్సిన్ తీసుకున్న వారు కొంతకాలం తర్వాత అనారోగ్యాల బారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని, ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాలను కోరింది. అన్ని కొవిడ్ వ్యాక్సిన్లపై లోతుగా పరిశీలన జరిపి.. మాలిక్యులర్, సెల్యులర్, బయోలాజికల్ ప్రభావాలను తేల్చాలని డిమాండ్ చేసింది.

వేలల్లో రుణం.. లక్షల్లో వసూళ్లు

▶ మొదటి పేజీ తరువాయి

తెలుస్తోంది. ఆయా దేశాల్లో కార్యాలయాలను నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలో, దేశంలో స్థానికంగా ఉండే వివిధ వ్యక్తుల నుంచి కరెంట్, ఫర్మ్ బ్యాంకు అకౌంట్లను కొనుగోలు చేసి.. వీటి ద్వారా మొత్తం ఆర్థిక వ్యవహారాలను సాగిస్తున్నారు. తక్కువ రుణం ఇచ్చి, భారీగా వసూలు చేసి.. అందులో కొంత మొత్తాన్ని ఇక్కడ తమకు ఫర్మ్, కరెంటు అకౌంట్లు ఇచ్చిన వారికి కమీషన్ కింద చెల్లిస్తున్నారు. మిగిలిన భారీ మొత్తాన్ని డాలర్లలోకి మార్చుకుని బిట్ కాయిన్స్ రూపంలో చైనాకు తరలిస్తున్నారు. ఈ అకౌంట్లన్నింటినీ ఆన్‌లైన్‌లో చైనా నుంచే నిర్వహిస్తుండటం గమనార్హం. ఈ అకౌంట్ల నిర్వహణకు ఇక్కడి వారి నుంచి ఓటీపీ కూడా తీసుకోవాల్సిన అవసరం లేకుండా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందుకు హాంకాంగ్‌కు చెందిన కెవిన్ అనే వ్యక్తి సూత్రధారిగా తేలింది. ఇతనికి బ్యాంకు అకౌంట్లు విక్రయించిన వారు 250 మంది వరకు ఉన్నట్లు తెలిసింది. ఒక్కొక్కరి అకౌంట్ ద్వారా రూ.150 కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

లోన్ యాప్‌లు.. విష వలయాలు

విశాఖకు చెందిన గిరి ఒక ఆటోడ్రైవర్. తొలుత ఒక రుణయాప్ నుంచి రూ.5 వేలు ఫిబ్రవరిలో రుణం తీసుకున్నాడు. అయితే, ఆయనకు జమ అయ్యింది రూ.3,500 మాత్రమే. ఈ రుణాన్ని వారంలోగా చెల్లించేందుకు మరో రుణ యాప్ ద్వారా రుణం తీసుకున్నాడు. అయితే రుణం తీర్చినప్పటికీ మరింత చెల్లించాల్సిందేనంటూ బెదిరింపు కాల్స్ వచ్చాయి. వారి కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేస్తామని బెదిరించసాగారు. దీంతో మొత్తం 13 రుణయాప్‌ల నుంచి సుమారు రూ.లక్ష రుణం తీసుకున్నాడు. వీరికి ఏకంగా రూ.3,65,000 మేర చెల్లించారు. అయినప్పటికీ వేధింపులు ఆగకపోవడంతో ఆగస్టులో సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. ఒక రుణయాప్‌లో తీసుకున్న రుణానికి మించి భారీగా చెల్లించాల్సి రావడంతో మరొక రుణయాప్‌ను ఆశ్రయించేలా ఓ పథకం ప్రకారం వ్యవహారం నడుస్తోందని తెలుస్తోంది. కెవిన్ లాంటి వారు సృష్టించిన విష వలయంలో ఎంత మేర ఇండియా కరెన్సీ బిట్‌కాయిన్స్ రూపంలో చైనాకు తరలిపోతోందో అంచనాలకు అందడం లేదు.

2 వేల మంది ఉద్యోగులు

చైనా నుంచి ఆపరేట్ చేస్తున్న రుణయాప్‌ల నిర్వాహకులు శ్రీలంకలో కార్యాలయాలను ప్రారంభించారు. అక్కడి సంక్షోభంతో స్థావరాలను నేపాల్, బంగ్లాదేశ్‌లకు మార్చారు. 2 వేల మంది ఉద్యోగులతో కార్యాలయాన్ని నేపాల్‌లో నిర్వహిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో కూడా ఇదే తరహాలో సాగుతోంది. ఇందులో ఒక సెంటర్ నుంచి నిరంతరాయంగా రుణం తీసుకున్న వారికి బెదిరింపు కాల్స్ వెళుతుంటాయి. మరో సెంటర్ నుంచి రుణం తీసుకున్న వారి ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరమైన వీడియోలను పంపుతున్నారు. ఇక్కడ పని చేసే వారిలో అనేక మంది భారత్ నుంచి వెళ్లిన వారే. అక్కడి నుంచి ఫోన్ కాల్స్ అన్నీ ఇండియా సిమ్‌కార్డుల నుంచే వస్తుండటం గమనార్హం.

కళ్యాణం కమనీయం

▶ మొదటి పేజీ తరువాయి



భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా అత్యంత పవిత్రంగా భావిస్తామని చెప్పడమే కాకుండా ఇచ్చిన మాట మేరకు ఆచరణలో అమలు చేసి చూపించారు. దేశ రాజకీయాల్లో మేనిఫెస్టోకు విశ్వసనీయత అంటే ఇలా ఉండాలని చాటి చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కేవలం కొన్ని వర్గాలకే ప్రకటించి అమలు చేయకుండా కాగితాలకే పరిమితం అయిన పెళ్లి కానుకను ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైన వారందరికీ వర్తించేలా వైఎస్సార్ కళ్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను అమల్లోకి తెచ్చింది. పేద వర్గాల అమ్మాయిల పెళ్లిళ్లకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. గత చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన దాని కన్నా ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికంగా వివాహ నగదు బహుమతిని ఇస్తోంది.

గత సర్కారు బీసీలకు మొండిచేయి

- గత ప్రభుత్వంలో పెళ్లి కానుక అన్ని వర్గాలకు వర్తింప చేయలేదు. 2017లో బీసీలను పథకంలో చేర్చినప్పటికీ వారికి పెళ్లి కానుక డబ్బులివ్వకుండా గత ప్రభుత్వం మొండిచేయి చూపించింది. 2018–19 నాటికి 17,909 జంటలకు చంద్రబాబు సర్కారు పెళ్లి కానుక డబ్బులు రూ.68.68 కోట్లను ఎగనామం పెట్టింది.
- గత ప్రభుత్వంలో పెళ్లి కానుక మార్గదర్శకాలు కూడా సమగ్రంగా లేవు. లబ్ధిదారులకు ఇవ్వాలనే కోణంలో కాకుండా ఎలా ఎగనామం పెట్టాలనే కోణంలోనే నియమ నిబంధనలను రూపొందించింది. అయితే ఇప్పుడు వాటిన్నింటికీ మార్పులు చేసిన వైఎస్ జగన్ సర్కారు.. అర్హులైన వారందరికీ వర్తించేలా ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.

అర్హతలు, విధి విధానాలు ఇలా..

- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫాను అక్టోబర్ 1వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అమలు చేస్తారు. ఆ రోజు నుంచి నవశకం లబ్ధిదారుల మేనేజ్‌మెంట్ పోర్టల్ ద్వారా అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తారు.
- వివాహ తేదీ నాటికి వధువు వయస్సు 18, వరుడి వయస్సు 21 ఏళ్లు నిండి ఉండాలి. తొలి వివాహానికి మాత్రమే అర్హత.
- వధువు, వరుడు పదవ తరగతి పూర్తి చేసి ఉండాలి. (ఈ షరతుకు 2024 జూన్ 30 వరకు సడలింపు ఇస్తారు)
- వరుడు, వధువు ఇద్దరి కుటుంబాల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో నెలకు పది వేల రూపాయల్లోపు, పట్టణ ప్రాంతాల్లో 12 వేల రూపాయల్లోపు ఉండాలి.
- మూడు ఎకరాలకు మించి మాగాణి, లేదా పది ఎకరాలకు మించి మెట్ట భూమి ఉండరాదు. మెట్ట, మాగాణి రెండు కలిపి పది ఎకరాల్లోపు ఉండొచ్చు.
- కుటుంబాల్లో సభ్యులెవ్వరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో, ప్రభుత్వ సంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగిగా, పెన్షనర్‌గా ఉండకూడదు. అయితే పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు మినహాయింపు ఉంది.
- నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండకూడదు (ట్యాక్సీలు, ట్రాక్టర్లు, ఆటోలకు మినహాయింపు)
- నెలవారీ విద్యుత్ వినియోగం (గత 12 నెలల సగటు) 300 యూనిట్ల కంటే తక్కువగా ఉండాలి.
- ఏ కుటుంబమూ ఆదాయపు పన్ను చెల్లింపుదారు కాకూడదు.
- మునిసిపల్ ప్రాంతాల్లో 1,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ నిర్మించిన ఆస్తిని కలిగి ఉండకూడదు.
- ఈ పథకానికి సంబంధించి పూర్తి వివరాలు గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ పథకం నిర్వహణ ఉంటుంది.

చరిత్రలో తొలిసారి



సాగర్‌లో 22 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,47,018 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 10 వేలు, హంద్రీ–నీవా ద్వారా 1013, కల్వకుర్తి ద్వారా 800 క్యూసెక్కులను తరలిస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 62,014 క్యూసెక్కులు, స్పిల్ వే 10 గేట్లను 15 అడుగుల మేర ఎత్తి 3,76,170 వెరసి 4,38,184 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో 884.3 అడుగుల్లో 211.47 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు. నాగార్జున సాగర్‌లోకి 3,94,058 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఇక్కడి నుంచి కుడి, ఎడమ కాలువలు, ఏఎమ్మార్పీ, వరద కాలువలకు 12,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ స్పిల్ వే గేట్లు, విద్యుత్కేంద్రం ద్వారా 3,81,358 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. సాగర్‌లో 588.1 అడుగుల్లో 306.39 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పులిచింతలలోకి 4,18,247 క్యూసెక్కులు చేరుతుండగా.. స్పిల్ వే గేట్లు, విద్యుత్కేంద్రం ద్వారా 3,42,136 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. పులిచింతలలో 168.5 అడుగుల్లో 36.27 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ప్రకాశం బ్యారేజ్‌లోకి 4,23,813 క్యూసెక్కులు చేరుతుండగా.. 4,22,660 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

- బేసిన్‌లో కురుస్తున్న వర్షాల వల్ల గోదావరిలోనూ వరద ఉద్ధృతి పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 3,39,015 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 5,100 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 3,33,915 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.
- పెన్నాలో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. రాష్ట్ర సరిహద్దులోని అప్పర్ పెన్నార్ నుంచి నెల్లూరు బ్యారేజ్ వరకు పెన్నాపై ఉన్న ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో వాటి గేట్లను ఎత్తేసి, వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. నెల్లూరు బ్యారేజ్‌లోకి 38 వేల క్యూసెక్కులు చేరుతుండగా.. ఆయకట్టుకు 3 వేల క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 35 వేల క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.
- ఒడిశా, ఉత్తరాంధ్రలో కురుస్తున్న వర్షాలకు వంశధార, నాగావళి పోటాపోటీగా ప్రవహిస్తున్నాయి. గొట్టా బ్యారేజ్‌లోకి వంశధార నుంచి 20,675 క్యూసెక్కులు చేరుతుండగా.. ఆయకట్టుకు 1,973 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 18,702 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. నాగావళి నుంచి నారాయణపురం ఆనకట్టలోకి 20,600 క్యూసెక్కులు చేరుతుండగా.. ఆయకట్టుకు 600 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 20 వేల క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

ఏపీ వైపు 'ఐటీ' చూపు

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయాలను ప్రారంభించనున్నాయి. ఫ్రెంచ్‌కు చెందిన రాన్‌స్టాండ్ అనే కన్సల్టెన్సీ సంస్థ విశాఖ, తిరుపతిలో కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. మొత్తం ఈ ఎనిమిది కార్యాలయాల ద్వారా 4,720 మందికి ఉపాధి లభించనుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కంపెనీలు కార్యాలయాలు ప్రారంభించడానికి అవసరమైన వాణిజ్య సముదాయాలను ఏపీ టక్నాలజీస్ సర్వీసెస్ (ఏపీటీఎస్) సమకూరుస్తోంది. ఈ పరిణామాల పట్ల నిరుద్యోగులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఐటీ కంపెనీ పేరు	ఉద్యోగుల సంఖ్య
ఐజెన్ అమెరికన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్	1,000
కాన్‌ఫ్లక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్	1,020
రాన్‌స్టాండ్ ఐటీ కన్సల్టెన్సీ	100
లోమా ఐటీ సొల్యూషన్స్	577
మాగంటి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్	523
సాగర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్	600
నెట్‌ల్యాబ్స్	500
రాన్‌స్టాండ్ (వైజాగ్)	400

త్వరలో ఐటీ పార్కులు

రాష్ట్రానికి చెందిన ఐటీ రంగ నిపుణులు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలు, దేశాలకు వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగం చేసుకునే అవకాశం కల్పించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఐటీ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ చర్యలపై కంపెనీలకు నమ్మకం పెరగడంతో ఐటీ కంపెనీలు రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందుకు వస్తున్నాయి. యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రధానంగా విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాలు అనువుగా ఉంటాయి. ఈ మూడు చోట్ల అన్ని మౌలిక వసతులతో కూడిన ఐటీ పార్కులను అభివృద్ధి చేయనున్నాం. త్వరలోనే ఐటీ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే విధంగా విశాఖలో ఒక సదస్సు నిర్వహించనున్నాం.

– ఎం.నంద కిషోర్, ఎండీ, ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ (ఏపీటీఎస్)



జ్ఞానము లేనివారు దేవుని వదిలివేసి
నాశనమగుదురు. బుద్ధిహీనులు క్షేమము
కలిగినదని మైమరచి నిర్మూల మగుదురు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం
దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.2.22 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** పూర్వాభాద్ర ఉ.10.02 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర
వర్జ్యం: రా.7.23 నుండి 8.56 వరకు
దుర్ముహూర్తం: సా.4.25 నుండి 5.14 వరకు,
అమృతఘడియలు: తె.4.47 నుండి 6.21 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం : 6.04
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కన్హయ్య కుమార్ (కాంగ్రెస్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రాహుల్‌గాంధీలో కొంచెమైనా అలసట కనిపించడం లేదు! అప్పటికే ఆయన తనతో పాటుగా మమ్మల్ని దేశానికి దక్షిణాన ఉన్న కన్యాకుమారి నుంచి ఉత్తర దిక్కున ఉన్న కశ్మీర్ వైపుగా 12–13 కిలోమీటర్ల దూరం నడిపించి ఉంటారు!

"మరొక 12–13 కి.మీ. నడుద్దాం" అన్నారు రాహుల్.. నడుస్తూ నడుస్తూనే. ఆ సంకల్ప బలమే సీనియర్ నాయకుల్ని సైతం ఉత్సాహంగా నడిపిస్తోంది.

"అలాగే రాహుల్‌బాబూ! మరో 12–13 కి.మీ నడుద్దాం.." అన్నారు దిగ్విజయ్‌సింగ్.. రాహుల్ వేగాన్ని అందుకుంటూ! దిగ్విజయ్ వేగాన్ని అశోక్ గెహ్లోత్ అందుకున్నారు. అశోక్ గెహ్లోత్ వేగాన్ని భూపేశ్ భగేల్ అందుకున్నారు. భూపేశ్ భగేల్ వేగాన్ని జైరాం రమేశ్ అందుకున్నారు. వాళ్లందరి వెనుక నేను నడుస్తున్నాను.

"ఓయ్ కన్హయ్యా! ఏంటా పెళ్లి నడక.. స్పీడప్ స్పీడప్.." అంటున్నారు భూపేశ్ భగేల్ నా వైపు చూసి నవ్వుతూ. కాంగ్రెస్‌కు ప్రస్తుతం మిగిలి ఉన్న ఇద్దరు సీఎంలలో ఆయన ఒకరు.

జోడో యాత్రలో నా డ్యూటీ నడవడం మాత్రమే కాదు. అందరికన్నా వేగంగా నడవాలి. అందరికన్నా వెనక నడవాలి.



"మిమ్మల్ని ఫాలో అవ్వాలంటే మీ వెనుకే కదా నడవాలి భగేల్‌జీ.." అన్నాను నా నడక వేగాన్ని పెంచీ పెంచకుండా.

"అద్సరే భగేల్, పెళ్లి నడక అంటావేంటి? కన్హయ్యకు పెళ్లెప్పుడైందీ మనకు తెలీకుండా..." అన్నారు గెహ్లోత్ పెద్దగా నవ్వుతూ. కాంగ్రెస్‌కు మిగిలిన ఇద్దరు సీఎంలలో ఆయన ఇంకొకరు.

"హహ్హహా.. పెళ్లి కాని వారు పెళ్లి నడక నడవరంటావా గెహ్లోత్‌జీ.." అన్నారు భగేల్!

ఆ టాపిక్‌ని అక్కడే ఆపనివ్వకపోతే ముందు వరుసలో నడుస్తున్న వారి వరకు వెళ్లేలా ఉంది.

"గెహ్లోత్‌జీ! నాకొకటి అనిపిస్తోంది. దేశం రెండు కమతాలుగా విడిపోవడానికి మహమ్మద్ అలీ జిన్నా కారణం అయితే, దేశం రెండు మతాలుగా విడిపోవడానికి మన మోదీజీ కారణం అవుతున్నారు కదా.." అన్నాను.

"ఇందులో కొత్తగా అనిపించడానికి ఏముంది కన్హయ్యా కుమార్!" అన్నారు గెహ్లోత్.

"మతాలు, కమతాలు! మంచి రిథమ్ ఉంది కన్హయ్యా నీలో. రిథమ్ ఉండీ పెళ్లెందుకు చేసుకోలేదు?" అని నవ్వారు భగేల్!

పెళ్లి టాపిక్ పక్కదోవ పట్టేందుకు ఇద్దరూ ఇష్టపడటం లేదు!

పాదయాత్ర బ్రేక్‌లో తొలిరోజు రాత్రి నాగర్‌కోయిల్‌లోని స్కాట్ క్రిస్టియన్ కాలేజ్ గ్రౌండ్‌లో స్టే చేశాం. స్నానాలు, భోజనాలు అయ్యాక సీనియర్ నాయకులంతా గ్రౌండ్ లోపల నిలిపిన కంటెయినర్‌లలోకి వెళ్లిపోయారు. నేను, కొంతమంది యూత్ లీడర్‌లు గ్రౌండ్‌లో ఆరుబయటే మసక చీకటిలో టార్పాలిన్‌లపై విశ్రమించాం.

"మనమింకా ఎంతదూరం ప్రయాణించాలి కన్హయ్యా.." అని నా పక్కనే విశ్రమించి ఉన్న వారెవరో అలసటగా అడిగారు! పాదయాత్ర మొదటి రోజే ఆ మాట అడిగిందెవరా అని చూశాను. పి.చిదంబరం!

"సార్! మీరా? మీరేమిటి ఈ ఆరుబయట?!" అన్నాను.

"నాకు ఏసీ పడదు కన్హయ్యా! అందుకే కంటెయినర్‌లలోకి వెళ్లలేదు. సరే ఇది చెప్పు. కశ్మీర్ ఇక్కడికి ఇంకా ఎంత దూరం?" అని అడిగారు చిదంబరం!!

"పెద్ద దూరమేం కాదు చిదంబరంజీ. ఇప్పుడు నాగర్‌కోయిల్‌లో ఉన్నామా.. తర్వాత తిరువనంతపురం, కొచ్చి, నీలాంబర్, మైసూర్, బళ్లారి, రాయచూర్, వికారాబాద్, నాందేడ్, జల్‌గావ్, ఇండోర్, కోట, దౌసా, అల్వాల్, బులంద్‌షహర్, ఢిల్లీ, అంబాలా, పఠాన్‌కోట్.. ఆ తర్వాత జమ్ము, శ్రీనగర్.. అంతే!" అన్నాను.

"అంతేనా! మధ్యలో ఏం మిస్సవలేదు కదా!!" అన్నారు చిదంబరం. లేదన్నట్లుగా ఆయన వైపు చూసి నవ్వాను.

నిజంగానే మధ్యలో ఏం మిస్సవలేదు. మధ్యలో ఎవరైనా మిస్ అవుతారేమో తెలీదు.

ధనస్వామ్యం దండయాత్ర!



మన స్వరాజ్యానికి మొన్ననే అమృతోత్సవం జరుపుకొన్నాం. స్వరాజ్యం సురాజ్యం కావాలంటే ప్రజలే ప్రభువులు కావాలని మన రాజ్యాంగం చాటి చెప్పింది. ఆ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రిపబ్లిక్ డే కూడా మరో రెండేళ్లలో అమృతోత్సవం తలుపు తట్టబోతున్నది. ప్రజల కొరకు ప్రజల చేత ఏర్పడే ప్రజా ప్రభుత్వ పాలనే ప్రజాస్వామ్యమని అబ్రహాం లింకన్ చెప్పారు. అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగంలోని అన్ని అధికరణాల్లో అణువణువునా ఇదే స్ఫూర్తి ప్రవహించింది. ప్రజలందరి చేత ఎన్నికైన ప్రజా ప్రభుత్వం ప్రజలందరి కోసం పని చేయాలి. భారత రాజ్యాంగానికి హృదయంగా భావించే పీఠిక ఇదే విషయాన్ని మూడు ముక్కల్లో చెప్పింది. కొన్ని చారిత్రక కారణాల వలన సమాజంలోని విశాల జనబాహుళ్యానికి వెనకబాటుతనం వారసత్వంగా లభించింది. వారందరినీ ముందు వరసలో ఉన్నవారి సరసన నిలబెట్టడానికి ప్రభుత్వం పూనుకోవాలని రాజ్యాంగం ఆదేశిస్తున్నది. అప్పుడే సమాజంలోని ప్రజలందరి మధ్యన ఆరోగ్యకరమైన పోటీ నెలకొంటుంది. రాజ్యాంగ ఆదేశాలు అటకెక్కిన ఫలితాన్ని ఇప్పుడు మనం అనుభవిస్తున్నాము. డబ్బున్నవాడే ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కాగలిగే దుస్థితికి ప్రజాస్వామ్యం దిగజారుతున్నది. విద్య అంగడి

జనతంత్రం



వర్ధెల్లి మురళి

సరుకైన ఫలితంగా నాణ్యమైన విద్య కలవారి బిడ్డలకే రిజర్వయిపోయింది. పేద పిల్లలకు నాసిరకం చదువు తప్ప గత్యంతరం లేదు.

ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగా పరిపాలన చేయడానికి గతంలో ప్రయత్నాలు జరగకపోలేదు. ఈ సందర్భంగా కాలగమనంలోని ఒక కీలక ఘట్టాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. పి.వి. నరసింహారావు ఈ దేశానికి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించే సమయానికి ఆర్థిక వ్యవస్థను సరళీకరించవలసిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కర్తవ్యాన్ని ఆయన వ్యక్తిగత శ్రద్ధతో నిర్వహించారు. క్రమంగా గ్లోబల్ ఎకానమీతో భారత ఆర్థిక వ్యవస్థ అనుసంధానం మొదలైంది. బహుళజాతి కంపెనీలు, వాటి గురుపీఠమైన ప్రపంచ బ్యాంకు రంగప్రవేశం చేశాయి. వారికి దేశంలో కమీషన్లు పుచ్చుకొని పనులు చేసిపెట్టగల రాజకీయ దళారుల అవసరం ఏర్పడింది. ప్రైవేటీకరణ జోరు పెరగడంతో గనులు, వనులు, సహజ వనరులపై పెత్తనానికి పెట్టుబడిదారులు పోటీపడ్డారు. కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలో ఉండేవారితో వారికి అవసరాలు పెరిగిపోయాయి. తమ ప్రయోజనాలకు అనుకూలంగా మెలిగే నాయకుల కోసం వారు అన్వేషించారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్టీ రామారావు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. ఆయనది సంక్షేమ ఎజెండా. పేదల అనుకూల ఫిలాసఫీ. స్వదేశీ విదేశీ పెట్టుబడిదారులకు పనికివచ్చే నాయకుడు కాదు.

అదే సమయంలో హఠాత్తుగా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలందరికీ ఎన్టీ రామారావు పట్ల విరక్తి కలిగింది. ఆయన లక్ష్మీపార్వతిని పెళ్లి చేసుకోవడం వారికి నచ్చలేదు. రాత్రికి రాత్రే తిరుగుబాటు చేశారు. కథ ఈ రకంగా ప్రచారంలోకి వచ్చింది. వాస్తవానికి ఎన్నికల కంటే రెండేళ్ల ముందుగానే ఎన్టీఆర్ పెళ్లి చేసుకున్నారు. తిరుపతిలో లక్షమంది సమక్షంలో లక్ష్మీపార్వతిని భార్యగా ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచార సభల్లో ఎన్టీఆర్‌తోపాటు లక్ష్మీపార్వతి కూడా పాల్గొని ప్రసంగించారు. అప్పుడు లేని ఆగ్రహం గెలిచిన తర్వాత ఏడాదిలోపే పార్టీ ఎమ్మెల్యేలకు కలగడం విడ్డూరమే. కానీ ఈ విడ్డూరమే చరిత్రగా నమోదైంది. అసలు జరిగింది వేరు.

సరళీకరణతో అందివస్తున్న అవకాశాలను వేగంగా ఆక్రమించుకోవాలనుకునే స్వార్థపూరిత శక్తులకు చంద్రబాబులో ఒక నమ్మకమైన సేవకుడు కనిపించాడు. ప్రపంచ బ్యాంకు ఆకాంక్షల మేరకు లక్షలాది మంది రైతుల్ని వ్యవసాయ రంగం నుంచి తరిమేసేవాడు, విద్య – వైద్య రంగాలను కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించగలిగేవాడు, ప్రభుత్వ ఉద్యోగుల్ని కోతకోసేవాడు చంద్రబాబులో కనిపించాడు. మీడియాతో సహా సమస్త వ్యవస్థలూ చంద్రబాబుకు సహకరించాయి. నిశ్శబ్దంగా ఎన్టీఆర్ పదవీచ్యుతుడయ్యారు. నిస్సహాయంగా ఆయన మరణించారు.

చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రానికి తొమ్మిదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలం గుర్తున్నవారికి నాటి సామాజిక సంక్షోభం కూడా గుర్తుండే ఉంటుంది. పంట పొలాలు మరు భూములుగా మారడం గుర్తుండే ఉంటుంది. ఫ్యాక్టరీల్లో, నిర్మాణ రంగాల్లో పనిచేయడానికి చీప్ లేబర్ దొరకాలంటే వ్యవసాయ రంగం నుంచి లక్షలాది మందిని బయటకు పంపాలి. అందువల్లనే 'వ్యవసాయం దండగ' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించి కృత్రిమ సంక్షోభాన్ని సృష్టించాడు. ప్రభుత్వ విద్యారంగాన్నీ, వైద్యరంగాన్నీ నిర్లక్ష్యం చేసి ప్రైవేట్ వ్యాపారుల్ని ప్రోత్సహించాడు. ఫలితంగా పేదలు, రైతుల పరిస్థితి దుర్భరంగా తయారైంది. తాను అమలుచేస్తున్న విధానాలకు మద్దతుగా తన భావజాలాన్నీ, ఆలోచనల్నీ వివరిస్తూ 'మనసులో మాట' పేరుతో ఒక పుస్తకాన్ని కూడా రాశారు. సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసి ఆర్థిక రంగాన్ని మార్కెట్ శక్తులకు వదిలేయాలనేది ఆయన సిద్ధాంతం. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వేగంగా పరిస్థితుల్ని చక్కదిద్ది, పెను సామాజిక సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించారు. మానవీయ అభివృద్ధి కోణాన్ని ఆవిష్కరించారు.

అత్యున్నత స్థాయిలో సమాజాన్ని ప్రజాస్వామ్యీకరించడం కోసం, ప్రజాశక్తులను సాధికారం చేయడం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని బృహత్తర కార్యక్రమాలను చేపట్టింది. ప్రజా సంక్షేమం, మానవీయ అభివృద్ధి విషయాల్లో ఆయన ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర రెడ్డిలను అధిగమించారు. 'అధికారం అందరికీ –

> చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రానికి తొమ్మిదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలం గుర్తున్నవారికి నాటి సామాజిక సంక్షోభం కూడా గుర్తుండే ఉంటుంది. పంట పొలాలు మరు భూములుగా మారడం గుర్తుండే ఉంటుంది. ఫ్యాక్టరీల్లో, నిర్మాణ రంగాల్లో పనిచేయడానికి చీప్ లేబర్ దొరకాలంటే వ్యవసాయ రంగం నుంచి లక్షలాది మందిని బయటకు పంపాలి. అందువల్లనే 'వ్యవసాయం దండగ' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించి కృత్రిమ సంక్షోభాన్ని సృష్టించాడు. ప్రభుత్వ విద్యారంగాన్నీ, వైద్యరంగాన్నీ నిర్లక్ష్యం చేసి ప్రైవేట్ వ్యాపారుల్ని ప్రోత్సహించాడు. ఫలితంగా పేదలు, రైతుల పరిస్థితి దుర్భరంగా తయారైంది. తాను అమలుచేస్తున్న విధానాలకు మద్దతుగా తన భావజాలాన్నీ, ఆలోచనల్నీ వివరిస్తూ 'మనసులో మాట' పేరుతో ఒక పుస్తకాన్ని కూడా రాశారు. సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసి ఆర్థిక రంగాన్ని మార్కెట్ శక్తులకు వదిలేయాలనేది ఆయన సిద్ధాంతం. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వేగంగా పరిస్థితుల్ని చక్కదిద్ది, పెను సామాజిక సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించారు. మానవీయ అభివృద్ధి కోణాన్ని ఆవిష్కరించారు.
>
> అత్యున్నత స్థాయిలో సమాజాన్ని ప్రజాస్వామ్యీకరించడం కోసం, ప్రజాశక్తులను సాధికారం చేయడం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని బృహత్తర కార్యక్రమాలను చేపట్టింది. ప్రజా సంక్షేమం, మానవీయ అభివృద్ధి విషయాల్లో ఆయన ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర రెడ్డిలను అధిగమించారు. 'అధికారం అందరికీ – అభివృద్ధి అందరిదీ' అనే దిశగా తన ప్రభుత్వ ప్రాథమ్యాలను ఆయన నిర్ధారించుకున్నారు.

అభివృద్ధి అందరిదీ' అనే దిశగా తన ప్రభుత్వ ప్రాథమ్యాలను ఆయన నిర్ధారించుకున్నారు. అధికార పీఠాలకు ఆమడదూరంలో ఉంటున్న అనేక సామాజిక వర్గాలను గుర్తించి వారి నుంచి ఎంపిక చేసిన వారికి వివిధ స్థాయుల్లో పదవులు కల్పించారు. ఆ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల దగ్గర్నుంచి రాష్ట్ర కేబినెట్ వరకు సింహభాగం పదవులను బలహీన వర్గాలకు కేటాయించారు. నామినేషన్ ద్వారా ఇచ్చే కాంట్రాక్టు పనుల్లోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ ఈ వర్గాలకే పెద్దపీట వేశారు. అన్ని విభాగాల్లో అన్ని స్థాయిల్లోనూ మహిళలకు అర్ధభాగం పదవులను కేటాయించారు. రాజకీయ సాధికారత దిశగా బలహీనవర్గాల ప్రజలు, మహిళలు వేసిన తొలి అడుగులివి.

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు దేశవిదేశాల నుంచి ప్రశంసల వర్షం కురుస్తున్నది. ఈ మూడేళ్లలో రెండేళ్ల కాలాన్ని కోవిడ్ కాటువేసినప్పటికీ సగటున ఒక్కో విద్యార్థి మీద వైఎస్ జగన్ ప్రభుత్వం లక్ష రూపాయల చొప్పున ఖర్చు చేసింది. ఇప్పుడు అదనంగా ఏటా 24 వేల రూపాయల విలువైన 'బైజూస్' కంటెంట్‌ను ఉచితంగా అందివ్వబోతున్నది. అన్ని వర్గాల నుంచి వచ్చే పిల్లలకు వారి ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా అత్యంత నాణ్యమైన విద్యను ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్నది. ప్రపంచంతో పోటీ పడగల మెరుగైన మానవ వనరులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రజారోగ్య వ్యవస్థ కొత్త పుంతలు తొక్కబోతున్నది. ప్రతి ఇంటినీ గడువు ప్రకారం ఒక ఫ్యామిలీ డాక్టర్ సందర్శించే దిశగా, ప్రతి వ్యక్తి ఆరోగ్య ప్రొఫైల్ కంప్యూటర్‌లో నిక్షిప్తమయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ఒక హెల్త్ సెంటర్ ఏర్పాటైంది. వ్యవసాయాభివృద్ధిలో రైతుకు అండగా నిలబడేందుకు ఏర్పాటుచేసిన ఆర్‌బీకే సెంటర్ల ప్రయోగాన్ని కళ్లారా చూసేందుకు నిత్యం ఇతర రాష్ట్రాల నుంచి ప్రతినిధి బృందాలు ఏపీకి వస్తున్నాయి.

ప్రజల సాధికారత, ప్రభుత్వ వ్యవహారాల పారదర్శకత, అధికార వికేంద్రీకరణ అనే మూడు అంశాలు సమాజ ప్రజాస్వామ్యీకరణ స్థాయిని నిర్ధారిస్తాయి. అత్యున్నత స్థాయి ప్రజాస్వామ్యీకరణ మన రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యం. ఉన్నత స్థాయి ప్రజాస్వామ్యీకరణ ఉన్నత స్థాయి ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుందని ఇప్పుడు ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన జీఎస్‌డీపీ గ్రోత్ రేట్ జాబితాలో అగ్రస్థానంలో నిలబడిన ఆంధ్రప్రదేశ్ ఇదే విషయాన్ని నిర్ధారించింది. ప్రభుత్వ పథకాల అమలులో ఒక్క పైసా వృథా కాని విధంగా పారదర్శక పంపిణీ విధానాన్ని రూపొందించింది. అధికార వికేంద్రీకరణను గ్రామస్థాయికి తీసుకొనిపోయింది. గ్రామ సచివాలయాల ఏర్పాటు వికేంద్రీకరణలో చిట్టచివరి మెట్టు. ఈ వికేంద్రీకరణలో భాగంగానే రాష్ట్ర రాజధానిని కూడా విభిన్నమైన అభివృద్ధి దశల్లో ఉన్న మూడు భౌగోళిక ప్రాంతాల మధ్య విభజిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ చర్య ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి నిద్ర పట్టనీయడం లేదు.

విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి కావడానికి చంద్రబాబుకు వివిధ కారణాలు దోహదపడ్డాయి. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవడం తన నైజమని అనేక సందర్భాల్లో ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. కొత్త రాష్ట్రానికి రాజధాని లేని పరిస్థితిలో ఆయనకు సంక్షోభం కనిపించింది. దాన్ని సొంత అవకాశంగా మలుచుకునే ప్రయత్నంలోనే ఐదేళ్ల పదవీకాలం గడిచిపోయింది. తనమీద నమ్మకంతో 34 వేల ఎకరాల భూమిని స్వయంగా రైతులు ల్యాండ్ పూలింగ్‌కు అప్పగించారని ఆయన చెప్పుకుంటారు. ఈ భూమిలో చాలా భాగాన్ని బాబు అనుయాయులు ముందుగానే కొనుగోలు చేసి రైతుల పేరుతోనే పూలింగ్‌కు అప్పగించారని, మిగిలిన రైతులను తప్పనిసరిగా ఇచ్చి తీరవలసిన పరిస్థితికి నెట్టివేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ కార్యక్రమానికంటే ముందుగానే పూలింగ్ ప్రాంతానికి వెలుపల వేలాది ఎకరాల భూమిని తన అనుయాయుల చేత, తన వర్గీయుల చేత కొనిపించారనీ, ఇది అక్షరాల ఇన్‌సైడర్ ట్రేడింగేనన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. రాజధాని పేరుతో ప్రపంచంలోనే పెద్దదైన ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ఆయన ప్లాన్ చేశారు. ఈ వెంచర్‌పై కళ్లు చెదిరే లాభాలు ఆర్జించడం కోసం తన వారి చేత వేల కోట్లు పెట్టుబడులుగా పెట్టించినట్టు సమాచారం. 'మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్' అనే పేరు ఇప్పటికే ఈ వెంచర్‌కు స్థిరపడిపోయింది.

మహిళా సాధికారతలో భాగంగా పేద వర్గాల మహిళల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలిచ్చింది. ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని తలకెత్తుకున్నది. అందులో భాగంగా రాజధాని ప్రాంతంలో కూడా ఒక 50 వేల మంది పేద వర్గాల మహిళలకు పట్టాలివ్వాలని నిర్ణయం తీసుకున్నది. దీంతో గగ్గోలు పుట్టిన తెలుగుదేశం

> ఇప్పుడు రాజధాని రైతుల పేరుతో అమరావతి నుంచి ఉత్తరాంధ్రలోని అరసవిల్లి దాకా ఒక పాదయాత్రను ప్రకటించారు. 'ఇది పాదయాత్ర కాదు విశాఖకు పాలనా రాజధానిని దూరం చేయడానికి సాగిస్తున్న దండయాత్ర'గా అక్కడి రాజకీయ నాయకులు, ప్రజలు పరిగణిస్తున్నారు. 'జనాభాలో ఎనభై శాతంగా ఉన్న పేద వర్గాలకు చోటులేని ప్రాంతాన్ని రాజధానిగా మేం ఎలా అంగీకరిస్తామ'ని ఆ వర్గం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ పాదయాత్ర పేరుతో పేదవర్గాల ప్రయోజనాల మీద ధనస్వామ్యం దండయాత్ర చేస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు. జగన్ విజన్‌కు బాబు ఆలోచనా విధానం పూర్తిగా వ్యతిరేకమైనది. సీఎంగా చంద్రబాబు ఆవిష్కృతుడైన క్రమం, ఆయనే వెల్లడించుకున్న ఆయన ఫిలాసఫీ, అమలుచేసిన కార్యక్రమాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసినప్పుడు ఆయన వెన్నంటి ఉన్న మీడియా, ఇతర వ్యవస్థలతో బాబు స్నేహ సంబంధాలు అలాగే కొనసాగుతున్నాయి.
>
> ఎన్టీఆర్‌ను గద్దె దించేంతవరకు మాయోపాయాలకు, మంత్ర విద్యలకే పరిమితమైన బాబు కోటరీ మీడియా ఆ తర్వాత యెల్లోమీడియాగా అవతరించింది. వైఎస్ ముఖ్యమంత్రి అయ్యేనరికి గోబెల్స్ క్షుద్ర విద్యను ఆవాహన చేసి జనం మెదళ్లను కలుషితం చేయడాన్ని అలవాటు చేసుకున్నది. జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఏర్పడినప్పటి నుంచీ యెల్లో మీడియా సంస్థలు విషసర్పాల అవతారం దాల్చాయి. ఆయన సీఎంగా బాధ్యతలను స్వీకరించిన దగ్గర్నుంచి ఈ మూడేళ్లలో విషం చిమ్మని రోజు లేదు. సకల జన సాధికారతకోసం జగన్ చేపడుతున్న కార్యక్రమాల ఫలితంగా జనంలో ఆయనకు పెరుగుతున్న ఆదరణను సహించ లేకపోతున్నది.

పార్టీ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోర్టు మెట్లెక్కింది. పేద వర్గాలకు పట్టాలివ్వడం వల్ల సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని వాదించింది. ఇది పక్కా రియల్ ఎస్టేట్ వెంచరే అన్న అంశాన్ని ఈ చర్య నిర్ద్వంద్వంగా నిరూపించింది. ఎట్టి పరిస్థితుల్లోనైనా పేదలకు పట్టాలివ్వాల్సిందేననీ, అందుకు అవసరమైన చట్ట సవరణలు చేయాలనీ రాష్ట్ర కేబినెట్ నిర్ణయించినట్టు ఇటీవల వార్తలు వచ్చాయి. దీంతో తెలుగుదేశం పార్టీ, దాని అనుబంధ మీడియా ఉలిక్కి పడ్డాయి.


ఇప్పుడు రాజధాని రైతుల పేరుతో అమరావతి నుంచి ఉత్తరాంధ్రలోని అరసవిల్లి దాకా ఒక పాదయాత్రను ప్రకటించారు. 'ఇది పాదయాత్ర కాదు, విశాఖకు పాలనా రాజధానిని దూరం చేయడానికి సాగిస్తున్న దండయాత్ర'గా అక్కడి రాజకీయ నాయకులు, ప్రజలు పరిగణిస్తున్నారు. 'జనాభాలో ఎనభై శాతంగా ఉన్న పేద వర్గాలకు చోటులేని ప్రాంతాన్ని రాజధానిగా మేం ఎలా అంగీకరిస్తామ'ని ఆ వర్గం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ పాదయాత్ర పేరుతో పేదవర్గాల ప్రయోజనాల మీద ధనస్వామ్యం దండయాత్ర చేస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు. వైఎస్ జగన్ విజన్‌కు చంద్రబాబు ఆలోచనా విధానం పూర్తిగా వ్యతిరేకమైనది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఆవిష్కృతుడైన క్రమం, ఆయనే వెల్లడించుకున్న ఆయన ఫిలాసఫీ, అమలుచేసిన కార్యక్రమాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసినప్పుడు ఆయన వెన్నంటి ఉన్న మీడియా, ఇతర వ్యవస్థలతో బాబు స్నేహ సంబంధాలు అలాగే కొనసాగుతున్నాయి.

ఎన్టీ రామారావును గద్దె దించేంతవరకు మాయోపాయాలకు, మంత్ర విద్యలకే పరిమితమైన బాబు కోటరీ మీడియా ఆ తర్వాత యెల్లో మీడియాగా అవతరించింది. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేసరికి గోబెల్స్ క్షుద్ర విద్యను ఆవాహన చేసి జనం మెదళ్లను కలుషితం చేయడాన్ని అలవాటు చేసుకున్నది. వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడినప్పటి నుంచీ యెల్లో మీడియా సంస్థలు విషసర్పాల అవతారం దాల్చాయి. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన దగ్గర్నుంచి ఈ మూడేళ్లలో విషం చిమ్మని రోజు లేదు. సకల జన సాధికారత కోసం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాల ఫలితంగా జనంలో ఆయనకు పెరుగుతున్న ఆదరణను సహించలేకపోతున్నది. ఆయన మీదా, ఆయన కుటుంబ సభ్యుల మీదా నిందా ప్రచారాలకు దిగజారుతున్నది. వారి సొంత ప్రయోజనాల కోసం పెట్టుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రైతాంగ పోరాటం అనే ముద్ర వేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ కుయుక్తులు ఇప్పుడు ప్రజలకు బాగా అర్థమవుతున్నాయి. చంద్రబాబు, ఆయన పార్టీ, యెల్లో మీడియా ఆగడాల మీద, దుష్ప్రచారాల మీద బలహీన వర్గాల ప్రజలు అతి త్వరలో ప్రజాకోర్టులో ఛార్జిషీట్లు దాఖలు చేయబోతున్నారు. తమ బిడ్డలకు ఇంగ్లిష్ మీడియం బోధనను వ్యతిరేకించినందుకూ, 'అమ్మ ఒడి'పై దుష్ప్రచారం చేసినందుకూ అమ్మల సంఘం ఛార్జిషీటు సిద్ధమవుతున్నది. బలహీన వర్గాల ఇళ్ల పట్టాలను కోర్టు ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేసి నందుకు ఆ మహిళలంతా నేరారోపణ పత్రాన్ని రచిస్తున్నారు. రాజధాని ప్రాంతం నుంచి బలహీన వర్గాలను వెలివేస్తున్నందుకు ఆ వర్గాలు యెల్లో కూటమిపై అట్రాసిటీ అభియోగం చేయ బోతున్నాయి. ప్రజా కోర్టులో ఇక సందడే సందడి. ధనస్వామ్యం దండయాత్రలను పేదవర్గాలు చీల్చి చెండాడే సందడి.

vardhelli1959@gmail.com

ఈ ప్రాచీన చిత్రాలపై పరిశోధన జరగాలి!

అభిప్రాయం



కాక నవ్య

తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఆదివాసీలు నివసించే ప్రాంతం గోదావరి పరీవాహక ప్రాంతం. ఇక్కడి అడవుల్లోనే ఆసియాలోనే అతిపెద్ద జాతరగా పేరొందిన సమ్మక్క–సారలమ్మ ఆదివాసీ జాతర జరుగుతుంది. బాహ్య ప్రపంచానికి తెలియని ఎన్నో ప్రాచీన మానవుని జీవిత విశేషాలను తెలిపే ఆధారాలు ఇక్కడ ఉన్నాయి. ఇవన్నీ ఇప్పటి ఆదివాసీల పూర్వుల సంస్కృతికి అద్దం పట్టేవే.

1,100 చదరపు కిలోమీటర్ల ఏటూరు నాగారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం మధ్య భాగాన పెద్ద గుట్ట ప్రాంతం ఉంది. ఇటు తాడ్వాయి, కామారం... అటు భూపతిపూర్, వెంకటాపూర్ గ్రామాల సరిహద్దు ప్రాంతంలో గొంతెమ్మ అనే వాగు జల మొదలవుతుంది. దానికి దగ్గరలోనే పరుపు రాతి బండపై ప్రాచీన మానవుడు గండరించిన లిపి, చిత్రాలు ఉన్నాయి. ఈ వ్యాస రచయిత్రి సభ్యురాలుగా ఉన్న 'బిర్సా ముండా యూత్ పరిశోధక బృందం' ఈ చిత్రాల ఉనికికి సంబంధించిన సమాచారం తెలుసుకుని అక్కడికి వెళ్లి పరిశోధన చేసింది. 2017లో మొదటిసారి పరిశీలన చేసిన బృందం దీనిపై 'ఇండిజీనస్ నాలెడ్జ్ ఆఫ్ ది కోయతూర్ ఆఫ్ కామారం' అనే పుస్తకం రాసింది. ఇటీవల మరోసారి ఆ బండ దగ్గరకు వెళ్లి పరిశీలించి బాహ్య ప్రపంచానికి కొన్ని విశేషాలు తెలియచేస్తున్నది.

ఈ పరుపురాతిపై మొనదేలిన రాళ్లను ఉపయోగించి బొమ్మలు, అక్షరాలను నాటి మానవులు చెక్కారు (గండరించారు). 40 అడుగుల పొడవు, 25 అడుగుల వెడల్పులో ఉన్న పరుపు రాతి బండ(స్లాబ్)పై మొత్తం అక్షరాలు లేదా బొమ్మలు 101 వరకూ ఉన్నాయి.



కామారం పరుపురాతి బండపై పరిశోధక బృందం

దిగువ ప్రాచీన రాతి యుగం (లోవర్ పాలియో లితిక్ ఏజ్) నాటి చిత్ర లిపి ఇక్కడ ఉండేది ఒక అంచనా (క్రీ.పూ. 1,50,000). మానవుని పాదముద్రలు, ఆయుధాలు ధరించిన మనుషులు, చంద్రుడు, నెలవంక, సూర్యుడు, వివిధ జంతువులు ఇక్కడ ఉన్న బొమ్మల్లో కనిపిస్తున్నాయి. ఏనుగు బొమ్మ, పులిని తోక పట్టి బండకి కొట్టి చంపే బొమ్మ, తాబేలు బొమ్మ, ఉడుము బొమ్మ, జింక బొమ్మ, ఖడ్గ మృగం వంటి బొమ్మలున్నాయి. వీటిని చూస్తుంటే నాటి మానవుడు తన చుట్టూ ఉన్న జంతు ప్రపంచంతో పాటు సూర్యచంద్రులు వంటి ప్రకృతి శక్తులనూ గమనించి తన కళ ద్వారా ముందు తరాలకు నాటి మానవావరణాన్ని అందించినట్లు అర్థమవుతుంది.

కోయతూర్ ప్రజల ధర్మ గురువు 'లింగో' ధర్మ చిహ్నం (శివ లింగంను పోలిన గుర్తు), పడుకోబెట్టిన చిన్న పాప బొమ్మలు కూడా కనిపిస్తాయి. ఈ చిత్రాలను గమనించినప్పుడు ఇవన్నీ అనాదిగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న కోయ తెగ (కోయతూర్) ప్రాచీన సంస్కృతిని తెలిపే విశేషాలుగా చెప్పవచ్చు. మా పరిశోధక బృందంలో ఉన్నవాళ్లమందరం కోయ తెగకు చెందిన వాళ్లమే. అందువల్లనే ఇప్పటికీ మేం పూజించే గురువు లింగో ధర్మ చిహ్నాన్ని గుర్తించగలిగాం. అలాగే కోయ తెగలోని గట్ల (వంశాల)కు ప్రతీకలుగా భావించే పడిగెలపై ఈ పరుపురాతిపై ఉన్న జంతువుల బొమ్మలు ఉండటాన్నీ గుర్తించగలిగాం.

మధ్య భారతదేశంలో గోదావరి, దాని ఉపనదుల పరీవాహక ప్రాంతాల్లో అత్యంత పవిత్రమైన 3 నుండి 7 గట్ల (వంశాల) వారి ఇలవేల్పు జాతరలు జరుగుతాయి. ఫిబ్రవరి నుండి జూన్ వరకు జరిగే ఈ వేల్పుల జాతరల్లో ఆయా వంశాలను ప్రతి బింబించే పడిగ (డాలు గుడ్డ లేదా జెండా)ను పరిశీలిస్తే ఈ పరుపు బండపై కనిపించే బొమ్మలు, అక్షరాలు కనిపిస్తాయి. 4వ గట్టు పడిగపై తాబేలు, 3వ గట్టు పడిగపై ఉడుము, 6వ గట్టు పడిగపై ఏనుగు బొమ్మలు ఉన్నాయి. అలాగే వివిధ గట్లకు సంబంధించిన నిలువు గీతలు ఈ పరుపు బండపై ఉన్న గీతలనే పోలి ఉంటాయి.

ఇవి కోయతూర్ పూర్వీకులు వేసిన బొమ్మలని స్పష్టం అవుతోంది. నాటి నుండి నేటి వరకు ఈ దట్టమైన అటవీ ప్రాంతంలో కోయతూర్ ప్రజల జీవనం కొనసాగుతూనే ఉంది. పరుపు బండపై నుండి రాతి చిత్రాలు తదుపరి చెక్క దుంగలపైకీ ఆ తర్వాత నేటి డాలుగుడ్డపైకీ బదిలీ చేసుకుంటూ తమ మూలాలను కొనసాగించుకుంటూ వస్తున్నారు ఆదివాసీలు.

పురావస్తు శాఖ, ప్రాచీన లిపుల నిష్ణాతులూ కామారం పరుపురాతి బండపై ఉన్న ప్రాచీన చిత్రాలనూ, లిపినీ మరింత అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. అదే సమయంలో పురావస్తు శాఖ ఈ పరుపు రాతిబండను రక్షిత స్థలంగా ప్రకటించి మన ప్రాచీన సంస్కృతిని రక్షించాలి.

వ్యాసకర్త పరిశోధక విద్యార్థిని
మొబైల్: 93922 83453

బలపడిన అల్పపీడనం

నేడు వాయుగుండంగా మారే అవకాశం

- మరో రెండు రోజులు రాష్ట్రంలో వర్షాలు
- శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, గోదావరి జిల్లాల్లో అతి భారీ వర్షాలు
- మిగిలిన జిల్లాల్లో భారీ, మోస్తరు వర్షాలు
- ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా జోరుగా వానలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- శ్రీకాకుళం జిల్లాలో గెడ్డలో కొట్టుకుపోయిన యువకుడు



కృష్ణాజిల్లా పాములలంక వద్ద వరదలకు ఊరు విడిచి పునరావాస కేంద్రానికి వెళ్తున్న గ్రామస్తులు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శనివారం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఆదివారం సాయంత్రానికి ఇది వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఇది పశ్చిమ మధ్య – వాయువ్య బంగాళాఖాతంలో దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర మధ్య కేంద్రీకృతమైంది. ఇది శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం, దక్షిణ ఒడిశా ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇది సగం సముద్రం, సగం భూమిపై కొనసాగుతుండటంతో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. ఈ అల్పపీడనం ప్రభావం వల్ల సముద్రంవైపు ఉన్న తేమ అంతా మేఘాల ద్వారా భూమిపైకి విస్తరించి భారీ వర్షాలకు కారణమవుతున్నట్లు తెలిపారు. దీనికి అనుబంధంగా మరో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. అలాగే సగటు సముద్ర మట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి తూర్పు ఆగ్నేయ దిశగా దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర తీరానికి దగ్గరగా బంగాళాఖాతంపై ఉన్న అల్పపీడన కేంద్రం గుండా వెళుతోంది. అరేబియా సముద్రంలో ఉన్న మరో అల్పపీడన ద్రోణి ఒడిశా నుంచి ఉత్తరాంధ్ర వరకు విస్తరించి ఉంది.

మరో 2 రెండు రోజులు వర్షాలు

అల్పపీడనం, ద్రోణుల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాస్తవానికి అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారి క్రమంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కానీ అది వాయుగుండంగా మారేందుకు అనువైన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరో 2 రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. 11వ తేదీన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. ఉమ్మడిపశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగిలిన కోస్తా జిల్లాలు, రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

గోవిందపురంలో 9 సెంటీమీటర్ల వర్షం

శనివారం విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం గోవిందపురంలో 9 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా దళపతి గుడలో 8.7, శ్రీకాకుళంలో 8.5, పల్నాడు జిల్లా చాగల్లులో 8.3, అల్లూరి జిల్లా శరభన్నపాలెంలో 6.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం మోగల్లులో 6 సెంటీమీటర్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా శివకోడులో 5.6, అనకాపల్లి జిల్లా కోరుప్రోలులో 5.2, పశ్చిమగోదావరి జిల్లా వేగివాడలో 5.1, మొగల్తూరులో 5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. విజయవాడ, పరిసరాల్లో భారీ వర్షం పడింది. రాష్ట్రంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లా మందస మండలంలో మహేంద్ర తనయ గెడ్డ పొంగడంతో శనివారం హొన్నాళి గ్రామానికి చెందిన విశ్వనాథ్ లెంకా (20) అనే యువకుడు కొట్టుకుపోయి మృతి చెందాడు. విశాఖ జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. తగరపువలస, ఆనందపురం, కొమ్మాది, పద్మనాభం, మధురవాడ ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. అనకాపల్లి జిల్లాలో జోరు వాన కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. మూడురోజుల్లో జిల్లావ్యాప్తంగా 76.28 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

శ్రీవారి ఆలయంలో శని వారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరు డునిపై ఆలయ మాడ వీధుల్లో భక్తులను కటాక్షించారు.



బాబు దోపిడీ అంతా ఇంతా కాదు..

713వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



తాడికొండ: అమరావతి పేరుతో చంద్రబాబు చేసిన దోపిడీ అంతా ఇంతా కాదని బహుజన పరిరక్షణ సమితి నేతలు ధ్వజమెత్తారు. చంద్రబాబు తరహా గ్రాఫిక్స్ బొమ్మలకు స్వస్తిపలికి నిజమైన అభివృద్ధిని చేసి చూపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మునిసిపాలిటీని చేసేందుకు గ్రామ సభలు నిర్వహిస్తుంటే.. తప్పుడు ప్రచారానికి పూనుకోవడం సిగ్గుచేటన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 713వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ అమరావతిని అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రయత్నిస్తుంటే.. అడుగడుగునా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబులాగా గ్రాఫిక్‌లు చూసి ప్రజలను మోసం చేయడం సీఎం జగన్‌కు చేతకాదన్నారు. రాజధాని ప్రాంతంలో 54 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలిచ్చేలా కేబినెట్ సాక్షిగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం.. బహుజనులకు సంతోషమిచ్చే అంశమని, త్వరలో బహుజనుల కోరిక నెరవేరుతుందన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టి ఎన్నికలకు వెళ్లేలా ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందడుగు వేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం విద్యను అందించే నిర్ణయంతో పాటు, బైజూస్ సంస్థ ద్వారా విద్యను చేరువ చేసేందుకు పిల్లలకు ట్యాబ్‌లు ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్న జగనన్నకు తాము జీవితకాలం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు

కుటుంబ కలహాలతోనే ఎక్కువగా ఆత్మహత్యలు

డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, సీపీ టీకే రాణా తదితరులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): కుటుంబ కలహాల కారణంగానే ఎక్కువగా ఆత్మహత్యలు జరుగుతున్నాయని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. భార్యాభర్తలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చేలా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పోలీస్ శాఖ, మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా బెంజిసర్కిల్ నుంచి ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం వరకూ విద్యార్థులు, పోలీస్ సిబ్బందితో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తొలుత బెంజిసర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానసిక వైద్యుల సంఘం రూపొందించిన పోస్టర్‌ను డీజీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ కుటుంబ కలహాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో పిల్లలు అనాథలుగా మారే అవకాశం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యాలతో కూడా కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని డీజీపీ ఆవేదన వ్యక్తం చేశారు. చదువుల విషయంలో తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తీసుకురావొద్దని సూచించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఒత్తిడిలేని విద్యా విధానమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రక్షాళన చేస్తోందన్నారు. అనంతరం 'సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు.. మేం ఆత్మహత్య చేసుకోం' అని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ టీకే రాణా, మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.ప్రభాకర్, కార్యదర్శి డాక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. కంపార్ట్‌మెంట్‌లు నిండిపోవడంతో క్యూలైన్ రాంభగీచ వరకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,292 మంది శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోగా.. 30,641 మంది తలనీలాలు ఇచ్చారు. భక్తులు శ్రీవారి హుండీలో రూ.3.72 కోట్లు సమర్పించారు.

శ్రీవారిని దర్శించుకున్న పళనిస్వామి

తిరుమల శ్రీవారిని శనివారం తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలివ్వగా.. టీటీడీ అధికారులు శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వచ్చేనెల నుంచి కొత్త పీఆర్సీతో వేతనాలు

- మూడు నెలల్లో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం
- ఏపీజీఈఏ నాలుగో వార్షికోత్సవంలో మంత్రి బొత్స



విజయనగరం గంటస్తంభం: ఆర్టీసీ ఉద్యోగులు వచ్చే నెల 1వ తేదీన కొత్త పీఆర్సీ వేతనాలు అందుకుంటారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. న్యాయ అంశాలు, నిబంధనలన్నీ పరిశీలించాక కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉంటుందని, ఈ విషయంలో నెలరోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) 4వ వార్షికోత్సవ రాష్ట్ర సభ విజయనగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి బొత్స మాట్లాడుతూ.. ఉద్యోగుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవడానికే తమ ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, సీపీఎస్ కంటే మెరుగైన ప్రయోజనాలు కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని మంత్రుల కమిటీకి సీఎం సూచించారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఓపీఎస్ అమలు సాధ్యంకాదన్నారు. తాము ఇచ్చిన ఎన్నికల హామీల్లో 95 శాతం నెరవేర్చామని, ఐదు శాతంలో సీపీఎస్ కూడా ఉందన్నారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములమన్న భావనతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్నారు. పెండింగ్ డీఏల సమస్య తొందరలోనే పరిష్కారమవుతుందన్నారు. పీహెచ్‌సీ మొదలుకుని అన్నిస్థాయిల్లోని ఆస్పత్రుల్లో పోస్టులన్నీ డిసెంబర్ ఆఖరుకు భర్తీ చేస్తామన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా అదే సమయానికి భర్తీ చేస్తామని చెప్పారు. ఉద్యోగులు కూడా ఎక్కువ మందికి మేలు జరిగేలా ఆలోచించాలన్నారు. రాజకీయ కుతంత్రంతో ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలని ఎవరైనా చేస్తే దానివల్ల ఉద్యోగులకే నష్టమని హెచ్చరించారు. తెలంగాణ నుంచి వచ్చిన ఉద్యోగులకు ఎటువంటి పెన్షన్ స్కీం వర్తింపచేయాలన్నది రెండు నెలల్లో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యనారాయణ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, ఇతర సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆదేశం



సాక్షి, అమరావతి: ఎస్సీ గురుకులాల్లోని విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడటానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గురుకులాల విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే చికిత్స అందించాలని.. అవసరమైన ఔషధాలను కూడా అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. గురుకులాల ఆవరణల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలన్నారు. గతంలో సెర్ప్ ద్వారా విద్యార్థులకు అమలు చేసిన ఇన్‌స్రూ?స్సను పునరుద్ధరించే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో తప్పనిసరిగా హెల్త్ సూపర్‌వైజర్, హాస్టల్ కేర్ టేకర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పోస్టులు ఎక్కడైనా ఖాళీగా ఉంటే భర్తీ చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలోనూ ప్రభుత్వ మెనూ అమలవ్వాలని స్పష్టం చేశారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి, గురుకుల విద్యా సంస్థ కార్యదర్శి పావనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదర్ పూనావాలా పేరిట రూ.కోటి టోపీ

సీరం సంస్థను మోసగించిన సైబర్ దొంగలు

ముంబై: వ్యాక్సిన్ల తయారీ సంస్థ సీరం ఇనిస్టిట్యూట్ సీఈఓ అదర్ పూనావాలా పేరు చెప్పి సైబర్ నేరగాళ్లు రూ.కోటికి పైగా కాజేశారు. మహారాష్ట్రలోని పోలీసులు శనివారం ఈ మేరకు వెల్లడించారు. వెంటనే డబ్బు బదిలీ చేయాలంటూ పూనావాలా పేరిట సీరం సంస్థ డైరెక్టర్ సతీశ్ దేశ్‌పాండేకు సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌లో మెసేజ్ పంపించారు. కొన్ని బ్యాంకు ఖాతాల వివరాలను వాట్సాప్ చేశారు. దాంతో కంపెనీ సిబ్బంది ఆ ఖాతాల్లోకి రూ.1,01,01,554 బదిలీ చేశారు. ఆ మెసేజ్ పూనావాలా పంపలేదని తర్వాత గుర్తించారు. వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు అందుకున్న పుణే పోలీసులు చీటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం కింద గుర్తుతెలియని వ్యక్తులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. సీరం కంపెనీ కరోనా టీకా కోవిషీల్డ్‌తో సహా ఇతర వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తోంది. పుణే సమీపంలో సీరం ప్లాంట్ ఉంది.

క్లుప్తంగా...

లిజ్ ట్రస్‌కు మోదీ ఫోన్

న్యూఢిల్లీ/లండన్: బ్రిటన్ ప్రధానమంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన లిజ్ ట్రస్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. శనివారం ట్రస్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. త్వరలో కలవాలని నేతలు నిర్ణయించుకున్నారు. పలు అంశాలపై చర్చించుకున్నారు. రాణి ఎలిజబెత్-2 మృతిపట్ల భారతీయులందరి సంతాపం ప్రకటిస్తున్నట్లు మోదీ చెప్పారు.

బసంత్ సోరెన్ అనర్హత... గవర్నర్‌కు ఈసీ అభిప్రాయం

రాంచీ/న్యూఢిల్లీ: జార్ఖండ్‌లో గనుల లీజుల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార జేఎంఎం ఎమ్మెల్యే, సీఎం హేమంత్ సోరెన్ సోదరుడు బసంత్ సోరెన్‌పై అనర్హత వేటుకు సంబంధించి ఎన్నికల సంఘం తన అభిప్రాయాన్ని గవర్నర్ రమేశ్ బైస్‌కు తెలియజేసింది. రాజ్‌భవన్ ఈ మేరకు ధ్రువీకరించింది. ఈసీ అభిప్రాయం ఏమిటన్నది బయటపెట్టలేదు. ఈ కేసులో సీఎం హేమంత్ సోరెన్ సైతం ఎమ్మెల్యేగా అనర్హత వేటు ముప్పును ఎదుర్కొంటుండటం తెలిసిందే.

విదేశీ టీ షర్టు ధరించి భారత్ జోడో యాత్ర

రాహుల్‌పై అమిత్ షా విసుర్లు

జైపూర్: భారత్ జోడో యాత్రతో బిజీగా ఉన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై బీజేపీ అగ్రనేత అమిత్ షా మరోసారి విమర్శలు గుప్పించారు. రాజస్తాన్ పర్యటనలో ఉన్న అమిత్ షా శనివారం జోధ్‌పూర్‌లో బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. 'విదేశీ టీ షర్ట్ ధరించి భారత్‌ను ఏకం చేస్తానంటూ బయల్దేరాడు. భారత్‌ను కనెక్ట్ చేయడం తర్వాత. ముందు దేశ చరిత్ర చదవండి' అని ఎద్దేవా చేశారు. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లోనూ బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాక కాంగ్రెస్ రిక్తహస్తాలతో మిగిలిపోతుందన్నారు. రాజస్తాన్‌లో బీజేపీని గెలిపిస్తే పన్నులు, విద్యుత్ టారిఫ్‌లు తగ్గిస్తామని హామీ ఇచ్చారు.

సైనిక స్థావరానికి రావత్ పేరు

కిబితు (అరుణాచల్ ప్రదేశ్): హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలైన భారత తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ పేరును అరుణాచల్ ప్రదేశ్‌లో ఒక సైనిక స్థావరానికి పెట్టారు. రావత్ కుడ్య చిత్రాన్నీ ఆవిష్కరించారు. గతంలో ఇదే క్యాంప్‌లో రావత్ 5/11 గూర్ఖా రైఫిల్స్ బెటాలియన్‌కు కల్నల్‌గా సేవలందించారు. కిబితు నుంచి వలాంగ్ వరకు 22 కి.మీ.ల రోడ్డుకూ ఆయన పేరు పెట్టారు. రావత్‌కు ఇది సరైన నివాళి అని ఆర్మీ ఒక ప్రకటనలో పేర్కొంది.

యూపీలో దేవతకు నాలుక సమర్పణ

కౌశాంబి(యూపీ): ఉత్తరప్రదేశ్‌లో భక్తి పారవశ్యంలో మునిగిన ఓ భక్తుడు ఏకంగా నాలుక తెగ్గోసుకున్నాడు! కౌశాంబికి చెందిన 38 ఏళ్ల సంపత్.. మోహందీగంజ్‌లోని మాతా శీతలాదేవి మందిరానికి భార్యతో కలిసి వెళ్లాడు. ఆలయదర్శనానికి ముందు గంగానదిలో పుణ్యస్నానం చేశాడు. తర్వాత బ్లేడుతో తన నాలికను కత్తిరించుకుని ఆలయ ద్వారం వద్ద సమర్పించాడు. నాలుక తెగడంతో కొద్దిసేపటికే సంపత్ పరిస్థితి దారుణంగా తయారైంది. వెంటనే అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని కరా ధామ్ పోలీస్‌స్టేషన్ స్టేషన్ ఆఫీసర్ అభిలాష్ తివారీ చెప్పారు. ఇంత పని చేస్తాడనుకోలేదంటూ భార్య వాపోతోంది.

త్రిపుర నుంచి రాజ్యసభ అభ్యర్థిగా బిప్లవ్ దేవ్

నిర్ణయించిన బీజేపీ

న్యూఢిల్లీ: త్రిపుర నుంచి తమ పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా బిప్లవ్ కుమార్ దేవ్‌ను బరిలో నిలుపుతూ బీజేపీ శనివారం నిర్ణయం తీసుకుంది. రాజ్యసభ సభ్యునిగా ఉన్న మాణిక్ సాహా రాష్ట్ర ముఖ్యమంత్రి విధుల్లోకి మారడంతో ఖాళీ అయిన సీటు నుంచే బిప్లవ్ దేవ్ పోటీచేయనున్నారు. ఈ నెల 22న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. అసెంబ్లీలో మెజారిటీతో కొనసాగుతున్న బీజేపీకి.. తమ నేత, మాజీ సీఎం బిప్లవ్‌ను గెలిపించుకోవడం తేలికైన విషయమని విశ్లేషణలు వినవస్తున్నాయి. హరియాణాలో పార్టీ వ్యవహారాల బాధ్యతలను గతంలోనే బిప్లవ్‌కు బీజేపీ అప్పజెప్పింది.

రాణి కడసారి చూపునకు...

మెగన్‌ను రానివ్వలేదు!

చిన్న కోడలి ఉనికిని కూడా ఇష్టపడని కింగ్ చార్లెస్-3



లండన్: బ్రిటన్ నూతన రాజు చార్లెస్-3 కుటుంబంలో కొన్నేళ్లుగా నెలకొన్న విభేదాలు రాణి ఎలిజబెత్-2 అస్తమయం సందర్భంగా మరోసారి తెరపైకి వచ్చాయి. చార్లెస్, ఆయన పెద్ద కుమారుడు ప్రిన్స్ విలియంతో చిన్న కుమారుడు ప్రిన్స్ హ్యారీకి చాలా ఏళ్లుగా సత్సంబంధాలు లేని విషయం తెలిసిందే. రాజకుటుంబం అభ్యంతరాలను పట్టించుకోకుండా అమెరికా నటి మెగన్ మార్కెల్‌ను హ్యారీ పెళ్లాడటంతో విభేదాలు బాగా ముదిరాయి. తర్వాతి పరిణామాల నేపథ్యంలో హ్యారీ దంపతులు సంచలన రీతిలో రాజరిక హోదానే వదులుకునేందుకు దారితీశాయి. ఈ నేపథ్యంలో గురువారం స్కాట్లండ్‌లోని బాల్మోరల్ కోటలో మృత్యుశయ్యపై ఉన్న రాణిని చూసేందుకు మెగన్ రావడానికి వీల్లేదని చార్లెస్ పట్టుబట్టారట. హ్యారీ దంపతులు గురువారం లండన్లోనే ఉన్నారు. రాణి కడసారి చూపుకు వారిద్దరూ బాల్మోరల్ బయల్దేరుతున్నట్టు తెలియగానే చార్లెస్ నేరుగా హ్యారీకి ఫోన్ చేసి, ''అతి కొద్దిమంది రక్త సంబంధీకులం తప్ప ఎవరూ రావడం లేదు. కేట్ మిడిల్టన్ (విలియం భార్య) కూడా రావడం లేదు. కాబట్టి మెగన్ రాక అస్సలు సరికాదు'' అని చెప్పినట్టు సమాచారం. దాంతో హ్యారీ ఒంటరిగానే వెళ్లి నాయనమ్మకు నివాళులు అర్పించారు. గురువారమే మొదటిసారిగా కొత్త స్కూల్‌కు వెళ్తున్న తన ఇద్దరు పిల్లల కోసం మిడిల్టన్ లండన్లోనే ఉండిపోయారు.


ముందునుంచీ విభేదాలే

విలియం, హ్యారీ సోదరుల మధ్య ఏనాడూ పెద్దగా సఖ్యత లేదు. తండ్రితో, అన్నతో మనస్పర్ధలను పలుమార్లు టీవీ ఇంటర్వ్యూల్లో హ్యారీ బాహాటంగానే వెల్లడించారు. అప్పటికే పెళ్లయి విడాకులు తీసుకున్న అమెరికా నటి అయిన మెగన్‌తో తన ప్రేమాయణం వారికి నచ్చకపోయినా పట్టించుకోలేదు. గొడవల నేపథ్యంలో హ్యారీ దంపతులు రాచరిక హోదాను వదులుకుని రెండేళ్లుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంటున్నారు. 2021లో ప్రఖ్యాత అమెరికా టాక్ షో హోస్ట్ ఓప్రా విన్‌ఫ్రేకు వారిచ్చిన ఇంటర్వ్యూ పెను సంచలనం సృష్టించింది. రాజ కుటుంబీకుల జాత్యహంకార వ్యాఖ్యలు, ప్రవర్తన తననెంతగానో గాయపరిచాయంటూ మెగన్ తీవ్ర ఆరోపణలు చేసింది. ''పెళ్లికూతురుగా ముస్తాబవుతున్న సమయంలో మిడిల్టన్ నన్ను సూదుల్లాంటి మాటలతో తీవ్రంగా గాయపరిచింది. తట్టుకోలేక ఒక దశలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనుకున్నా'' అంటూ దుయ్యబట్టింది. ఈ ఆరోపణలు, మొత్తంగా బ్రిటన్ రాచరిక వ్యవస్థపైనే ఆమె ఎక్కుపెట్టిన పదునైన విమర్శలు అప్పట్లో పెను దుమారం రేపాయి. రాజ కుటుంబానికి మాయని మచ్చగా మిగల్చడమే గాక వారి హృదయాల్లో మంటలు రేపాయి. అన్నదమ్ముల మధ్య విభేదాలను మరింత పెంచాయి. తల్లిదండ్రులుగా చార్లెస్, కెమిల్లా పూర్తిగా విఫలమయ్యారంటూ హ్యారీ కూడా దుయ్యబట్టారు. తండ్రి అయితే తన ఫోన్ కూడా ఎత్తడం మానుకున్నారని ఆరోపించారు. ఒకవైపు రాణి ఎలిజబెత్ భర్త ఫిలిప్ మరణించిన దుఃఖంలో ఉన్న రాజ కుటుంబాన్ని ఈ ఆరోపణలు మరింత కుంగదీశాయి. ఆ సమయంలో నిండుచూలాలిగా ఉన్న మెగన్ ఫిలిప్ అంత్యక్రియల్లో కూడా పాల్గొనలేదు. అయితే హ్యారీతో పాటు మెగన్‌ను కూడా రాణి ఎంతో ఇష్టపడేవారనే చెబుతారు. మెగన్ అమెరికా వెళ్లి రాణి అంత్యక్రియల సమయానికి లండన్ తిరిగొస్తారని సమాచారం. దూరమైన కుటుంబీకులను విషాద సమయాలు దగ్గర చేస్తాయంటారు. బ్రిటిష్ రాజ కుటుంబం విషయంలో అది నిజమవుతుందో లేదో అంత్యక్రియల నాటికి స్పష్టత వస్తుంది.

రాణి అంత్యక్రియలకు జో బైడెన్ తదితరులు

వాషింగ్టన్: బ్రిటన్ దివంగత రాణి ఎలిజబెత్-2 అంత్యక్రియలకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హాజరుకానున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ప్రకటించారు. రాణి అంత్యక్రియలు ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై బ్రిటిష్ రాజకుటుంబం స్పష్టత ఇచ్చింది. ఈ నెల 19న లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ అబ్బే చర్చిలో వాటిని నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఇదే చర్చిలో 1953లో రాణి పట్టాభిషేకం జరిగింది. రాణి అంత్యక్రియల గురించి పూర్తి వివరాలు తనకు తెలియదని, కానీ తాను మాత్రం కచ్చితంగా హాజరవుతానని జో బైడెన్ అంతకుముందు ప్రకటించారు. బ్రిటన్ రాజుగా బాధ్యతలు చేపట్టిన కింగ్ చార్లెస్-3తో తాను ఇంకా మాట్లాడలేదని చెప్పారు. ఆయన తనకు చాలాకాలంగా తెలుసని అన్నారు. ఎలిజబెత్-2 రాణి అంత్యక్రియలకు బైడెన్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల అధినేతలు హాజరుకానున్నారు.





రాజుగా చార్లెస్ ప్రమాణం

- లాంఛనంగా బాధ్యతల స్వీకరణ
- తల్లిని తలచుకుని కన్నీటిపర్యంతం
- 19న రాణి ఎలిజబెత్ అంత్యక్రియలు





రాజుగా ప్రమాణం చేస్తున్న చార్లెస్. పక్కన భార్య కెమెల్లా. కార్యక్రమానికి వస్తున్న మాజీ ప్రధానులు థెరిసా మే, జాన్ మేజర్, గార్డన్ బ్రౌన్, టోనీ బ్లెయిర్, డేవిడ్ కామెరాన్, బోరిస్ జాన్సన్

లండన్: బ్రిటన్ కొత్త రాజుగా 73 ఏళ్ల చార్లెస్-3 నియుక్తులయ్యారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని అనుసరించి యాక్సెషన్ కౌన్సిల్ శనివారం ఉదయం లండన్‌లోని చారిత్రక సెయింట్ జేమ్స్ ప్యాలెస్‌లో సమావేశమై ఆయన్ను రాజుగా నియమిస్తున్నట్టు లాంఛనంగా ప్రకటించింది. ప్యాలెస్ బాల్కనీ నుంచి నియామక ప్రకటనను బహిరంగంగా చదివి విన్పించింది. భేటీలో పాల్గొన్న ముఖ్య అతిథులంతా 'గాడ్ సేవ్ ద కింగ్' అంటూ తమ అంగీకారం తెలిపారు. అనంతరం చార్లెస్-3 రాజుగా ప్రమాణ చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాజ ప్రకటన పత్రం తాలూకు రెండు ప్రతులపై తన కుమారులు ప్రిన్స్ విలియం, ప్రిన్స్ హ్యారీ కానుకగా ఇచ్చిన ఇంక్ పెన్నుతో సంతకం చేశారు! ఆ వెంటనే కింగ్స్ ట్రూప్స్ 41 తుపాకులతో వందన సమర్పణ చేశాయి. రాణి హోదాలో ఆయన భార్య కెమెల్లా పార్కర్ బౌల్స్ (75), నూతన యువరాజుగా విలియం తదితరులు రాజ ప్రకటన పత్రంపై సాక్షి సంతకాలు చేశారు. బ్రిటన్‌తో పాటు కామన్వెల్త్ దేశాలన్నింటికీ ఇకపై చార్లెస్-3 అధినేతగా వ్యవహరిస్తారు. నిరాడంబరంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆరుగురు బ్రిటన్ మాజీ ప్రధానులతో పాటు కొత్త ప్రధాని లిజ్ ట్రస్, విపక్ష నేతలు కూడా పాల్గొన్నారు. చార్లెస్-3 నిర్ణయం మేరకు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తొలిసారిగా ప్రత్యక్ష ప్రసారం చేశారు. బ్రిటన్‌ను రికార్డు స్థాయిలో 70 ఏళ్లపాటు పాలించిన ఆయన తల్లి క్వీన్ ఎలిజబెత్-2 గురువారం 96వ ఏట కన్నుమూయడం తెలిసిందే. ''అనంతమైన ప్రేమ, నిస్వార్థ సేవ, తిరుగులేని అంకితభావాలతో నా తల్లి పాలన అన్ని విషయాల్లోనూ సాటిలేనిదిగా సాగింది. ఆమె అస్తమయం అత్యంత దుఃఖమయమైన విషయం. నాపై ఎంతటి భారీ బాధ్యతలున్నాయో తెలుసు. ఆమె నెలకొల్పిన ప్రమాణాలను కొనసాగిస్తా. అందుకు నా జీవితాన్ని ధారపోస్తా'' అంటూ తన తొలి ప్రసంగంలో కింగ్ చార్లెస్-3 ప్రతిజ్ఞ చేశారు. తల్లిని తలచుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ''ప్రియాతి ప్రియమైన అమ్మా! దివంగతుడైన నాన్నను కలుసుకునేందుకు మహాప్రస్థానానికి బయల్దేరిన నీకు నేను చెప్పగలిగింది ఒకటే. మన కుటుంబం పట్ల నీ ప్రేమకు, అంకితభావానికి థాంక్యూ'' అంటూ నివాళులర్పించారు. నూతన రాజుకు విధేయులుగా ఉంటామంటూ ప్రధాని ట్రస్, ఆమె మంత్రివర్గ సభ్యులంతా హౌజ్ ఆఫ్ కామన్స్‌లో ప్రతిజ్ఞ చేశారు.

నూతన రాజముద్రిక

రాజకిరీటం, దానికింద సీఆర్ అంటూ పొడి అక్షరాలతో కింగ్ చార్లెస్-3 నూతన రాజముద్రిక రూపుదిద్దుకుంది. సీ అంటే చార్లెస్, ఆర్ అంటే రెక్స్ (లాటిన్‌లో రాజు) అని అర్థం. రాజుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తన టై మీద ఆయన దీన్ని తొలిసారిగా ధరించారు. చార్లెస్ పాలన సాగినంత కాలం బ్రిటన్‌తో పాటు ఇతర కామన్వెల్త్ దేశాల కరెన్సీ నోట్లు, నాణాలు, పాస్‌పోర్టులు, సైనిక దుస్తులు, అధికారిక స్టాంపులు తదితరాలన్నింటి మీదా ఇకపై ఈ ముద్రే కన్పించనుంది. ఎలిజబెత్ హయాంలో రాజముద్రికపై ఈఆర్ (ఎలిజబెత్ రెజీనా) అని ఉండేది.



భర్త సమాధి పక్కనే...

రాణి అంత్యక్రియలు సెప్టెంబర్ 19న ఉదయం చారిత్రక వెస్ట్ మినిస్టర్ అబేలో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరగనున్నాయి. బకింగ్‌హాం ప్యాలెస్ ఈ మేరకు ప్రకటన చేసింది. రాణి పార్థివ దేహాన్ని ఆమె మృతి చెందిన బాల్మోరల్ కోట నుంచి ఆదివారం ఉదయం రోడ్డు మార్గాన ఎడింబరోలోని హోలీ రుడ్ హౌజ్ కోటకు తరలిస్తారు. మంగళవారం అక్కడినుంచి విమానంలో లండన్‌కు తీసుకెళ్తారు. సెప్టెంబర్ 14 నుంచి 4 రోజులు ప్రజల సందర్శనార్థం వెస్ట్‌మినిస్టర్ హాల్లో ఉంచుతారు. 19న సోమవారం విండ్సర్ క్యాజిల్‌లోని సెయింట్ జార్జ్ చాపెల్‌లో భర్త చార్లెస్ సమాధి పక్కనే ఖననం చేస్తారు.

చైనాలో వైద్య విద్యపై జాగ్రత్త

భారత్ ఎంబసీ మార్గదర్శకాలు

బీజింగ్: చైనాలో కరోనాతో కారణంగా ఆగిన వైద్య విద్యను కొనసాగించాలనుకునే, అక్కడ కొత్తగా మెడిసన్ చేయాలనుకునే భారత విద్యార్థులకు చైనాలోని ఇండియన్ ఎంబసీ పలు మార్గదర్శకాలు విడుదల చేసింది. అక్కడ చదివిన వారిలో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండటం, చైనా భాషను నేర్చుకోవడం, తిరిగొచ్చాక కఠినమైన ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ పరీక్ష (ఎఫ్ఎంజీ) పాసవడం వంటివి దృష్టిలో పెట్టుకోవాలని సూచించింది.

- 2015-2021 కాలంలో 40,417 మంది ఎఫ్ఎంజీ పరీక్ష రాస్తే 6,387 మందే గట్టెక్కారు.
- వీరంతా చైనాలోని 45 వర్సిటీల్లో చదివినవారే.
- ఇక నుంచి చైనాకు వెళితే ఈ 45 కాలేజీల్లోనే చదవాలి. అదీ ఇంగ్లిష్ మాధ్యమంలోనే.
- చైనీస్ భాషలో మెడిసన్ చేయకూడదు. ఇంగ్లిష్-చైనీస్ ద్విభాషగా చేసినా చెల్లుబాటు కాదు.
- చైనా అధికారిక భాష పుతోంగ్వాను హెచ్ఎస్‌కే-4 లెవల్ వరకు నేర్చుకోవాలి. లేదంటే డిగ్రీ ఇవ్వరు.
- చైనాలోనే ప్రాక్టీస్ చేయాలనుకుంటే మళ్లీ లైసెన్స్‌ను సాధించాలి. ఐదేళ్ల మెడిసిన్ తర్వాత ఏడాది ఇంటర్న్‌షిప్ చేయాలి. తర్వాత చైనీస్ మెడికల్ క్వాలిఫికేషన్ ఎగ్జామ్ పాస్ అవ్వాలి.
- చైనా నుంచి మెడికల్ క్వాలిఫికేషన్ పొందాలంటే ముందు భారత్‌లో నీట్-యూజీ పాసవ్వాలి.
- చైనా నుంచి వచ్చే వారూ నీట్-యూజీలో ఉత్తీర్ణత సాధించాకే ఎఫ్ఎంజీఈకి అర్హులౌతారు.
- కనుక విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుగా సంబంధిత పూర్తి వివరాలను క్షుణ్ణంగా చదవాలి.

కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక పారదర్శకంగా జరగాలి

ఏఐసీసీకి ఐదుగురు ఎంపీల లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక నిష్పాక్షికంగా జరిగేలా చూడాలంటూ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ (సీఈఏ) చీఫ్ మధుసూదన్ మిస్త్రీకి ఐదుగురు కాంగ్రెస్ ఎంపీలు మనీశ్ తివారీ, శశి థరూర్, కార్తీ చిదంబరం, ప్రద్యుత్ బోర్డోలోయ్, అబ్దుల్ ఖలిక్ తాజాగా లేఖ రాశారు. ''నామినేషన్ ప్రక్రియకు ముందే కాంగ్రెస్ కమిటీ ప్రతినిధుల జాబితాను బయట పెట్టాలి. ఓటర్ల జాబితాను విడుదల చేయాలి. ఎలక్టోరల్ కాలేజీ జాబితాను ఓటర్లకు, అభ్యర్థులకు ఇవ్వాలి'' అని డిమాండ్ ఓటర్ల జాబితాను బయట పెట్టలేమని మిస్త్రీ చెప్పారు. 20న ఏఐసీసీ కార్యాలయానికి వచ్చి 9,000 అభ్యర్థుల జాబితాను చూడవచ్చన్నారు.

ఈ-నగ్గెట్స్ ప్రమోటర్ల నివాసాల్లో సోదాలు

- రూ.17 కోట్ల నగదు స్వాధీనం
- కొనసాగుతున్న నోట్ల కట్టల లెక్కింపు



న్యూఢిల్లీ/కోల్‌కతా: మనీ లాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు కోల్‌కతాకు చెందిన మొబైల్ గేమింగ్ యాప్ కంపెనీ ప్రమోటర్ల నివాసాల్లో శనివారం సోదాలు నిర్వహించారు. దాదాపు రూ.17 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. బెడ్‌పై పేర్చిన రూ.2000, రూ.500, రూ.200 నోట్ల కట్టల ఫొటోను ఈడీ విడుదల చేసింది. అమీర్ ఖాన్, అతడి కుమారుడు నెజార్ అహ్మద్ ఖాన్ కలిసి 'ఈ-నగ్గెట్స్' పేరిట మొబైల్ గేమింగ్ యాప్ ప్రారంభించారు. వారితోపాటు మరికొందరు ఈ కంపెనీ ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్నారు. వారికి చెందిన దాదాపు 6 నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టామని ఈడీ ఒక ప్రకటనలో వెల్లడించింది. రూ.17 కోట్ల నగదు లభ్యమైందని, నోట్ల కట్టల లెక్కింపు ఇంకా కొనసాగుతోందని పేర్కొంది. ఈ-నగ్గెట్స్ కంపెనీ గేమింగ్ యాప్ ద్వారా ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి, వాటిని తిరిగి వెనక్కి తీసుకొనే అవకాశం ఇవ్వకుండా మోసం చేస్తోందంటూ ఫెడరల్ బ్యాంకు అధికారులు కోల్‌కతా కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు కంపెనీతోపాటు ప్రమోటర్లపై కోల్‌కతా పోలీసులు 2021 ఫిబ్రవరిలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించింది. గేమింగ్ యాప్ కంపెనీ ప్రమోటర్ల నివాసాల్లో ఈడీ సోదాలకు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేత, రాష్ట్ర మంత్రి ఫిర్హాద్ హకీం చెప్పారు. బీజేపీయేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ఈడీ సోదాలు జరుగుతుండడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇష్టారాజ్యంగా దోచుకుంటున్న వ్యాపారవేత్తలపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని నిలదీశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల దాడుల వల్ల బెంగాల్‌కు పెట్టుబడులు రాకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి

- పాస్టర్‌తో రాహుల్ సంభాషణే రుజువు
- వీడియో విడుదల చేసిన బీజేపీ
- విద్వేషాలను రెచ్చగొట్టేందుకే: కాంగ్రెస్



కన్యాకుమారిలో యాత్ర మధ్యలో టీ తాగుతున్న రాహుల్

న్యూఢిల్లీ: భారత్ జోడోయాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో క్రైస్తవ మతపెద్ద ఒకరు మాట్లాడినట్లు వెలుగులోకి వచ్చిన ఓ వీడియోపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. కాంగ్రెస్ హిందూ వ్యతిరేక వైఖరి బయటపడిందంటూ బీజేపీ మండిపడింది. జార్జి పొన్నయ్య అనే పాస్టర్ శుక్రవారం రాహుల్‌తో మాట్లాడిన వీడియోను బీజేపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''యేసు ప్రభువు దేవుడా, కాదా? మీరెలా భావిస్తారు?' అని రాహుల్ ప్రశ్నించగా, ''యేసు ప్రభువు నిజమైన దేవుడు. మానవుడిగా భూమిపై జీవించారు. ఆయన శక్తి దేవతల్లాంటి వారు కాదు'' అంటూ పొన్నయ్య బదులిచ్చారు. భారత్ జోడో యాత్ర అసలు రంగు ఈ వీడియోతో బయట పడిందని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. నవరాత్రులు ప్రారంభం కానున్న వేళ శక్తి దేవతను ఇలా అవమానించడం దారుణమని మండిపడ్డారు. ''హిందూ దైవాలను అవమానించడం కాంగ్రెస్ పార్టీకి కొత్తేమీ కాదు. గతంలో రాముడి ఉనికిని ప్రశ్నించింది. ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి కోసం రాహుల్ హిందువుగా నటిస్తుంటారు. ఒక వర్గాన్ని బుజ్జగించడానికి మరో మతాన్ని కించపర్చడం ఏమిటి?'' అని నిలదీశారు. పొన్నయ్య గతంలో హిందూ వ్యతిరేక వ్యాఖ్యలు చేసి అరెస్టయ్యాడని బీజేపీ నేత షెహజాద్ పూనావాలా అన్నారు. బీజేపీ విమర్శలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం తిప్పికొట్టారు. ''బీజేపీ విద్వేషాల ఫ్యాక్టరీ. తద్వారా పబ్బం గడుపుకోవడమే దాని పని. యాత్రకు స్పందన చూసి ఓర్వలేకపోతోంది'' అంటూ ట్వీట్ చేశారు. భారత్ జోడో యాత్ర స్ఫూర్తిని ఎవరూ దెబ్బతీయలేరని, కుట్రదారులకు భంగపాటు తప్పదని అన్నారు.


కేరళలోకి ప్రవేశం

భారత్ జోడో యాత్ర శనివారం తమిళనాడు నుంచి కేరళలో అడుగు పెట్టింది. అంతకుముందు కన్యాకుమారి జిల్లాలో తమిళనాడు తొలి మహిళా బస్ డ్రైవర్, మార్తాండంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులతో రాహుల్ మాట్లాడారు. నారాయణ గురు జయంతి నాడు కేరళలో అడుగుపెట్టడం సంతోషంగా ఉందన్నారు.

శాస్త్రవేత్తల విజయాలను గుర్తించాలి

పరిశోధన, ఆవిష్కరణల్లో గ్లోబల్ సెంటర్‌గా ఇండియా: మోదీ

అహ్మదాబాద్: పరిశోధన, ఆవిష్కరణల్లో భారత్‌ను ప్రపంచానికి కేంద్ర స్థానంగా మార్చేందుకు కృషి చేయాలని సైంటిస్టులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో పురోగతి కోసం ఆధునిక విధానాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. పశ్చిమ దేశాల్లో సైంటిస్టుల కృషికి తగిన గుర్తింపు లభిస్తుందని, మన దేశంలో మాత్రం అలాంటి పరిస్థితి లేకుండాపోయిందని విచారం వ్యక్తం చేశారు. మన శాస్త్రవేత్తలు సాధించిన విజయాలను మనం గుర్తించడం లేదని అన్నారు. భారత శాస్త్రవేత్తల విజయాలు, ఘనతలను గుర్తించి, సెలబ్రేట్ చేసుకోవాల్సిన అవసరముందన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శనివారం ప్రారంభమైన సెంటర్-స్టేట్ సైన్స్ సదస్సులో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.



స్థానిక సమస్యలకు స్థానిక పరిష్కారాలు

సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో మన పరిశోధనలను స్థానిక స్థాయికి తీసుకెళ్లాలని మోదీ చెప్పారు. పరిశోధన, ఆవిష్కరణల్లో మన దేశాన్ని గ్లోబల్ సెంటర్‌గా మార్చడానికి కలిసి పనిచేయాలన్నారు. విద్యా సంస్థల్లో ఇన్నోవేషన్ ల్యాబ్‌ల సంఖ్య భారీగా పెరగాలన్నారు. ''2015లో గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ ర్యాంకింగ్‌లో భారత్ స్థానం 81. కేంద్రం కృషి వల్లే ఇప్పుడు 46కు చేరింది. సైన్స్ అండ్ టెక్నాలజీలో విద్యార్థులకు మాతృభాషల్లో బోధించేలా ప్రయత్నాలు జరగాలి. ప్రపంచస్థాయి ప్రయోగశాలల ఏర్పాటుకు రాష్ట్రాలు ముందుకొస్తే కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా సహకరిస్తుంది'' అని ప్రధాని చెప్పారు.

సాక్షి
విజయనగరం

ఆదివారం । 11 । సెప్టెంబర్ । 2022



రామతీర్థంలో అలరించిన కళారాధన

నెల్లిమర్ల రూరల్: దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ధర్మపథంలో భాగంగా రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం ఏర్పాటుచేసిన కళారాధన భక్తులను అలరించింది. శ్రీకాకుళం పట్టణానికి చెందిన షిర్డి సాయి సంగీత విద్యాలయానికి చెందిన మహిళలు స్వామి సన్నిధిలో భక్తి కీర్తనలు ఆలపించారు. దేవస్థాన ఈఓ ప్రసాదరావు వారికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.



37 మందికి ఉద్యోగాలు

నెల్లిమర్ల రూరల్: టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఎవల్యూజ్ ఐటీ కంపెనీ శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. 72 మంది విద్యార్థులు హాజరుకాగా.. 37 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు తెలిపారు.



కాలినడకన తిరుపతికి..

సంతకవిటి: మండలంలో పోడలి గ్రామానికి చెందిన తొత్తడి తిరుపతిరావు, హరిబాబు, చొక్కర రమణలు కాలినడకన తిరుమల తిరుపతి దేవస్థానానికి శనివారం బయలుదేరారు. 25 రోజుల్లో తిరుపతి చేరుకుని స్వామివారిని దర్శిస్తామని చెప్పారు

న్యూస్‌రీల్

ప్రతి గ్రామంలో జగనన్న స్పోర్ట్స్ క్లబ్

● కలెక్టర్ ఎం.సూర్యకుమారి



జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌ల ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం: ప్రతి గ్రామంలోనూ జగనన్నస్పోర్ట్స్ క్లబ్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌ల ఏర్పాటు ప్రచార వాల్ పోస్టర్లను తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలోని క్రీడాకారులను సంఘటిత పరిచి క్లబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. దీని కోసం ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ బి.రామానందం, చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన ఎంపీలు



కేంద్ర సహాయ మంత్రి భారతి పవార్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి భారతి పవార్‌ను విజయనగరం, అరకు ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొడ్డేటి మాధవి, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి తదితరులు హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజనుల సమస్యలు, సంక్షేమాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి వివరాలతో ఢిల్లీకు రావాలని ఆమె సూచించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యనారాయణ



మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

విజయగనరం గంటస్తంభం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృషి చేస్తోందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యనారాయణ అన్నారు. సంఘ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా జెడ్పీ కార్యాలయంలో శనివారం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో తమ సంఘం ఉద్యోగుల అనేక సమస్యల పరిష్కారానికి కృషిచేసిందన్నారు. ప్రధాన కార్యదర్శి జీ.ఆస్కారరావు మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలు పరిష్కారంలో సంఘం ముందుందన్నారు. ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్నామన్నారు. జిల్లా లోని ఉద్యోగుల సమస్యలను సంఘ జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి కంది వెంకటరమణ వివరించారు. అనంతరం సంఘానికి తాత్కాలి భవనం, స్థలం ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్ట ర్‌తో మాట్లాడి సమాచారం ఇస్తామని మంత్రి సమాధానమిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి, సంఘ నాయకులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న చంపావతి

మడ్డువలస నీటిని విడిచిపెడుతున్న దృశ్యం

ఎడతెరిపిలేని వాన



సంతకవిటి మండలం నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి నదిలో నీటి ఉద్ధృతి

- అత్యధికంగా తెర్లాం మండలంలో 60.2 మి.మీ
- అత్యల్పంగా కొత్తవలస మండలంలో 6.2 మి.మీ
- ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదులు
- మత్స్యకారులను అప్రమత్తం చేసిన అధికారులు

విజయనగరం అర్బన్/నెల్లిమర్ల/మెంటాడ/వంగర/సంతకవిటి: బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో శనివారం ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. 27 మండలాల్లో కురిసిన వర్షం 26.6 మి.మీటర్లుగా నమోదైంది.
అత్యధికంగా తెర్లాం మండలంలో 60.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వరదనీటితో చంపావతి, నాగావళి నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి.

- చంపావతి నది జన్మస్థలం ఆంధ్ర కొండల్లోనూ, మెంటాడ, గజపతినగరం మండలాల్లో భారీ వర్షాలు కురవడంతో నదిలో ప్రవాహం అధికమైంది. గడిగెడ్డ, గుర్ల గెడ్డ, ఊటగెడ్డల్లోని వరద నీరు నదిలోకి చేరుతోంది. నదిలోని వరదనీరు పూసపాటిరేగ మండలంలోని కోనాడ వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. వర్షాలు కురవడం ఇలాగే కొనసాగితే ఆదివారం నాటికి నదిలో ప్రవాహం మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.
- మడ్డువలస ప్రాజెక్టు (గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు) వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 40 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరగా శనివారం కాస్త తగ్గుముఖం పట్టి 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మూడుగేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కులను తిరిగి నాగావళి నదిలోకి విడిచిపెడుతున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 63.12 మీటర్ల నీటిమట్టం నమోదైంది. మడ్డువలస నుంచి నీటి విడుదలతో సంతకవిటి మండలం నారాయణపురం ఆనకట్ట వద్ద నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. వచ్చిన నీటిని దిగువ ప్రాంతానికి పూర్తిగా విడిచిపెడుతున్నామని ఆనకట్ట జేఈ శ్రీనివాసరావు తెలిపారు. సువర్ణముఖి నదిలో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది.
- మెంటాడ మండలంలోని ఆంధ్ర జలాశయం ఎడమ కాలువ నుంచి అనంతసాగరానికి వచ్చే బట్టి కాలువకు శుక్రవారం అర్ధరాత్రి గండి పడింది. సుమారు 60 ఎకరాల మేర వరిపంట నీట మునిగినట్టు నీటిపారుదలశాఖ డీఈ పాండు తెలిపారు. పంటనష్టం పెద్దగా లేదని తెలిపారు. స్థానిక గ్రామ సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ రైతులందరూ కలిసి గండిని శనివారం పూడ్చారు.

కూలిన ఇంటి గోడ



కూలిన పూరింటి గోడ

వంగర మండల పరిధి మద్దివలసలో శుక్రవారం అర్ధరాత్రి కోరుకొండి సింహాలకు చెందిన పూరింటి గోడ కుప్పకూలింది. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి గోడ వెలుపలికి కూలిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు.



ఆంధ్రజలాశయం పిల్లకాలువ గండిపూడ్చుతున్న రైతులు

జిల్లాలో వర్షపాతం నమోదు (మిల్లీమీటర్లలో) ఇలా..

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
తెర్లాం	60.2	గంట్యాడ	18.4
బొబ్బిలి	58.4	రాజాం	16.8
గరివిడి	56.8	దత్తిరాజేరు	15.2
గుర్ల	49.6	గజపతినగరం	14.8
వంగర	46.8	నెల్లిమర్ల	14.6
పూసపాటిరేగ	44.8	జామి	13.4
డెంకాడ	41.8	ఎల్.కోట	11.2
సంతకవిటి	41.2	విజయనగరం	11.0
ఆర్.ఆమదాలవలస	40.2	బాడంగి	10.8
చీపురుపల్లి	36.4	ఎస్.కోట	9.8
రామభద్రపురం	30.0	వేపాడ	8.4
బొండపల్లి	24.6	మెంటాడ	8.2
భోగాపురం	20.4	కొత్తవలస	6.2

గతం కంటే మిన్నగా
అమ్మ ఉత్సవం



సమీక్ష సమావేశంలో మాట్లాతున్న మంత్రి బొత్స, పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

- సామాన్య భక్తులకూ సిరిమానోత్సవానికి అనుమతి
- అమ్మవారి ఉచిత దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఏర్పాట్లపై దిశానిర్దేశం చేసిన మంత్రి బొత్స సత్యనారాయణ
- సిరిమానోత్సవం, విజయనగరం ఉత్సవాలపై సమీక్ష

విజయనగరం అర్బన్: సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ.. పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాన్ని గతంకంటే మిన్నగా, వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. విజయనగరం వైభవాన్ని చాటిచెప్పేలా విజయనగరం ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. వచ్చేనెల 10, 11 తేదీల్లో జరిగే పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాలు, 9, 10, 11 తేదీల్లో నిర్వహించే విజయనగరం ఉత్సవాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్షించారు. వివిధ వర్గాల అభిప్రాయాలను తెలుసుకున్నారు. – కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ పైడితల్లి సిరిమాను సంబరం, విజయనగరం ఉత్సవాల షెడ్యూల్‌ను, వివిధ వేదికల్లో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను తెలియజేశారు. వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన విధులు, బాధ్యతలను వివరించారు. కోవిడ్ ప్రభావం లేదని, ఈ ఏడాది సిరిమానోత్సవానికి సాధారణ భక్తులను అనుమతిస్తామని, విజయనగరం ఉత్సవాలను కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు వెల్లడించారు.

- విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ కరోనా వల్ల గత రెండేళ్లా నేరుగా సిరిమాను ఉత్సవాలను చూసే అవకాశాన్ని సామాన్య భక్తులు దూరమయ్యారన్నారు. ఉత్సవాల్లో స్థానిక ప్రముఖలను భాగస్వాములను చేయాలని, జీవితకాల సభ్యుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సామాన్య భక్తులకు ఇబ్బంది పడకుండా వీఐపీ పాసులను రద్దు చేయాలన్నారు.
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ దర్శన టిక్కెట్లను సచివాలయాలు, బ్యాంకులతోపాటు, ఆన్‌లైన్‌లో విక్రయించాలని సూచించారు. ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేసి ఉత్సవాలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని కోరారు. చివరిగా మంత్రి బొత్స మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకునేందుకు సర్వదర్శనంతోపాటు రూ.100, రూ.300 క్యూలైన్లను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఏడాది కూడా వీఐపీ పాసులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, ఉత్సవ కమిటీ జీవితకాల సభ్యులు డోల మన్మథకుమార్, ఎస్ఎస్ఎస్‌రాజు తదితరులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిరిమానోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, అలజంగి జోగారావు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎస్పీ దీపిక ఎం.పాటిల్, జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో ఎం.గణపతిరావు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, పైడితల్లి ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పైడితల్లి అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాలకులు, అధికారులు

ఎస్.కోట ఆస్పత్రికి అవార్డులు

శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో 12 విభాగాల్లో అందించిన ఉత్తమ సేవలకు జాతీయ స్థాయిలో నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ అండ్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) అవార్డు వరించింది. రోగులకు సరైన వైద్య సేవలు, పరిసరాల పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు కాయకల్ప అవార్డు వచ్చినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.ఎస్‌వీ సత్యశేఖర్ చెప్పారు. ఇది ఆస్పత్రి ఉద్యోగుల సమష్టి విజయమన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మహత్యలకు పాల్పడవద్దు

- అవగాహన ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ ఎం.దీపిక
- వైద్యులు, మిమ్స్ వైద్యవిద్యార్థులు, మహిళా పోలీసులతో ర్యాలీ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ, డీఎస్పీ తదితరులు

విజయనగరం క్రైమ్: ఏటా ఆత్మహత్యల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్న అంశమని, ఎవరూ ఆత్మహత్యల జోలికి పోకూడదని, ఆశతో జీవించాలని ఎస్పీ ఎం.దీపిక కోరారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణదినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్‌శాఖ, మిమ్స్ సైక్రియాటిస్ట్ విభాగం ఆధ్వర్యంలో కోట కూడలిలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక మాట్లాడుతూ చాలా మంది తమ సమస్యలను పెద్దవిగా ఊహించుకుంటూ, భయపడుతూ, ఆందోళన చెందుతూ, తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆత్మహత్యలకు పాల్పడేలా ఎవరైనా ప్రేరేపిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మన స్నేహితులు, కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా మానసిక స్థితి సరిగ్గా లేనట్లుగా గమనిస్తే వారిని వైద్యులకు చూపించాలన్నారు. సమస్యను పోలీసుల దృష్టికి తీసుకువస్తే సహాయం అందజేస్తామన్నారు. మిమ్స్ మానసిక వైద్య విభాగం నిపుణులు డాక్టర్ హేమంత్ మాధవ్ మాట్లాడుతూ తీవ్ర ఒత్తిడికి గురైనవారు సహాయం కోసం పడే తపనను, ఆక్రందన, ఆవేదనను మనం అర్థం చేసుకుని, వారికి ట్రీట్‌మెంట్ అందజేయాలన్నారు. వారి ఆవేదన వింటే వారిలో ఆత్మన్యూనత భావం తొలిగిపోతుందని, ఆత్మహత్యలకు పాల్పడలన్న ఆలోచనల నుంచి దూరమవుతారన్నారు. సినీగేయ రచయిత కాకర్ల గాంధీ ఆత్మహత్యలను నియంత్రించడానికి రచించిన పాటను గానం చేసి ఆహుతుల కరతాళ ధ్వనులందుకున్నారు. భారతీయ మానసిక వైద్యుల సంఘం రూపొందించిన అవగాహన వాల్ పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం అవగాహన ర్యాలీకి హాజరైన వారితో ఆత్మహత్యలకు పాల్పడబోమని, ఆ ఆలోచనలు ఉన్నవారికి సహాయం అందిస్తామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ప్రతిజ్ఞచేయించారు. ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా మిమ్స్ వైద్యకళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన జి.సాయిసింధూజ, యోగిత శర్మలకు ఎస్పీ బహుమతులను అందజేశారు. ర్యాలీ కోట కూడలి నుంచి మూడులాంతర్లు, వన్‌టౌన్ మీదుగా హెడ్‌పోస్టాఫీస్ వద్దనున్న మిమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్ వరకు సాగింది. కార్యక్రమంలో డీఎస్పీలు టి.త్రినాథ్, ఎల్.మోహనరావు, ఎల్.శేషాద్రి, టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, మహిళా సంరక్షణ పోలీసులు పాల్గొన్నారు.



ఆత్మహత్యల నివారణ దినం ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, వైద్యులు

మహిళాభ్యుదయం దిశగా అడుగులు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అడుగులేస్తుంది. మహిళాభ్యుదయానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది. మహిళా సంఘాల్లోని సభ్యుల ఆర్థిక పరిపుష్టిని మెరుగుపర్చేందుకు మరో అడుగు ముందుకేసింది. సామాజిక, సాంకేతిక జ్ఞానం కలిగిన మహిళలను ప్రోత్సహించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.

- మండలానికో మదర్ పౌల్ట్రీ, మూడు మినీ పౌల్ట్రీలు
- ప్రతి మండలంలో పది పొట్టేళ్ల యూనిట్లు
- జిల్లా వ్యాప్తంగా అమలుకు శ్రీకారం


జీఎస్‌పురంలో ఏర్పాటు చేస్తున్న మదర్ పౌల్ట్రీ షెడ్స్ పరిశీలిస్తున్న వెలుగు అధికారులు

రాజాం సిటీ: మహిళా సంఘాల సభ్యులతో ప్రతి మండలంలో ఒక మదర్ పౌల్ట్రీ, మూడు మినీ పౌల్ట్రీలు ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. మండలానికి పది పొట్టేళ్ల యూనిట్లు, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రుణాలు సైతం అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలోని 20 మండలాల్లో మదర్ పౌల్ట్రీ, పొట్టేళ్ల పెంపకం యూనిట్లకు సంబంధించి సంఘ సభ్యులను ఎంపిక చేశారు. సంఘంలోని సభ్యులు 18 నుంచి 60 ఏళ్లలోపు వయసు ఉన్నవారు ఈ పథకాలకు అర్హులుగా నిర్ణయించారు.

మండలానికో మదర్ పౌల్ట్రీ

ప్రతి మండలంలోని ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘ సభ్యులను ఎంపిక చేసి వారిచే మదర్ పౌల్ట్రీ యూనిట్‌ను ప్రారంభిస్తారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అర్హులైన మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేసే ప్రక్రియ ప్రారంభించారు. ప్రతి యూనిట్‌కు 2 వేల పిల్లలను (వారం రోజుల నుంచి 15 రోజులవి) అందజేస్తారు. వీటిని కిలో బరువు పెరిగేంత వరకు పెంపకం చేపట్టాలి. ఈ యూనిట్‌ను మహిళా సంఘాల సభ్యుల సొంత స్థలంలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందులో మౌలిక వసతులు, షెడ్ ఏర్పాటు, కోళ్ల కొనుగోలు, దాణా ఇతర అవసరాలకు ఈ యూనిట్‌కు సంబంధించి స్త్రీ నిధి, సీఐఎఫ్ ద్వారా రూ. 4 నుంచి 5 లక్షల వరకు రుణాలు మంజూరు చేయనున్నారు. మదర్ పౌల్ట్రీతో పాటు మండలానికి మూడు మినీ పౌల్ట్రీలను ఏర్పాటు చేయనున్నారు. మదర్ పౌల్ట్రీలో పెరిగిన కోళ్లను వీరు కొనుగోలు చేసి అక్కడ పెంపకం చేపట్టిన తరువాత విక్రయించుకోవచ్చు. ఇప్పటికే మదర్ పౌల్ట్రీలను 13 మండలాల్లో, మినీ పౌల్ట్రీలను 14 మండలాల్లో 39 యూనిట్లు ఎంపిక చేశారు. పెరటికోళ్ల పెంపకానికి సంబంధించి గ్రామైక్య సంఘానికి ఐదు యూనిట్లు చొప్పున ఎంపిక చేసి ఒక్కో యూనిట్‌కు 11 కోళ్లు చొప్పున అందించనున్నారు. వీటి ఒక్కో యూనిట్‌కు రూ.3900లు చొప్పున అందించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 5185 యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 2315 మందిని అధికారులు ఎంపిక చేశారు.

మండలానికి పది పొట్టేళ్ల యూనిట్లు

జిల్లాలోని అన్ని మండలాల్లో ఆసక్తి ఉన్న మహిళా సంఘ సభ్యులను గుర్తించి వారికి పొట్టేళ్ల యూనిట్లు కేటాయించనున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఒక్కో యూనిట్‌కు 8 పొట్టేళ్లు చొప్పున అందించనున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.48వేలు చొప్పున అందించి ప్రోత్సహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 270 యూనిట్లు లక్ష్యంగా అధికారులు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

చిన్న తరహా పరిశ్రమలకు ఊతం

ప్రతి మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేసి ఆర్థిక పరిపుష్టి బలపర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు సంఘంలోని సభ్యులకు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు నడుం బిగించింది. మండలానికి 10 యూనిట్లు చొప్పున కేటాయించింది. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ. 2 లక్షలు వరకు పరిశ్రమల శాఖ ద్వారా అందజేయనుంది.

వీరే అర్హులు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు సంబంధించి మహిళా సంఘ సభ్యురాలై ఉండాలి. 18 నుంచి 60 సంవత్సరాల వయసు ఉండాలి. సొంత స్థలం ఉన్న వారిని ఎంపిక చేయనున్నారు.

ఒక్కో యూనిట్‌కు నిధులు ఇలా..

- మదర్ పౌల్ట్రీ ఒక్కో దానికి సుమారు రూ. 5 లక్షలు.
- మినీ యూనిట్‌కు సుమారు రూ. 1 నుంచి 2 లక్షలు.
- పెరటికోళ్లకు రూ. 3900లు.
- పొట్టేళ్ల యూనిట్‌కు రూ. 48వేలు

మొత్తం జిల్లా వ్యాప్తంగా కేటాయించిన యూనిట్లు

- మదర్ పౌల్ట్రీకి కేటాయించిన యూనిట్లు–27
- మినీ పౌల్ట్రీకి – 81
- పెరటికోళ్లు – 5185
- పొట్టేళ్లకు సంబంధించిన యూనిట్లు – 270

సంతోషంగా ఉంది



మా మండలంలో కోళ్ల ఫారం పెట్టుకునేందుకు అధికారులు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం. దీనికి సంబంధించిన షెడ్ కూడా నిర్మాణం చేపడుతున్నాం. మాలాంటి వాళ్లకు ఇలాంటి అవకాశాలు రావడం చాలా సంతోషంగా ఉంది.
– జి.సన్యాసమ్మ, శ్రీరామా ఎస్‌హెచ్‌జీ సంఘ సభ్యురాలు, జీఎస్‌పురం, సంతకవిటి

లబ్ధిదారులను గుర్తించాం



రాజాం నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు సంబంధించి అర్హులను గుర్తించాం. నిర్దేశించిన మేరకు మదర్ పౌల్ట్రీ, మినీ పౌల్ట్రీ, పెరటి కోళ్ల యూనిట్లతో పాటు పొట్టేళ్ల యూనిట్లుకు సంఘ సభ్యులకు ఎంపిక చేశాం. దీనికి సంబంధించి ఆయా మండలాల్లో మదర్ పౌల్ట్రీ అవసరమైన షెడ్స్ ఏర్పాటు చేయిస్తున్నాం. – ఎ.చిరంజీవి, ఏరియా కో ఆర్డినేటర్, వెలుగు ఏపీ, రాజాం

సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. మండలానికి మదర్ పౌల్ట్రీతో పాటు మినీపౌల్ట్రీలు, పెరటి కోళ్లు, పొట్టేళ్ల పెంపకానికి సంబంధించిన యూనిట్లు అన్ని మండలాల్లో మంజూరు చేస్తున్నాం. ఈ యూనిట్లుకు సంబంధించి అందించిన నిధులు సొంతానికి వాడుకోకుండా యూనిట్ల అభివృద్ధికి వినియోగించాలి. – ఎ.కల్యాణచక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ, విజయనగరం

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాలూరు: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా స్టేషన్‌పై రేకుల షెడ్‌లో ఉంచిన, వివిధ కేసులలో సీజ్ చేసిన బాణసంచా ఒక్కసారిగా పేలాయి. స్టేషన్ నుంచి పేలుళ్ల శబ్దం రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా సాక్షితో ఆయన మాట్లాడుతూ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిందని తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ దిలీప్, డీఎస్పీ సుభాష్ తదితరులు ఉన్నారు.

వాతావరణ మార్పులు గమనించాలి

పార్వతీపురం: ఆక్వా రైతులు వాతావరణ మార్పులు గమనించాలని జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. అల్పపీడనం కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆక్వా రైతులందరూ వాతావరణంలోని మార్పులకు అనుగుణంగా చెరువులను పరిశీలించాలని ఆయన సూచించారు. వాతావరణంలో మార్పుల వలన ఉష్ణోగ్రతలలో హెచ్చుతగ్గులు, పీహెచ్, నీటిలో కరిగే ఆక్సిజన్‌లో మార్పులు సంభవిస్తాయని పేర్కొన్నారు. ఆక్వా చెరువు నీటిలో ఉండాల్సిన వివిధ ధాతువుల విలువలను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని సూచించారు.

రూ.5లక్షలతో వీఏఏ పరారీ


పెదకాద రైతు భరోసా కేంద్రం

ద మండలంలోని పెదకాద గ్రామ సచివాలయ రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు(వీఏఏ) ఎస్.రాఘవ ఎరువుల నగదు రూ.5లక్షలతో పరారైన ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల నుంచి రాఘవ విధులకు హాజరు కాకపోవడంతో ఈ క్రాప్ కూడా నమోదు కావడం లేదు. ఏఓ ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చి రెండు రోజుల కిందట సచివాలయానికి వెళ్లి అక్కడ రైతుల నుంచి సమాచారం సేకరించారు. ఎరువుల నగదు రైతుల నుంచి సేకరించి నగదు బ్యాంకుకు చెల్లించలేదని తేలింది. దీంతో ఏఓ, ఏడీఏ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. దీంతో పాటు సచివాలయం పరిధిలోని గోభ్యాం వలంటీర్ల ద్వారా రెండో విడత ఎరువులు తెప్పిస్తానని మరో రూ.లక్షన్నర వసూలు చేసినట్టు వలంటీర్లు చెబుతున్నారు. ఈ విషయమై ఏడీఏ మహరాజన్ వద్ద ప్రస్తావించగా వీఏఏ రాఘవ ఎక్కడ ఉన్నాడో తెలిసిందని, రెండు రోజుల్లో సచివాలయానికి వచ్చి వాడుకొన్న నగదు చెల్లిస్తామని కుటుంబ సభ్యులు శనివారం ఫోన్‌లో సమాచారం ఇచ్చారని చెప్పారు. గతంలో కూడా వి.క్రిష్ణాపురం సచివాలయంలో రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం నగదులో అవకతవకలు చేయడంతో అధికారులు పెదకాద సచివాలయానికి బదిలీ చేశారు. వీఏఏ రాఘవ రామభద్రపురం మండలం దుప్పలపూడి గ్రామానికి చెందినవాడు.

వ్యక్తి మృతి

పార్వతీపురం టౌన్: మండలంలోని ఎమ్మార్‌నగరం తోటలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడం శనివారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ వ్యక్తిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ మృతి చెందాడు. పార్వతీపురం రూరల్ ఎస్ఐ వై.సింహాచలం తెలిపిన వివరాలు.. పార్వతీపురం మండలం ఎమ్మార్‌నగరానికి చెందిన వెలమల ప్రసాద్(25)కు మద్యం సేవించే అలవాటు ఉంది. గత మూడు రోజులుగా ఇంటికి వెళ్లకుండా గ్రామ సమీపంలోని తోటలో మద్యం సేవిస్తూ ఏమీ తినకుండా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అందిన సమాచారంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

- 11 టన్నుల బియ్యం స్వాధీనం


పట్టుకున్న బియ్యం వివరాలు రికార్డులో నమోదు చేస్తున్న అధికారులు

రాజాం సిటీ: మండల పరిధి మారెడుబాక గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కొండేటి అప్పమ్మ ఇంట్లో బియ్యం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేశామని విజిలెన్స్ ఎస్ఐ రామారావు తెలిపారు. ఇంట్లో 11 టన్నుల బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీటి విలువ సుమారు రూ. 4.5 లక్షలు వరకు ఉంటుందని అంచనా వేశారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన గాడి వెంకటరావు, ముప్పల లక్ష్మణరావులపై రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం అక్రమ నిల్వలపై నిత్యం దాడులు జరుపుతామని, ఎక్కడైనా నిల్వ ఉన్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమంగా బియ్యం నిల్వ చేసిన ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. దాడిలో విజిలెన్స్ అధికారులతో పాటు సీఎస్‌డీటీ చిరంజీవరావు, వీఆర్వో రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఇన్‌హిజ్ పుట్ స్టెప్స్’ పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో శనివారం సాయంత్రం అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో పొరిపిరెడ్డి భరత్‌కుమార్ రచించిన 'ఇన్ హిజ్ పుట్ స్టెప్స్' పుస్తకావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ విసి.సుధీర్ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు జిఎస్.చలం, ఎమ్‌వీజీఆర్ పిజీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.రాజ్యలక్ష్మి, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి డాక్టర్ జీవిఎస్. జయపాలరావు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ పలువురు సాహితీ వేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

లారీలు ఢీకొని పలువురికి గాయాలు

భోగాపురం: మండల కేంద్రం భోగాపురం జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం విశాఖపట్నం నుంచి జార్ఖండ్ వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొనడంతో రెండు లారీలు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. బోల్తా పడిన లారీలను జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు.

చెరువులో పడి రైతు దుర్మరణం


గౌరినాయుడు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని జన్నివలస గ్రామంలో ప్రమాదవశాత్తు అదే గ్రామానికి చెందిన రైతు పత్తిగుళ్ల గౌరినాయుడు(47) రేగాల చెరువులో శుక్రవారం ఉదయం పడి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు... గౌరినాయుడు శుక్రవారం ఉదయం తన పొలంలో దమ్ము పట్టేందుకు వెళ్లాడు. అక్కడ దమ్ము పట్టుకుని సాయంత్రం ఇంటికి రాకపోవడంతో భార్య పార్వతి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారంతా చుట్టుపక్కల పొలాల్లో వెదికారు. ఎక్కడా కనిపించకపోవడంతో సమీప రేగాల చెరువులో కూడా వెదికి ఇంటికి వచ్చేశారు. శనివారం ఉదయం మళ్లీ రేగాల చెరువులో అన్వేషించగా గౌరినాయుడు శవమై కనిపించాడు. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. హెచ్‌సీ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గౌరినాయుడు కుటుంబ పోషకుడు కావడంతో కుటుంబ సభ్యులు, బంధువుల కన్నీరు మున్నీరవుతున్నారు.

హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు అమర్చుకోవాలి

- జిల్లా రవాణ శాఖాధికారి శశికుమార్

పార్వతీపురం: 2013 సంవత్సరం తర్వాత రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలకు విధిగా హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు అమర్చాలని జిల్లా రవాణ శాఖాధికారి ఎం.శశికుమార్ తెలిపారు. కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర రవాణ శాఖ కమిషనరు ఉత్తర్వులు జారీ చేశారని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర రవాణ శాఖ సాంకేతికపరంగా తగు ఏర్పాట్లు చేసిందని ఆయన చెప్పారు. వాహన యజమానులు, వాహన డీలర్లు, ఫైనాన్షియర్లు తదితరులు వాహనం నంబరు ప్లేటు పొందుటకు 'ఇ-ప్రగతి' వెబ్ పోర్టల్‌లో (హెచ్‌టీటీపీఎస్://.................) వాహన రిజిస్ట్రేషను సంఖ్యను నమోదు చేసి స్లాట్‌ను పొందాలని సూచించారు. నంబరు ప్లేట్ అమర్చుటకు అనుకూలమైన తేదీని, నంబరు ప్లేటును రవాణ శాఖ కార్యాలయం లేదా ఇంటి వద్ద అమర్చే వివరాలు కూడా పొందుపరచాలని ఆయన స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా రుసుము చెల్లించాలని చెప్పారు. తనిఖీలలో హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు లేనట్లు గుర్తించిన వాహనాలకు అపరాధ రుసుము విధించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ముగిసిన నాటక ప్రదర్శనలు


సీనియర్ నటి చింతకాయల రాజకుమారికి సత్కారం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: పట్టణంలోని ఆనందగజపతి కళాక్షేత్రంలో స్వర్గీయ భీమశెట్టి బాబాజీ, సుభద్రమ్మ స్మారక కళా సమితి ఆధ్వర్యంలో రంగస్థలం పేరుతో నాటక ప్రదర్శనలు రెండో రోజు ఘనంగా ముగిసాయి. వర్ధమాన కళాకారులు ప్రదర్శించిన నాటికలు ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం నిర్వహించిన సభను అతిథులు భీశెట్టి బాబ్జీ, చింతకాయల రాజకుమారి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్ధమాన కళాకారుల ప్రదర్శనలు అద్భుతమన్నారు. కళలను ప్రోత్సహించాలని, కళాకారులకు అన్ని విధాలుగా ప్రభుత్వం, సంస్థలు సహకరించాలన్నారు. అనంతరం సీనియర్ నటి చింతకాయల రాజకుమారికి దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో భీశెట్టి బాబ్జీ, ఓంశంకర్, పెద్దింటి అప్పారావు, ధవళ సర్వేశ్వరరావు, గెద్ద వరప్రసాద్, ఈపు విజయ్‌కుమార్, అబ్బులు, కళాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

కొట్టిశలో చోరీ


దొంగలు పగులగొట్టిన బీరువా

వంగర: మండల పరిధి కొట్టిశ గ్రామానికి చెందిన పత్తిగూల జోగయ్య ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. జోగయ్య కుటుంబ సభ్యులు ఎం.సీతారాంపురం వెళ్లడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రూ.ఒక లక్షా ఇరవై వేల నగదు, నాలుగు తులాలు బంగారం ఎత్తుకు వెళ్లిపోయారని బాధితుడు జోగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జోగయ్య సోదరుడు పత్తిగూల నారాయణరావు ఇంట్లో చోరీకి చొరబడి విఫలమయ్యారు. అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలన చేశారు. ఎస్ఐ సమాచారం మేరకు విజయనగరం క్లూస్ టీం కొట్టిశ గ్రామానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24కి. 10గ్రా.)	50,890–00
బంగారం(22కి. 10గ్రా.)	46,650–00
వెండి (కిలో)	58,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹138	₹246	₹ 256

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

ఒమ్మి సచివాలయంలో గ్రామసభ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామ సచివాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులు గుర్తించాలన్నారు. పని కావాలని అడిగిన వేతనదారులందరికీ పనులు కల్పించాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి ఈ కేవైసీ, ఈ పంటను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేష్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

దేవుని కృప పొందాలి

- హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్ జాన్ వెస్లీ



కేక్ కట్ చేస్తున్న సంఘ పెద్దలు

విజయనగరం టౌన్: ప్రతి ఒక్కరూ దేవుని కృప పొందాలని రాజమండ్రికి చెందిన హోసన్న మినిస్ట్రీస్ చర్చ్ పాస్టర్ జాన్ వెస్లీ తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్కనున్న సిమ్స్ బాప్టిస్ట్ చర్చ్ 148వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంచిని పెంచాలన్న దేవుని వాక్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్నారు. అనంతరం సంఘ పెద్దలు డేనియల్ గాంధీ, కె.జె.ఫిలోమాన్, ఎబ్బేజు చౌదరి, డాక్టర్ జాన్ మోజెస్, బిషప్ బాలరాజు, మధుమనోహర్, ఐజక్, రాజు, సంఘమిత్ర ఆర్ఎస్ జాన్, ఆశాజాన్‌లతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

కూలిన రక్షణ గోడ



రహదారిపై కూలిన రక్షణ గోడ

భోగాపురం రూరల్: వరుసగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. రావాడలో కొబ్బరి పంటకు నష్టం వాటిల్లడంతో పాటు వరి పంట నీట మునిగింది. అలాగే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దంతులూరి వాసుదేవవర్మ తమ పొలాలకు రక్షణ వేసుకున్న రక్షణ గోడ శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. దీంతో సుమారు ఐదు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని వర్మ తెలిపారు. రోడ్డుపై పడిపోయిన గోడను జేసీబీ సహాయంతో పక్కకు తీయించారు.

అప్రమత్తంగా ఉండాలి...



తీరప్రాంతంలో పర్యటిస్తున్న సాగరమిత్రలు

పూసపాటిరేగ: తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని మత్స్యశాఖ డీడీ నిర్మలా కుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె మాట్లాడుతూ, 11వ తేదీ సాయంత్రం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకూడదని సూచించారు. ఇదిలా ఉంటే చింతపల్లి, పతివాడబర్రిపేట, తిప్పలవలస, కోనాడ గ్రామాలలో సాగరమిత్రలు ఎస్. గౌరి, సుకన్య, ఫిషరీస్ అసిస్టెంట్ మహేష్ పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. తీరం వెంబడి ఉన్న విలువైన ఆస్తులను సురక్షిత ప్రాంతాలలో భద్రపరుచుకోవాలని సూచించారు.

వసతిగృహాల తనిఖీ



పూసపాటిరేగ కళాశాల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఏబీసీడబ్ల్యూఓ రమణ, శరణ్మయి

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని కళాశాల వసతిగృహాన్ని ఏబీసీడబ్ల్యూఓ బీవీ రమణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వసతిగృహ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాజావీధిలో గల బీసీ సంక్షేమ వసతిగృహాన్ని తనిఖీ చేశారు. అలాగే చింతపల్లి, గోవిందపురం వసతిగృహాలను పరిశీలించారు. ఆయనతో పాటు వసతిగృహ సంక్షేమ అధికారులు శరణ్మయి, జానకిరావ్, తదితరులు ఉన్నారు.

కాలుష్య కోరల్లో పల్లెలు..

- గ్రామ పరిసరాల్లో డంపింగ్‌యార్డ్
- నిర్వహణపై ప్రజారోగ్య విభాగం నిర్లక్ష్యం
- యార్డ్ నుంచి కుమిలి – విజయనగరం రోడ్డుపైకి వస్తున్న చెత్త
- కాలువలు లేకపోవడంతో రోడ్లపై ప్రవహిస్తున్న వ్యర్థ జలాలు



డంపింగ్ యార్డ్ ప్రధాన ద్వారం వద్ద పేరుకుపోయిన మురుగు

విజయనగరం: పచ్చని పైరు, స్వచ్ఛమైన గాలితో కళకళలాడాల్సిన పల్లెలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. సెలఏటి గళగళల స్థానంలో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మనస్ఫూర్తిగా గాలి పీల్చాలన్నా భయపడాల్సిన పరిస్థితి. గుక్కెడు మంచి నీళ్లు తాగాలంటే ఏ వ్యాధి సోకుతుందో ఆలోచించాల్సిన దౌర్భాగ్యం. ఒక్క డంపింగ్ యార్డ్ మూలంగా మూడు గ్రామాల్లోని ప్రజలతో పాటు విజయనగరం – కుమిలి రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. యార్డ్ నిర్వహణను కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగాధికారులు పట్టించుకోకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.

వివరాల్లోకి వెళితే...15 ఏళ్ల కిందట అప్పటి తెలుగుదేశం పార్టీ విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెత్తను తరలించేందుకు బొల్లంగిపేట పంచాయతీలోని కె.ముంగినాపల్లి గ్రామం వద్ద 20 ఎకరాల స్థలంలో డంపింగ్‌యార్డ్‌ను ఏర్పాటు చేసింది. ప్రతిరోజూ నగరంలోని 50 డివిజన్ల నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తను అక్కడికే తరలిస్తున్న అధికారులు యార్డ్ వద్ద నెలకొన్న అధ్వాన పరిస్థితులను పట్టించుకున్న పాపాన లేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా యార్డ్



రోడ్డుపై ప్రవహిస్తున్న యార్డ్ నుంచి వస్తున్న కాలుష్య జలాలు

నుంచి కాలుష్య జలాలు విజయనగరం – కుమిలి ప్రధాన రహదారిపై ఏరులై పారుతోంది. అంతేకాకుండా జలాలతో పాటు చెత్త కుడా రోడ్డుపైకి వచ్చి చేరుతుండడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. అటుగా రాకపోకలు సాగించే వారు ఆ దుర్గంధాన్ని భరించలేక యార్డ్ దాటేంతవరకు సుమారు 5 నిమిషాల పాటు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. ఇక రోడ్డుపై ప్రవహిస్తున్న కాలుష్య జలం శరీరానికి తాకితే చర్మవ్యాధుల బారిన పడక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి రోజూ 125 మెట్రిక్ టన్నుల చెత్త..

విజయనగరం కార్పొరేషన్ నుంచి ప్రతిరోజూ తడిర, పొడి చెత్త 125 మెట్రిక్ టన్నులను గణపూరుపేట డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తుంటారు. అయితే ఏళ్ల తరబడి ఈ ప్రక్రియ సాగుతుండగా.... యార్డ్ నిర్వహణను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో వాహనాల ద్వారా తరలించే చెత్తను ఎక్కడికక్కడ గుట్టలుగా వేయడంతో పరిస్థితి దారుణంగా మారుతోంది. యార్డ్ ప్రాంగణంలోకి చెత్త తరలించే వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసే సమయంలో యార్డ్‌లోని చెత్త రోడ్డుపైకి వస్తోంది. ఇదే విషయమై కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా... డంపింగ్ యార్డ్ నిర్వహణపై దృష్టి సారిస్తామన్నారు. ఇబ్బందికర పరిస్థితులను పరిష్కరిస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం



లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

భోగాపురం: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుకున్నారు. అలాగే సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చారన్నారు. మేనిఫెస్టో అమలు చేయాడంతో పాటు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టారని చెప్పారు. జగనన్న చేపడుతున్న సంక్షేమ అభివృద్ధిని చంద్రబాబు చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లుతున్నాడని ఆరోపించారు. ఈ సందర్భంగా స్థానికులు తెలియజేసిన పలు సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జల్‌జీవన్ పథకం కింద భోగాపురం గ్రామానికి రూ.2.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు, మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత, వైస్ ఎంపీపీలు పడాల సత్యవతి, రావాడబాబు, రాష్ట్ర హౌసింగ్, మత్స్య శాఖల డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, ఎం.నరసింహులు, సర్పంచ్ ఊడికల అప్పయ్యమ్మ, కొమ్మూరు సుభోషణరావు, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, పడాల భాను, తదితరులు పాల్గొన్నారు.

హైర్ బస్ డ్రైవర్లకు జీతాలు చెల్లించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: హైర్ బస్సు డ్రైవర్లకు జీతాలు చెల్లించాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ జగన్‌మోహన్‌రావు, హైర్‌బస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కె. సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్ రాంబాబును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి పూజలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఉమా సదాశివస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో కామాక్షి అమ్మవారి సన్నిధిలో హోమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

విజయనగరం ఫూల్‌బాగ్: ఈ నెల 12న స్థానిక కేఎల్ పురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జరగబోయే డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా కన్వీనర్ ఎస్. రుద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.గణేష్, సీహెచ్‌అరవింద్, ఎ. మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

పోలిపల్లి పీహెచ్‌సీకి అవార్డ్



కలెక్టర్ సూర్యకుమారి చేతుల మీదుగా అవార్డ్ అందుకుంటున్న పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి

భోగాపురం రూరల్: రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించిన అవార్డ్ లభించింది. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ సూర్యకుమారి చేతుల మీదుగా శుక్రవారం అవార్డు అందుకున్నట్లు డాక్టర్ తిరుపతిస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతేడాది కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి రెండు బృందాలు వచ్చి ఆస్పత్రిని పరిశీలించాయని చెప్పారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, పరిపాలనా విభాగం, ల్యాబ్ నిర్వహణ, లేబర్ గది నిర్వహణ, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాలను కూలంకుషంగా పరిశీలించారన్నారు. ఆయా విభాగాల్లో ఉత్తమ సేవలందిస్తుండడంతో అవార్డ్ ప్రకటించారని తెలిపారు. సిబ్బంది కృషి వల్లే అవార్డ్ వచ్చిందని చెప్పారు.

తెలుగు పద్య పఠనానికి స్పందన



శ్లోక అర్థం, భావం వివరిస్తున్న డాక్టర్ గోపాలరావు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ స్వగృహంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం నిర్వహించిన తెలుగు పద్య పఠనం శిక్షణ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. భర్తృహరి సుభాషితాలు, గురజాడ దేశభక్తి గేయం, తదితర అంశాలపై కాళ్ల నిర్మలా భాగవతారిణి, డాక్టర్ ఎ.గోపాలరావు, మానాప్రగడ సాహితి, ఈపు విజయ్‌కుమార్ అవగాహన కల్పించారన్నారు. వచ్చే వారం నుంచి ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు





చిన్నారుల నృత్య ప్రదర్శన

విజయనగరం: శాస్త్రీయ నృత్య పోటీలకు విశేష స్పందన లభించింది. రోటరీ ప్రధాన క్లబ్ యూత్ మంత్ ఉత్సవాలలో భాగంగా శనివారం స్థానిక రోటరీ సామాజిక భవనంలో నిర్వహించిన పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలిచ్చారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులను వారు చదువుతున్న తరగతుల ఆధారంగా సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా వేరుచేసి పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన రోటరీ మెయిన్ క్లబ్ అధ్యక్షురాలు డి.ఉమాబాలాజీ మాట్లాడుతూ, ప్రతి విభాగంలోనూ విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. పట్టణానికి చెందిన నర్తనశాల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ బి. రాధికారాణి, జి.వినోద్, మాటూరు మురళీకృష్ణ, హేమకుమార్, బీవీ శ్రీనివాస్, రోటరీ ప్రతినిధులు పాల్గొనగా.. శైలజ, సూర్యకుమారి, సుధ పూర్ణిమ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి



అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచిలిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ప్రజా ప్రతినిధులు తెలియజేసిన సమస్యలపై అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదేశించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామంలో చెరువులు లేనందున ఉపాధిహామీ పనులు లేక వేతనదారులు ఇబ్బంది పడుతున్నారంటూ చేపలకంచేరు సర్పంచ్ ఎ.నరసింగరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వేతనదారులకు వేరే పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓ అదిబాబుకు సూచించారు. రావాడ గ్రామంలో రహదారి సమస్యను సర్పంచ్ అప్పురభక్త పైడినాయుడు అధికారుల దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే చాలా గ్రామాల్లోని రహదారి సమస్యలను పరిష్కరించామని, త్వరలోనే రావాడతో పాటు మిగిలిన పంచాయతీల్లోని రహదారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం మరికొన్ని సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ సలహాదారుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత, వైస్ ఎంపీపీలు రావాడబాబు, పడాల సత్యవతి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ బంగారునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ డీఈలు వైకుంఠరావు, రమణ, ఈఓపీఆర్‌డీ సురేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నాలుగో డివిజన్ పరిధిలోని చిన్నగెడ్డ వీధిలో వినాయక ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మన సనాతన సంప్రదాయాలను కాపాడడానికి యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ పొట్నూరు వెంకటి, డివిజన్ యూత్ అధ్యక్షుడు రాజేష్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రూప, ఉత్సవ కమిటీ నిర్వాహకులు లక్ష్మణరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామతీర్థంలో అన్నదానం..



నెల్లిమర్ల రూరల్: అన్నదానం చేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో విశాఖకు చెందిన హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ ప్రతినిధులు అన్నదానం నిర్వహించారు. సంస్థ ప్రతినిధి రాధాకృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. పది సంవత్సరాల్లో సుమారు 30 లక్షల మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. విశాఖలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, విజయనగరంలోని రామతీర్థం దేవస్థానంలో ఇక నుంచి ప్రతి శనివారం 100 మంది భక్తులకు అన్నదానం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాదరావు, అర్చకులు పాల్గొన్నారు.

వర్షాలతో అన్నదాతకు కష్టాలు



నీట మునిగిన వరి పొలాలు



కొబ్బరి తోటల్లో నిలిచిన వర్షపు నీరు

భోగాపురం రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వరి నారుమడులు, పూల తోటలు నీట మునగగా.. కొబ్బరి చెట్లకు తెగుళ్లు సోకాయి. కొద్దిరోజుల కిందట కురిసిన జల్లులకు రైతులు నారుమడులు సిద్ధం చేశారు. నారు మడుల్లో పశువుల గత్తం, ఎరువులు వేశారు. అయితే వర్షాలకు నారుమడులు, పూల తోటలు పూర్తిగా మునిగిపోయాయి. అలాగే కొబ్బరి, సరుగుడు, జీడిమామిడి తోటల్లో కూడా మోకాళ్ల లోతు నీరు నిలిచిపోవడంతో తెగుళ్ల బెడద ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వేణుగోపాల్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక గాయత్రి జూనియర్ కళాశాలలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సకాలంలో ప్రథమ చికిత్స అందించడం వల్ల రోగుల ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. గుండె ఆగినప్పుడు సీపీఆర్ పద్ధతి అవలంభిస్తే రోగి బతికే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం గాయాలు తగిలినప్పుడు, పాము కరిచినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ గౌరీశంకర్, దుర్గాప్రసాద్, రెడ్‌క్రాస్ కార్యదర్శి సత్యం,తదితరులు పాల్గొన్నారు.

బై బై గణేశా..

వినాయక ఉత్సవాలు ముగిశాయి. జిల్లా కేంద్రంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శనివారం రాత్రి మేళ,తాళాల మధ్య ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువతీ,యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న వినాయక విగ్రహం



నృత్యం చేస్తున్న అమ్మాయిలు

సిగ్గుందారా దరిద్రుడా!?

- కొడాలి నానిపై అసభ్య పదజాలంతో టీడీపీ నేతల తిట్ల పురాణం
- బాబు దయతో రెండుసార్లు గెలిచిన బడుద్ధాయి
- 2024లోపు మమ్మల్ని చంపెయ్యి.. లేదంటే నిన్ను చంపేస్తాం
- ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని పోలీసులకు టీడీపీ నేతలు ఉమా, నెట్టెం, బుద్దా ఫిర్యాదు

తాడేపల్లి రూరల్: 'గుడివాడ గూట్లేగాడు, చెత్త నా కొడుకు, దరిద్రుడు, విశ్వాస ఘాతకుడు, నీకు భిక్ష పెట్టింది ఎవడ్రా బడుద్ధాయి? చంద్రబాబు దయవల్ల ఆయన కాళ్లమీద పడి బీఫారం, డబ్బులు తీసుకుని రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బడుద్ధాయి'.. అంటూ మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)పై టీడీపీ నేతలు అసభ్య పదజాలంతో, పత్రికల్లో రాయలేని పదజాలంతో మండిపడ్డారు. అంతేకాక, కొడాలి నాని ఇష్టానుసారం మాట్లాడుతున్నారని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి దేవినేని ఉమా, టీడీపీ విజయవాడ పార్లమెంట్ ఇన్‌ఛార్జి నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మీడియాతో మాట్లాడారు. వారు ఏమన్నారంటే.. మహానుభావుడు ఎన్టీ రామారావు కుటుంబాన్ని వేలెత్తి చూపిస్తావా? మొన్న అమెరికా వెళ్తే నీ భాష వల్ల గుడివాడ అని చెప్పుకోవడానికి అక్కడివాళ్లు బాధపడుతున్నారు. జిల్లాలో పేకాట ఆడించటం, ఇసుక దోచుకోవడం తప్ప ఒక్క మంచి పనిచేశావా? సిగ్గుందారా దరిద్రుడా? ఓ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని లోకేశ్‌బాబు మొన్న ప్రశ్నిస్తే నువ్వు ఈ భాష మాట్లాడతావా? గుడివాడ ప్రజలు నిన్ను తరిమితరిమి కొట్టడానికి సిద్ధంగా ఉన్నారు.

నోరు అదుపులో పెట్టుకో..

సభ్యతా సంస్కారం మరచిపోయి భయం లేకుండా బరితెగించి మాట్లాడుతున్నావు బడుద్ధాయి. నిన్ను ఈ సమాజం క్షమించదు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది దరిద్రుడా. నోరు అదుపులో పెట్టుకో. నానీ.. 2024లోపు మమ్మల్ని చంపెయ్యి. మేం చచ్చిపోతే నీకేమీ ఉండదు. లేదంటే నిన్ను చంపేస్తాం. నీకు లాస్ట్ అండ్ ఫైనల్ వార్నింగ్ ఇది. దీనికి ఒకటే సమాధానం... అని అన్నారు.

పాదయాత్ర కాదు.. ఉత్తరాంధ్రపై చంద్రబాబు దాడి

- అమరావతి పరిరక్షణ సమితికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం చంద్రబాబే..
- బాబు కుటిల రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు
- ఉత్తరాంధ్ర వెనుకబాటుకు టీడీపీయే కారణం
- విశాఖ పరిపాలన రాజధాని అయితేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి
- డిప్యూటీ సీఎం రాజన్నదొర


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: అమరావతి పరిరక్షణ పేరుతో చేపట్టిన యాత్ర పాదయాత్ర కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు చేస్తున్న దాడి.. అని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చెప్పారు. ఆయన శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు టీడీపీయే కారణమని, ఇప్పుడు విశాఖను పరిపాలన రాజధాని కాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. అన్ని వసతులు ఉండి, ఆసియా ఖండంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంను పరిపాలన రాజ ధానిగా చేయడాన్ని టీడీపీ వ్యతిరేకించడం దారుణమన్నారు. చంద్రబాబు వేసిన కమిటీ తప్ప మిగతా ఏ కమిటీలూ అమరావతిని రాజధానిగా చేయాలని సూచించలేదని చెప్పారు. అమరావతి పరిరక్షణ సమితికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం చంద్రబాబేనన్నారు. బాబు ఉత్తరాంధ్ర ద్రోహిగా చరిత్ర పుటల్లోకి ఎక్కుతారని పేర్కొన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ టీడీపీ అని చంద్రబాబునాయుడు అనడం ఆయనకు వయసు పైబడిందని చెప్పటానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. అమరావతి ప్రాంతంలో ఉన్న 29 గ్రామాలు, అక్కడ స్థిర, చరాస్తులు దోచుకున్న వారి పరిరక్షణే బాబు ధ్యేయమన్నారు. అక్కడి ఆస్తులు అధిక ధర పలకాలని, మిగిలిన ప్రాంతాలు ఆర్థికంగా, రాజకీయంగా, ప్రాంతీయంగా అన్యాయమైనా పర్వాలేదనే దుష్టబుద్ధితో చంద్రబాబు, టీడీపీ నేతలు చేస్తున్న కుటిల రాజకీయ యత్నాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కోర్టు తీర్పును తాము గౌరవిస్తున్నామని చెప్పారు. పాదయాత్రలో ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా మాట్లాడినా, ఏమైనా ఘటనలు జరిగినా.. దానికి ఈ డ్రామాను ఆడిస్తున్న చంద్రబాబే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారని తెలిపారు. మూడు రాజధానులతోనే సమన్యాయం, సమధర్మం, అభివృద్ధి సాధ్యమవుతుందని పునరుద్ఘాటించారు. టీడీపీ కుటిల రాజకీయాన్ని ఉత్తరాంధ్ర ప్రజలు, మేధావులు, యువత అర్థం చేసుకోవాలని కోరారు.

ఊరూరా అదే జోరు


పల్నాడు జిల్లా చినతురకపాలెంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


కర్నూలు జిల్లా పెంచికలపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ సంజీవకుమార్, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్


శ్రీకాకుళం జిల్లా బిరుబడియాలో జగనన్న కాలనీల పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. అన్ని జిల్లాల్లో శనివారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజాప్రతినిధులను ప్రజలు దీవిస్తున్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుపై దుష్టచతుష్టయం కుట్ర

- సీఎం జగన్ కేంద్రంతో పోరాడి ఈ ప్రాజెక్టు సాధించారు
- మత్స్యకారుల మనుగడకు ఇబ్బంది ఉండదు
- కలుషిత నీటిని శుద్ధిచేసి సముద్రంలో వదిలే ఏర్పాట్లు చేశారు
- కోనసీమ అభివృద్ధికి సీఎం బాటలు వేశారు
- అభివృద్ధిని అడ్డుకోవడమే చంద్రబాబు అండ్ కో లక్ష్యం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రంతో పోరాడి రాష్ట్రానికి సాధించిన బల్క్ డ్రగ్ పార్కును అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు, దుష్టచతుష్టయం కుట్ర పన్నుతున్నాయని, అందులో భాగంగానే రకరకాల లేఖలు రాస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ధ్వజమెత్తారు. అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు అండ్ కో.. పని చేస్తోందని దుయ్యబట్టారు. ఆయన శనివారం తునిలో విలేకరులతో మాట్లాడారు. పెరుమాళ్లపురం–కోదాడ మధ్య బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు విషయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారని చెప్పారు. మత్స్యకారులకు, హేచరీలకు ఇబ్బంది లేకుండా ఉన్నతస్థాయిలో పరిశీలన, పరీక్షలు చేశారని, కలుషిత నీటిని శుద్ధి చేసి 53 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో వదిలే ఏర్పాట్లు చేశారని వివరించారు. కోనసీమలో అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. ఇటువంటి నిర్ణయం తీసుకున్నందుకు



అందరూ సీఎంను అభినందిస్తున్నారని చెప్పారు. విపక్షాలు, దుష్టచతుష్టయం మాత్రం కాలుష్యమంటూ దీనిని అడ్డుకొంటున్నారని అన్నారు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో టీడీపీ ప్రభుత్వం దివీస్ మందుల పరిశ్రమకు అనుమతులు ఇచ్చినప్పుడు ఇవన్నీ గుర్తుకు రాలేదా... అని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును ప్రశ్నించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బ్లాక్ మార్కెట్, మట్కా, పేకాట, వైట్‌కాలర్ మోసగాళ్లు ఏ మేర ప్రజలను మోసం చేశారో.. దుష్టచతుష్టయమైన చంద్రబాబు, ఎల్లో మీడియా కలిసి అంతకు మించి ప్రజల సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఒకరు కిరసనాయిల్, మరొకరు పచ్చళ్లు, ఇంకొకరు హెయిర్ ఆయిల్ వ్యాపారం పేరుతో లక్షల కోట్ల రూపాయలు ప్రజల నుంచి దోచుకున్నారన్నారు. దుష్టచతుష్టయం బారి నుంచి కేసీఆర్ తెలంగాణను రక్షించుకున్నారని, ఇప్పుడు మన రాష్ట్రంపై హైదరాబాద్‌లో ఉండి బురద జల్లుతున్నారని విమర్శించారు. చంద్రబాబు మాత్రమే సీఎంగా ఉండాలన్నది వీరి కుటిల నీతి అని అన్నారు. కరోనా తర్వాత దేశంలో అత్యధిక జీడీపీ సాధించిన రాష్ట్రాల్లో ఏపీ ముందు వరుసలో ఉందని మంత్రి గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, అయితే అదంతా తానే చేశానని చంద్రబాబు అనడం.. దానిని ఎల్లో మీడియా వండి వార్చడం పరిపాటిగా మారిందన్నారు. ప్రజల ముందుకు వచ్చి యాత్ర చేస్తే గుణపాఠం చెబుతారని చెప్పారు. అమరావతి 26 గ్రామాలకే సంపదను కట్టబెట్టి, మిగిలిన రాష్ట్రంలోని ప్రజలను బిచ్చగాళ్లను చేయాలని చూశారని తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు.

జన్మభూమి కమిటీలతో దోచుకున్నది టీడీపీ నేతలే

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



మాడుగుల: చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పథకానికో పేరు పెట్టి పేద ప్రజలను దోచుకున్న నీచ చరిత్ర టీడీపీ నేతలదని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దుయ్యబట్టారు. ఆయన శనివారం అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థపై మాట్లాడే హక్కు అయ్యన్నపాత్రుడికి లేదని అన్నారు. జన్మభూమి కమిటీల పేరిట సర్పంచ్‌లు, ఎంపీటీసీల హక్కులను కాలరాసి, పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది మీరు కాదా.. అని ప్రశ్నించారు. మద్యం డిస్టలరీలకు లైసెన్స్‌ల జారీలో కోట్లాది రూపాయలు దోచుకున్నది టీడీపీ నేతలేనని, దీనిని నిరూపించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉంటూ చంద్రబాబు లైసెన్స్‌లు మంజూరు చేశారని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల చెంతకే పాలనను అందిస్తున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా ఎంతో మంది యువతకు ఉపాధి కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. టీడీపీ దోపిడీ, అరాచకాలను భరించలేక ప్రజలు 2019 ఎన్నికల్లో ఆ పార్టీని, నర్సీపట్నంలో అయ్యన్నను చిత్తుగా ఓడించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ ఓటమి తప్పదని గుర్తించే టీడీపీ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు రావాలని అయ్యన్నకు సవాల్ విసిరారు.

అశాంతి సృష్టికి టీడీపీ ప్రయత్నం

- పాదయాత్ర పేరుతో విద్వేషాలు రగిలిస్తున్నారు
- విశాఖ రాజధాని వద్దు అని అక్కడి వారిని రెచ్చగొడతారా?
- మహిళలను అడ్డంపెట్టుకొని రాజకీయం చేసే చరిత్ర బాబుది
- ప్రజల గుండెల్లో ఉన్న సీఎం జగన్‌ని అంగుళం కూడా కదల్చలేరు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తెలుగుదేశం పార్టీ అమరావతి రైతులను రెచ్చగొడుతోందని, రాష్ట్రంలో అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ధ్వజమెత్తారు. మహా పాదయాత్ర పేరుతో విద్వేషాలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. విశాఖ రాజధాని వద్దు అని విశాఖపట్నానికి వెళ్లి అక్కడి వారిని రెచ్చగొడతారా అని



ప్రశ్నించారు. విశాఖ వద్దు.. అమరావతి ముద్దు అంటే వారు ఊరుకుంటారా అని నిలదీశారు. శనివారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలన వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్‌కు అధికార పిచ్చి బాగా ముదిరిందని, వారిని పిచ్చాస్పత్రిలో చేర్పించాలని అన్నారు. కోడిగుడ్డు, బోడిగుండుపై ఈకలు పీకే చందాన ప్రవర్తించడం తప్ప వారి వల్ల ఏమైనా ఉపయోగం ఉందా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ బ్రోకర్లు, జోకర్లకు వేదికగా మారిందని మండిపడ్డారు. ఆడవాళ్లని అడ్డంపెట్టుకుని రాజకీయం చేసే వ్యక్తి చంద్రబాబు అని, సత్తు రూపాయి కింద తయారయ్యాడని విమర్శించారు. అసెంబ్లీలో భువనేశ్వరిని ఎవరూ ఏమీ అనకపోయినా ఏదో అనేశారని సానుభూతి కోసం డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ ఒక ఫేక్ పార్టీ అని అన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్నారని అన్నారు.

లిక్కర్ స్కాం అంటూ కుట్ర రాజకీయాలు

సీఎం సతీమణికి సంబంధం లేకపోయినా లిక్కర్ స్కాం అంటూ కుట్ర రాజకీయాలు చేయటం సరి కాదని కొట్టు సత్యనారాయణ అన్నారు. అసలు భారతమ్మ పేరు ఉచ్చరించే స్థాయి టీడీపీ నేతలకు లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఎంతో సమర్థవంతంగా పరిపాలన అందిస్తున్నారని, ఈ ప్రభుత్వం ఇలాగే ఉంటే టీడీపీకి పుట్టగతులు ఉండవనే చంద్రబాబు అండ్ కో టన్నుల కొద్దీ విషం కక్కుతోందని ధ్వజమెత్తారు. వెంటిలేటర్ మీద ఉన్న చంద్రబాబు పార్టీని బతికించాలని ఎల్లో మీడియా, దత్తపుత్రుడు ఎంత కష్టపడినా ఉపయోగం లేదన్నారు. చంద్రబాబుని నమ్మే స్థితిలో ప్రజలు లేరని చెప్పారు. ప్రజల గుండెల్లో ఉన్న సీఎం వైఎస్ జగన్‌ని అంగుళం కూడా కదల్చలేరని చెప్పారు.

విజయదుర్గకు పున్నమి పూజలు


విజయదుర్గకు వెయ్యి మందారాలతో అర్చనలు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నానుబాల వీధిలో వెలసిన విజయ దుర్గ అమ్మవారికి శనివారం భాద్రపద పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్ర మందారాలతో అర్చనలు జరిగాయి. అనంతరం దుర్గా హోమం కూడా నిర్వహించారు.

కేఎల్ఎన్‌పేట లడ్డూ రూ.1.22 లక్షలు


లడ్డూను దక్కించుకున్న అప్పారావు దంపతులు

జలుమూరు: వినాయక చవితి సందర్భంగా జోనంకి పంచాయతీ కేఎల్ఎన్‌పేటలో శనివారం నిర్వహించిన గణపతి లడ్డూ వేలం పాట భారీ ధర పలికింది. గ్రామానికి చెందిన కొత్తకోట అప్పారావు నీలవేణి దంపతులు రూ.1.22 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

'బైండోవర్ కేసులు ఉపసంహరించుకోవాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగ, ఉపాధ్యాయులపై బైండోవర్ కేసులు నమోదు చేయడం ప్రభుత్వానికి తగదని ఏపీసీపీఎస్‌ఈఏ ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణని ఏపీసీపీఎస్‌ఈఏ ఉద్యోగులు కలిసి ఉద్యోగ ఉపాధ్యాయులపై పెట్టిన బైండొవర్ కేసులు తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. దీనిపై మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ సోమవారం ఉదయం కేసులన్నీ తీసివేయడం జరుగుతుందని, డీజీపీతో మాట్లాడామని తెలిపారు.

అధికారులపై కలెక్టర్ కొరడా

- నర్సాపురం వీఆర్‌ఓ సస్పెన్షన్
- టెక్కలి ఆర్డీఓ, టెక్కలి, సంతబొమ్మాళి ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులు
- 15 నాటికి ప్రారంభం కాని భవనం ఉండరాదని కలెక్టర్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం, పాతబస్టాండ్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాధాన్యత అంశాల భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని, ఈ నెల 15 నాటికి పనులు ప్రారంభం కాని భవనం ఉండరాదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతున్న రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వెల్నెస్ సెంటర్స్ భవన నిర్మాణాలకు సంబంధించి పనులపై ఆరా తీశారు. మందస, ఇచ్చాపురం, జి.సిగడాం మండలాల్లో అన్ని భవనాలు పూర్తయ్యాయని, మిగిలిన 27 మండలాల్లో పనులు పూర్తికానందున ఈ రోజు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో నేటికి 690 భవన నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయని, 186 భవన నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే జిల్లా వెనుకబడిపోతోందని అన్నారు.

అధికారులపై చర్యలు..

లక్ష్యాలు నిర్దేశించి ఏడాది అవుతున్నా ఇంకా పనులు చేయకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. టెక్కలి ప్రధాన కేంద్రంలో 10 భవనాలు ప్రారంభం కాకపోవడంపై టెక్కలి ఆర్‌డీఓకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు జారీచేయాలని జిల్లాపరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్‌ను ఆదేశించారు. అలాగే సంతబొమ్మాళి మండలం హెచ్‌ఎం పేట భవన నిర్మాణానికి సంబంధించిన ఏజెన్సీ సిమెంట్ తీసుకుని వెళ్లి పనులు ప్రారంభించకపోవడంపై మండిపడ్డారు. ఆ ఏజెన్సీపై పోలీసు కేసు నమోదు చేయాలన్నారు. ఈ విషయమై క్వాలిటీ కంట్రోల్‌లో ఆనాడు విధులు నిర్వహించిన ఏఈ, డీఈలపై చర్యలు చేపట్టాలని ఆర్డీఓను ఆదేశించారు. నర్సాపురంలో స్థలం సేకరించకపోవడంతో తహసీల్దార్ పై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారికి ఆదేశించారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించకుండా స్థలం లేదని చెప్పడంతో నర్సాపురం వీఆర్‌ఓను సస్పెండ్ చేయాలని చెప్పారు.

అలాగే పొందూరు, ఆమదాలవలస మండలాల్లో 51 భవన నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వచ్చే వారానికి పనులు ప్రారంభం కాకపోతే అధికారులందరిపై చర్యలు తప్పవన్నారు. స్థలాల సమస్య ఉంటే ప్రత్యామ్నాయ స్థలాలు చూడాలన్నారు. హిరమండలం రుగడ గ్రామంలో ఒక్క భవనం ప్రారంభం కాకపోవడం, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ హాజరు కాకపోవడంపై వివరణ కోరారు. సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

ప్రభుత్వ భూములు చూపించండి..

వజ్రపుకొత్తూరు మండలం చినవంక గ్రామంలో 18 వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, కేవలం 10 సెంట్ల భూమి సేకరించలేకపోవడంపై వీఆర్‌ఓపై మండిపడ్డారు. జలుమూరు మండలం సి.ఆర్ పురంలో రానున్న వారంలో పనులు పూర్తి కావాలన్నారు. సుబ్రహ్మణ్యపురం, వెంకటాపురం గ్రామాల్లో రానున్న మూడురోజుల్లో పనులు ప్రారంభించాలన్నారు. పాతపట్నం మండలం తామర, చెంగుడి, పాతపట్నం, తిడిమి గ్రామంలో ప్రారంభం కాని భవనాలు వచ్చేవారంలో ప్రారంభం కావాలని, లేకపోతే చర్యలు తప్పవని అన్నారు. పలాస మండలంలోని గురుదాసుపురం, మామిడిమెట్టు, లక్ష్మీపురంలో 6 భవనాలు ప్రారంభించకపోవడంపై ఆరా తీశారు. మేఘవరంలో నిర్మాణం చేపట్టకపోవడానికి కారణాలు తెలుసుకుని సూచనలు చేశారు.

'శ్రీకాకుళ ఉద్యమంలో మహిళల పాత్ర కీలకం'


ప్రసంగిస్తున్న చిట్టిపాటి వెంకటేశ్వర్లు

పలాస: శ్రీకాకుళం జిల్లా గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు చెప్పారు. పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరంలో శనివారం అదే గ్రామానికి చెందిన శ్రీకాకుళం విప్లవ వీరుడు పోతనపల్లి అప్పలస్వామి(కుమారన్న) 24వ వర్ధంతి సభ జరిగింది. అలాగే ఆయన భార్య, శ్రీకాకుళం పోరాట యోధురాలు జయమ్మ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ కూడా జరిగింది. న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆనాడు కుమారన్న దంపతులు గిరిజన ప్రాంతంలో అటవీ సంపదను కాపాడడానికి, గిరిజన హక్కుల కోసం వారితో ఉండి పోరాడారని, నేడు కూడా అనేక ప్రాంతాల్లో అటవీ సంపద పరిరక్షణ కోసం దేశంలో పోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. సహజ వనరులను బహుళ జాతి కంపెనీలకు ధారాదత్తం చేయడం తగదన్నారు.

'అమరావతి బూటకపు యాత్రను అడ్డుకుంటాం'


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు చింతాడ రవికుమార్

ఆమదాలవలస: అమరావతి అరసవల్లి యాత్ర టీడీపీ చేస్తున్న బూటకపు యాత్ర అని, ఈ యాత్ర జిల్లాలో అడుగుపెడితే అడ్డుకుంటామని వైఎస్ఆర్‌సీపీ నాయకులు చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. విశాఖలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటు చేస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వైజాగ్ మరో హైదరాబాద్‌లా మారుతుందన్నారు. ఈ విషయాన్ని అమరావతి రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. చంద్రబాబు, పచ్చ మీడియా బూటకపు మాటలను నమ్మవద్దని సూచించారు. శివరామకృష్ణ కమిటీ కూడా విశాఖపట్నంను రాజధానిగా చేయమని సిఫారసు చేసినట్లు గుర్తు చేశారు. ఇలాంటి యాత్రలతో టీడీపీ ప్రాంతాల మధ్య వైషమ్యాలు పెంచేందుకు కుట్ర పన్నుతోందన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు తన తాబేదార్లను రాష్ట్రాన్ని దోచిపెట్టారని విమర్శించారు. టీడీపీ నాయకులకు బుద్ధి చెప్పేందుకు ఈ యాత్ర శ్రీకాకుళం రానీయకుండా అడ్డుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు పి.రామారావు, చింతాడ రాఘవేంద్రరావు, తమ్మినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రేజ్ అపూర్వం

- రాష్ట్రంలో అంతర్జాతీయ ప్లేయర్స్‌కు కొదవలేదు
- క్రీడాకారులకు వసతులు, సౌకర్యాల కల్పన, కోచ్‌ల నియామకం
- విలేకరుల సమావేశంలో ఏపీబీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంకమ్మ చౌదరి


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ అంకమ్మ చౌదరి, పక్కనే కె.సాగర్

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడా ప్రపంచంలో క్రికెట్ కంటే బ్యాడ్మింటన్‌కే క్రేజ్ ఎక్కువగా ఉందని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి, శాప్ మాజీ చైర్మన్ డాక్టర్ పి.అంకమ్మ చౌదరి అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా ఈనెల 8 నుంచి జరుగుతున్న ఏపీ రాష్ట్ర సబ్–జూనియర్స్ బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2022 పోటీలను అంకమ్మ చౌదరి స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ అంకమ్మ చౌదరి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధికమంది రిజిస్టర్డ్ ప్లేయర్స్ కలిగిన ఏకైక క్రీడ షటిల్ బ్యాడ్మింటన్ అని పేర్కొన్నారు. బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) వెల్లడించిన క్యాలెండర్ ప్రకారం తొలుత జిల్లాస్థాయి చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించినట్టు చెప్పారు. ఈ పోటీలకు ఆయా జిల్లాల్లో 500 నుంచి 700 మంది వరకు క్రీడాకారులు హాజరైనట్టు గణాంకాలు చెబుతున్నాయన్నారు.

అన్ని ప్రాంతాల్లోను స్టేట్ మీట్‌లు..

స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలను అన్ని ప్రాంతాల్లోను నిర్వహించాలని ఏపీబీఏ తీర్మానించిందని అంకమ్మ చౌదరి వెల్లడించారు. ఇప్పటికే జూనియర్స్ విభాగంలో పోటీలు కాకినాడ వేదికగా, సీనియర్స్ విభాగంలో పోటీలు నంద్యాల వేదికగా జరిగాయన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం వేదికగా సబ్‌జూనియర్స్ విభాగంలో చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నట్టు చెప్పారు. అండర్–17, 19, సీనియర్స్ విభాగంలో నేషనల్స్ మీట్‌కు క్రీడాకారులు హాజరవుతారన్నారు.

బ్యాడ్మింటన్‌కు ఎనలేని ఆదరణ..

రాష్ట్రంలో గతంలో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో బ్యాడ్మింటన్‌కు ఎనలేని ఆదరణ లభిస్తోందని అంకమ్మ చౌదరి అన్నారు. క్రీడాకారుల్లో పోటీతత్వం పెరిగిందని, ఎంపికలకు, పోటీలకు అత్యధిక మంది హాజరవుతుండటం వల్ల స్టాండర్డ్స్ కూడా పెరుగుతున్నాయన్నారు. అన్ని వసతులు, సదుపాయాల కల్పనతో పాటు కోచ్‌లను కూడా నియమిస్తామని చెప్పారు. స్టేట్ మీట్‌లు అక్టోబర్ నెలలో అండర్–15 పోటీలు పొట్టిశ్రీరాములు జిల్లాలో, అండర్–11, 13 పోటీలు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో, మాస్టర్స్ పోటీలు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరుగుతాయన్నారు. ఆలిండియా మేజర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలు అక్టోబర్ 16 నుంచి 23 వరకు విజయవాడలోను, ఆలిండియా మేజర్ ర్యాంకింగ్ సీనియర్స్ టోర్నమెంట్ అక్టోబర్ నెలాఖరులో విశాఖపట్నంలో జరుగుతాయన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలు ఇలా..

ఆలిండియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల షెడ్యూల్‌ను ఆయన వెల్లడించారు. అండర్–13 పోటీలు అక్నోలోను, అండర్–19 పోటీలు బెంగళూరులోను, సీనియర్స్ పోటీలు ముంబైలోను, మాస్టర్స్ పోటీలు చెన్నైలోను జరగనున్నట్టు పేర్కొన్నారు. ఈ పోటీలన్నీ నవంబర్ నుంచి జనవరి వరకు జరుగుతాయన్నారు. అలాగే రాయ్‌పూర్, నాగపూర్, లక్నో, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై వేదిగా అంతర్జాతీయ పోటీలు జరగనున్నట్టు చెప్పారు. అద్భుతమైన నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఏపీలో ఉన్నారని గుర్తు చేశారు. పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, సాయిసాత్విక్, కృష్ణప్రసాద్ లాంటి క్రీడాకారులు ప్రపంచస్థాయిలో సత్తా చాటుతున్నారని గుర్తు చేశారు. థామస్‌కప్‌ను భారత్‌కు అందించి చరిత్ర సృష్టించింది మన ఏపీ కుర్రాళ్లేనని అంకమ్మ చౌదరి సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీబీఏ ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, జిల్లా బ్యాడ్మింటన్ సీఈఓ సంపతిరావు సూరిబాబు, గురుగుబెల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
ఆదివారం ॥ 11-9-2022

బహుముఖం


స్కీయింగ్ చేస్తూ...


కార్గిల్‌లోని కున్ శిఖరంపై జమ్వాల్

‘జెమ్’వాల్ - సాహసానికి జై

చిన్నప్పటి నుంచి ఎంతోమంది సాహసికుల గురించి వింటూ పెరిగింది ఇషానిసింగ్ జమ్వాల్. అయితే ఆ సాహసాలు ఆమె చెవికి మాత్రమే పరిమితం కాలేదు. ‘ఛలో... మనమెందుకు చేయకూడదు’ అని అనిపించేలా చేశాయి. తాజాగా కార్గిల్‌లోని కున్ శిఖరాన్ని అధిరోహించి ‘జెమ్’ అనిపించుకుంది...

ఇండియన్ మౌంటెనీరింగ్ ఫెడరేషన్ (ఐఎంఎఫ్)కు చెందిన తొమ్మిదిమంది సభ్యులు కార్గిల్‌లోని 7,077 మీటర్ల ఎత్తయిన కున్ శిఖరాన్ని అధిరోహించడానికి గత నెల చివరి వారంలో బయలుదేరారు.

తాజాగా కున్ శిఖరాన్ని అధిరోహించిన ఇషానిసింగ్ జమ్వాల్ జేజేలు అందుకుంటుంది.

‘ఈ సాహసయాత్రలో భాగం అయినందుకు గర్వంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని పర్వతారోహణ కార్యక్రమాల్లో పాల్గొనాలనుకుంటున్నాను’ అంటుంది ఇషా.

హిమాచల్‌ప్రదేశ్‌లోని పహ్‌నల గ్రామానికి చెందిన ఇషానిసింగ్‌కు చిన్నప్పటి నుంచి ఎడ్వెంచర్ స్పోర్ట్స్ అంటే ఇష్టం. ఆరవతరగతి నుంచే రకరకాల సాహసక్రీడల్లో పాల్గొనేది.

స్కీయింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో మన దేశం నుంచి రెండు సార్లు ప్రాతినిధ్యం వహించింది. పర్వతారోహణపై ఆసక్తితో మనాలిలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్‌లో శిక్షణ తీసుకుంది.

చిన్నప్పుడు ఇషా తన పుస్తకాలలో రాసుకున్న ‘ఎడ్వెంచర్ ఈజ్ వెయిటింగ్ ఫర్ యూ’ ‘నెవర్ గివ్ అప్’ ‘లైఫ్ ఈజ్ యాన్ ఎడ్వెంచర్’లాంటి వాక్యాలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయేవారు. ఎడ్వెంచర్ స్పోర్ట్స్‌కు సంబంధించిన రకరకాల విషయాలను ఇషాకు చెబుతుండేవారు.

పద్దెనిమిది సంవత్సరాల వయసులోనే పర్వతారోహణలో రికార్డ్ సృష్టించిన ఫ్రెంచ్ మహిళ మేరీ ప్యారడైస్ నుంచి ఆల్ప్‌లోని మ్యాటర్‌హార్న్ పర్వతాన్ని అధిరోహించిన తొలి మహిళ లూసీ వాకర్ వరకు ఎంతోమంది సాహసికులైన మహిళలు గురించి చెబుతుండేది తల్లి నళినీ సింగ్.

పుస్తకాల విషయానికి వస్తే అలనాటి ‘నో పిక్‌నిక్ ఆన్ మౌంట్ కెన్యా’ నుంచి ఇప్పటి ‘నో షార్ట్ కట్స్ టు దీ టాప్’ వరకు ఇషాకు ఎన్నో ఇష్టం.

విన్న మాట కావచ్చు, చదివిన అక్షరం కావచ్చు తనను తాను తీర్చిదిద్దుకోవడానికి ఇషానిసింగ్‌కు ఉపయోగపడ్డాయి.


మోడల్‌గా...

‘ఇషా కున్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించడం ఆనందంగా, గర్వంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం’ అంటున్నారు తండ్రి శక్తిసింగ్.

ఇషానిలోని మరో కోణం... మోడలింగ్.

ఎన్నో ప్రముఖ బ్రాండ్‌లకు మోడలింగ్ చేసింది.

ఇషాని ‘తనిష్క్’ కోసం చేసిన ఒక యాడ్‌లో ఆమెను ‘మౌంటెనీర్’ ‘అథ్లెట్’ ‘మోడల్’ అంటూ పరిచయం చేస్తారు. అయితే ఆ వరుసలో చేర్చాల్సిన మరో విశేషణం... మోటివేషనల్ స్పీకర్. ఆమె ఉపన్యాసాలు ఆకట్టుకోవడమే కాదు స్ఫూర్తిని ఇస్తాయి.

‘మనకు మనం కొత్తగా కనిపించే ప్రయత్నం చేయాలి’ అంటుంది ఇషానిసింగ్.

అప్పుడే కదా విజయాలు మన దరి చేరేవి!

అరచేతిలో అందమైన మెహిందీ డిజైన్లను నేర్పుగా వేస్తూ అందమైన జీవితం కోసం కలలు కంటూ ఉండేది పూజావర్మ. తన కలకో లక్ష్యాన్ని ఏర్పరుచుకుని రైఫిల్ షూటర్ కావాలనుకుంది. పండగలు, పెళ్ళిళ్లకు అమ్మాయి చేతుల్లో మెహిందీ డిజైన్స్ వేస్తూ అలా వచ్చిన డబ్బుతో షూటర్‌గా నైపుణ్యం సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో నెంబర్‌వన్ షూటర్‌గా నిలిచింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బనారస్ వాసి అయిన 26 ఏళ్ల పూజావర్మ తన కలను సాకారం చేసుకునేందుకు చేస్తున్న కృషి అందరినీ ఆకట్టుకుంటోంది. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

● రంగుల కల

లక్ష్యం వైపే గురి


రైఫిల్ షూటింగ్ శిక్షణలో పూజావర్మ

పెద్ద పెద్ద కలలు కనగానే సరిపోదు, కలల సాధనకు ఎంతటి కష్టమైనా భరించాల్సిందే అని ఇరవై ఆరేళ్ల పూజా వర్మను చూస్తే అర్థమవుతుంది. సవాళ్లతో కూడిన ఆమె జీవనశైలి నవతరం అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఇటీవల మీడియాకు వివరించిన ఆ స్ఫూర్తివంతమైన కథనం ఆమె మాటల్లోనే...

అప్పగా ఐదు లక్షలు

‘నేను ప్రభుత్వ పాఠశాలలో చదివాను. అక్కడ ఎన్‌సీసీ వల్ల క్రీడలపై ఆసక్తి ఏర్పడింది. అక్కడే షూటింగ్ రైఫిల్‌లో పాల్గొన్నాను. ఆ సమయంలో స్కూల్ నుంచే రైఫిళ్లు, బుల్లెట్లు ఉచితంగా వచ్చేవి. ఇది చాలా ఖరీదైన గేమ్ అని నాకు అప్పుడు తెలియదు. స్కూల్ అయిపోగానే ఉచితంగా వచ్చే అవకాశాలన్నీ పోయాయి. కానీ, షూటింగ్‌లో దేశం పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని కల కనేదాన్ని. అయితే, ఇంటి ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగోలేదు. అమ్మ గృహిణి. నాన్న డ్రైవర్. అన్నయ్య బట్టల దుకాణం నడుపుతున్నాడు. అక్క పెళ్లి కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏ సాధారణ కుటుంబంలోనైనా ఆడపిల్లలు పెద్ద పెద్ద కలలు కనడానికి వీలు లేదు. కానీ, నా కుటుంబం మాత్రం అడుగడుగునా నాకు అండగా నిలిచింది. 2015లో నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు సిద్ధం కావడానికి నాకు సొంత రైఫిల్ అవసరం. ఐదు లక్షలకన్నా తక్కువ ధరకు రైఫిల్ అందుబాటులో లేదు. రోజుకు మూడు షిఫ్టులలో వేర్వేరు ఉద్యోగాలు చేసేదాన్ని. అయినా అంత డబ్బు సమకూరలేదు. అమ్మ నాన్న, మా అన్న డబ్బు అప్పు తెచ్చి ఇచ్చారు. రైఫిల్ కొన్నాను. మొదటిసారి నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం వచ్చింది. ఏడు సంవత్సరాలుగా అప్పు తీరుస్తూనే ఉన్నాం.

శిక్షణకు సాయం

నేషనల్ రైఫిల్ అసోసియేషన్ కోచ్ బిప్లాప్ గోస్వామిని కలిశాను. నాలో ఆసక్తి, ప్రతిభ గమనించి, డబ్బులు తీసుకోకుండానే శిక్షణ ఇవ్వడానికి సాయం చేశారు. నా దగ్గర డబ్బు లేదు కాబట్టి రాష్ట్ర ఛాంపియన్‌షిప్ వరకు ఫెడరేషన్ సహాయంతో చాలా సార్లు రైఫిల్స్‌ను అరువుగా తీసుకున్నాను. ఇలాగే జిల్లా నుండి రాష్ట్రానికి తరువాత జాతీయస్థాయి పోటీలకు వెళ్లగలిగాను. షూటర్ ప్రాక్టీస్‌కు షూటింగ్ రేంజ్ అవసరం. ఇతర క్రీడల మాదిరిగా పార్కులోనో, దగ్గరలో ఉన్న మైదానంలోనో ప్రాక్టీస్ చేయలేం. అందుకే రెండేళ్ల క్రితం డిస్ట్రిక్ట్ రైఫిల్ క్లబ్ ఆఫ్ బనారస్‌కు చేరుకున్నాను. క్లబ్ ఎంట్రీ ఫీజు 12 వేల రూపాయలు. ఇది నాకు చాలా పెద్ద మొత్తం. ఒకేసారి చెల్లించలేనని సిటీ మెజిస్ట్రేట్ ఆఫీసు చుట్టూ నెల రోజులు ప్రదక్షిణలు చేస్తే, చివరకు వాయిదాల పద్ధతిలో డబ్బు కట్టడానికి అంగీకరించారు. జాతీయ స్థాయి శిబిరానికి వెళ్లడానికి రెండేళ్ల పాటు అవకాశం ఇచ్చారు. కానీ, కరోనాతో ఆ అవకాశమూ పోయింది. ఒక రైఫిల్ బుల్లెట్ ధర 30 నుంచి 32 రూపాయలు. ఒక గేమ్ ఆడటానికి కనీసం 70 నుంచి 80 బుల్లెట్లు ఖర్చవుతాయి. దీంతో అత్యంత ఖరీదైన క్రీడలలో ఇది ఒకటిగా చెప్పుకోవచ్చు. దీనికి ప్రత్యేకమైన బుల్లెట్లు కూడా అవసరం. దేశంలో ఎక్కడైనా ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగితే రిజిస్ట్రేషన్ ఫీజు, బుల్లెట్ల కొనుగోలు, బస-వసతి సదుపాయలు, ప్రయాణ ఖర్చులు.. అన్నీ కలిపి 15 నుంచి 20 వేల రూపాయలు ఖర్చు అవుతాయి. వీలైనన్ని ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొనడానికి నా వద్ద అంత డబ్బు లేదు.

మెహందీ డిజైన్లు.. డ్రైవింగ్..

రాష్ట్రస్థాయి అధికారులను కలిశాను. కానీ, ఎలాంటి సాయమూ అందలేదు. చుట్టుపక్కల స్కూళ్లలో పిల్లలకు క్రీడలలో శిక్షణ ఇస్తుంటాను. పెళ్లి, వివిధ సందర్భాలలో జరిగే వేడుకలలో మెహందీ డిజైన్లు వేస్తాను. అమ్మాయిలకు డ్రైవింగ్ నేర్పిస్తాను. ఇలా రెండేళ్ల పాటు కృషి చేస్తే కొంత డబ్బు జమయ్యింది. 2021 నుండి మళ్లీ ఆడటం ప్రారంభించాను. 43వ యుపి స్టేట్ రైఫిల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని 3 బంగారు పతకాలు సాధించాను. స్టేట్ నెంబర్ 1 ర్యాంకులో నిలిచాను. ఇప్పుడు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించడానికి శిక్షణ తీసుకుంటున్నాను. బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేశాను. మాస్టర్స్ చేయడానికి ప్రిపేర్ అవుతున్నాను’’ అని తన కల కోసం, లక్ష్య సాధనకు చేస్తున్న కృషి గురించి వివరిస్తుంది పూజావర్మ.

లక్ష్య సాధనలో..

షూటింగ్ బోర్డ్‌లోని లక్ష్య కేంద్రాన్ని బుల్‌సీ షూటింగ్ లేదా బుల్స్ ఐ అంటారు. రైఫిల్ షూటింగ్ అంటే అంత సులువు కాదు. లక్ష్యాన్ని చాలా ఖచ్చితత్వంతో ఛేదించాలి. ‘మావలంకర్’ షూటింగ్ పోటీలో బెస్ట్ క్యాడెట్, 41వ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో త్రీ పొజిషన్ రైఫిల్‌లో బంగారు పతకం, ఆర్మీ క్యాంపు షూటింగ్‌లో బంగారు పతకాలు సాధించింది.


పూజా వర్మ

హెల్త్



స్టెంట్లు మళ్లీ పూడుకుపోతే?

అన్ని అవయవాలకు అందినట్లే గుండెకు కూడా రక్తం నిరంతరం అందుతుండాలి. ఒక్కోసారి గుండెకు రక్తాన్ని చేరవేసే ధమనుల్లో పూడిక చేరినప్పుడు స్టెంట్లు వేసి, గుండె కండరానికి రక్తం నిరంతరాయంగా అందేలా చూస్తుంటారు. అయితే కొన్ని సందర్భాల్లో ఇలా స్టెంట్లు వేసినప్పటికీ... అవి మళ్లీ పూడుకుపోయే ప్రమాదం ఉంటుంది. ఇలా జరిగినప్పుడు అందుకు కారణాలను కనుగొని, స్టెంట్లలో ఏర్పడ్డ పూడికలను తొలగించి, ఆ రక్తనాళాలు మళ్లీ పూడుకుపోకుండా చేసేందుకు అందుబాటులో ఉన్న చికిత్సల గురించి కథనమిది.

గుండెకు రక్తాన్ని చేరవేసే ప్రధాన ధమనుల్లో ఎక్కడైనా పూడికలు ఏర్పడినప్పుడు... సాధారణంగా యాంజియోప్లాస్టీ అనే చికిత్స ప్రక్రియ ద్వారా స్టెంట్ వేసి, సన్నబడ్డ రక్తనాళాన్ని మళ్లీ విచ్చుకునేలా చేస్తారు. అయితే స్టెంట్ వేశాక... మళ్లీ ఆ రక్తనాళం పూడుకుపోకుండా డాక్టర్లు కొన్ని జాగ్రత్తలు సూచిస్తారు. ఉదాహరణకు మధుమేహాన్ని, అధికరక్తపోటును అదుపులో పెట్టుకోవడం, స్మోకింగ్, మద్యం అలవాట్లను పూర్తిగా మానేయడం, తేలికపాటి వ్యాయామాలు చేయడం, మళ్లీ కొవ్వు పేరుకోడాన్ని నివారించేందుకుగాను కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండే సమతులాహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు చెబుతారు. అయితే స్టెంట్ వేశాక కొంతమంది బాధితులు ఈ నియమాలన్నింటినీ పాటించరు. దాంతో... నియమాలు పాటించని వారిలో మళ్లీ పూడికలు వచ్చే అవకాశం ఉంటుంది.

పూడికలు ఎక్కడ వస్తాయంటే...?

ఒక్కోసారి ఇలా వేసిన స్టెంట్‌లోనే మళ్లీ పూడిక రావచ్చు. లేదా స్టెంట్‌కు పరిసర ప్రాంతాల్లో రెండోసారి పూడికలు రావచ్చు. స్టెంట్ వేశాక కూడా ఇలా రక్తనాళాలు తిరిగి మూసుకుపోవడానికి 3 నుంచి 5 శాతం వరకు అవకాశాలుంటాయి.

ఇన్‌స్టెంట్ స్టెనోసిస్ అంటే...

స్టెంట్ వేశాక ఏర్పడే పూడిక... స్టెంట్ లోపలగానీ లేదా దానికి 5 మిల్లీమీటర్ల పరిధిలో గానీ, స్టెంట్ అంచుల్లోగానీ ఏర్పడితే దాన్ని ఇన్‌స్టెంట్ స్టెనోసిస్ అంటారు. ఈ పూడికను కరొనరీ ఇమేజింగ్ పద్ధతుల ద్వారా దాన్ని కనిపెట్టాల్సి ఉంటుంది. కరొనరీ ఇమేజింగ్ అంటే ‘ఇంట్రావాస్కులార్ అల్ట్రాసౌండ్’ లేదా ‘ఆప్టికల కొహరెన్స్ టోమోగ్రఫీ’ అనే ఇమేజింగ్ ప్రక్రియలు. ఇలా స్టెంట్ లోపలగానీ లేదా చుట్టుపక్కల గానీ, అంచుల్లో గానీ పూడికలు మళ్లీ ఏర్పడటానికి కారణం... స్టెంట్ అవసరమైనంత మేరకు వ్యాకోచించకపోవడం అన్నమాట. ఇలా జరగడాన్ని ‘స్టెంట్ అండర్-ఎక్స్‌ప్యాన్షన్’ అంటారు. అలాగే స్టెంట్ ఫ్రాక్చర్‌కు గురికావచ్చు కూడా. స్టెంట్ పొడవు 30 మిల్లీమీటర్లకు మించినప్పుడు అది తిరిగి పూడుకుపోయే అవకాశాలు కొంతమేర ఎక్కువ. అలాగే ఒకటికి మించి... రెండు స్టెంట్లు వేసిన సందర్భాల్లోనూ ఒకదానిపైకి ఒకటి వచ్చేలా (ఓవర్‌ల్యాప్ చేస్తున్నట్లుగా) వేసిన సందర్భాల్లోనూ ఇలా మరోసారి పూడిక చేరేందుకు అవకాశాలు ఎక్కువ.

అలాగే స్టెంట్ వేసినప్పుడు, అందులో ఎముకల తాలూకు అవశేషాలు పేరుకుని ఉన్నట్లయితే, స్టెంట్ అవసరమైన మేరకు వ్యాకోచించడానికి అది అడ్డంకిగా మారవచ్చు. అలాంటప్పుడు దాన్ని సరిచేయకపోతే... ఆ తర్వాతి కాలంలో తిరిగి పూడికలు ఏర్పడేందుకు అవకాశాలు ఎక్కువ.

స్టెంట్ లోపల మరో స్టెంట్...

ఈ ప్రక్రియను వైద్యులు చివరి ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తారు. సాధారణంగా స్టెంట్‌లోపల మరోస్టెంట్ వేయడం వల్ల రక్తనాళం మరింత ఇరుగ్గా మారిపోయే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా రక్తనాళం తిరిగి పూడుకుపోయే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి మిగతా ఏ విధానాలూ పనిచేయని సందర్భాల్లో మాత్రమే అరుదుగా ఇలా రీస్టెంటింగ్ ప్రక్రియను చివరగా ఉపయోగిస్తారు.

డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్స్...

స్టెంట్లలో రెండురకాలు ఉంటాయి. అవి... బేర్ మెటల్ స్టెంట్స్, డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్స్. ప్రస్తుతం బేర్ మెటల స్టెంట్లు అందుబాటులో లేవు. అయితే ఈ బేర్ మెటల్ స్టెంట్లు తిరిగి పూడుకుపోయేందుకు అవకాశాలు ఎక్కువ. వీటిలో కణజాలం పెరగకుండా నిరోధించడం అసాధ్యం. అందుకే బేర్ మెటల్ స్టెంట్లకు బదులుగా డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్లు వాడుకలోకి వచ్చాయి. ఈ స్టెంట్లలో ఉండే ఔషధ పదార్థం (డ్రగ్) మూడు నెలల నుంచి ఆరు నెలల పాటు విడుదలవుతూ... స్టెంట్‌లోపల కణజాలం పెరుగుదలను నియంత్రిస్తుంది. తద్వారా ఇది చాలాకాలంపాటు పూడుకుపోకుండా ఉంటుంది. ఇలాంటి డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్లు వేయించుకున్న రోగుల్లో, తిరిగి పూడికలు ఏర్పడే అవకాశాలు కేవలం 3 నుంచి 5 శాతం మేరకే ఉంటాయి. కానీ బేర్ మెటల్ స్టెంట్లు వేయించుకున్నవారిలో తిరిగి పూడికలు ఏర్పడే అవకాశాలు 30 శాతం వరకు ఉంటాయి. అందుకే ఇవి అంతగా ప్రాచుర్యం పొందలేదు.

లేజర్‌తో పూడిక తొలగింపు....

స్టెంట్‌లో కణజాలం మళ్లీ పెరిగి. అవి మళ్లీ పూడుకుపోయే కండిషన్‌ను ‘టిష్యూ హైపర్‌ప్లేసియా’ అంటరు. ఇలాంటి కండిషన్‌ను లేజర్‌తో చక్కదిద్దవచ్చు. తొలత లేజర్లను ఉపయోగించి పూడికను తొలగించాక... ఆ తర్వాత డ్రగ్ పైపూతగా ఉన్న బెలూన్ల సహాయంతో స్టెంట్ లోపలి పొరల్లోకి ఔషధపదార్థాన్ని పంపుతారు. ఇందుకోసం ‘పాక్లిటాక్సెల్ లేదా ‘సిరోలిమస్’ అనే ఔషధాలను (డ్రగ్స్)ను వైద్యులు ఉపయోగిస్తారు.

తీవ్రమైన లక్షణాలు

- హఠాత్తుగా ఛాతీలో నొప్పి
- చెమటలు పట్టడం
- వాంతులు

దీర్ఘకాలికమైన లక్షణాలు

- శ్వాసలో ఇబ్బంది
- ఛాతీలో అసౌకర్యం
- నడక, కదలికల సమయంలో ఆయాసం
- తమ కదలికలు కేవలం కొద్ది దూరాలకు మాత్రమే పరిమితమైపోవడం.

నిర్ధారణ పరీక్షలు

- ఈసీజీ
- ఎకోకార్డియోగ్రామ్
- కరొనరీ యాంజియోగ్రామ్

ఇన్‌స్టెంట్ స్టెనోసిస్‌కు చికిత్స ఇలా...


కరొనరీ ఇమేజింగ్ ద్వారా స్టెంట్ తగినంతగా వ్యాకోచించలేదని గుర్తిస్తే... అప్పుడు ఆ స్టెంట్ తాలూకు అండర్-ఎక్స్‌ప్యాన్షన్ కండిషన్‌కు చికిత్స చేసి, సరిదిద్దాల్సి ఉంటుంది. అంతే తప్ప పాత స్టెంట్ స్థానంలో కొత్త స్టెంట్ ఏర్పటు చేయడం సరికాదు. కాబట్టి స్టెంట్ అండర్-ఎక్స్‌ప్యాన్షన్‌కు తగిన కారణాలను కనిపెట్టి, వాటిని సరిదిద్దాల్సి ఉంటుంది. చాలా సందర్భాల్లో స్టెంట్ చుట్టూరా క్యాల్షియమ్ లేదా దృఢ కణజాలం పేరుకుపోయి స్టెంట్ తగినంతగా వ్యాకోచించడానికి అడ్డుపడవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కువ ఒత్తిడితో కూడిన బెలూన్ల సహాయంతో స్టెంట్‌ను తిగిరి వ్యాకోచించేలా చేయవచ్చు. కొన్ని సందర్భాల్లో రొటాబ్లేషన్, కటింగ్ బెలూన్ల వంటి ప్రక్రియలతో స్టెంట్‌ను తగినంతగా వ్యాకోచించేలా చేయవచ్చు.


డాక్టర్ ఎ. శరత్‌రెడ్డి
సీనియర్ కార్డియాలజిస్ట్

క్యాన్సర్ చికిత్సలు

క్యాన్సర్ చికిత్సలు వయసు, క్యాన్సర్ దశ, గ్రేడింగ్, వారి ఇతర ఆరోగ్య లక్షణాలు ఇలా అనేక విషయాలపై ఆధారపడి ఉంటాయి. కొన్ని క్యాన్సర్‌లు... మందులకు, రేడియేషన్‌కు అదుపులోకి వస్తే, మరికొందరిలో అవేవీ పనిచేయకపోవచ్చు. బ్రెస్ట్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి వాటికి సర్జరీ, రేడియేషన్, కీమో థెరపీలతో పాటు హార్మోన్ థెరపీ వంటి వాటికి ప్రాధాన్యం ఉంటుంది. వీటితో పాటు క్యాన్సర్‌కు నేడు సెల్ టార్గెటెడ్ థెరపీ, లేజర్ థెరపీ, మాలిక్యులార్ టార్గెటెడ్ థెరపీ వంటి అనేక కొత్త చికిత్స ప్రక్రియలు అందుబాటులోకి వస్తున్నాయి.

క్యాన్సర్‌ను చాలా ఆలస్యంగా అడ్వాన్స్‌డ్ దశలో కనుగొన్నప్పుడు కొంతవరకు నొప్పి, బాధ తగ్గడానికి (పాలియేటివ్ కేర్) కూడా ఉపయోగిస్తూ ఉంటారు. క్యాన్సర్ చికిత్స తీసుకునేవారికి గుండె, కిడ్నీలు, కాలేయం పనితీరు సరిగ్గా ఉండటం చాలా ముఖ్యం. ముందే ఇలాంటి సమస్యలతో బాధపడుతూ ఉన్నప్పుడు వారు క్యాన్సర్ మందులు వాడాల్సి వస్తే ఇంకా ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.



క్యాన్సర్ చికిత్స జరుగుతున్నప్పుడు ఆ మందుల ప్రభావం వల్ల చుట్టూ ఉండే ఇతర అవయవాల తాలూకు ఆరోగ్యకరమైన కణాలపై ఉండే అవకాశం ఉంది. అందుకే ఆ దుష్ప్రభావాన్ని వీలైనంతగా తగ్గించేందుకు పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయి. వాటి ఫలితంగా నేడు క్యాన్సర్ కణాల మీద మాత్రమే పనిచేసే సెల్ టార్గెటెడ్ థెరపీలు, ఇతర అవయవాల మీద ప్రభావం పడకుండా చేసే ఐఎమ్‌ఆర్‌టీ రేడియేషన్ థెరపీలు, వీలైనంత తక్కువ కోతతో చేయగలిగే కీహోల్ సర్జరీల వంటివి అందుబాటులోకి వచ్చాయి. ఇంకా క్యాన్సర్ చికిత్సల గురించి వివరంగా తెలుసుకుందాం.

శస్త్రచికిత్స: రక్తానికి సంబంధించిన క్యాన్సర్ తప్పితే మిగతా ఏ క్యాన్సర్‌లోనైనా శస్త్రచికిత్సకు ప్రాధాన్యం చాలా ఎక్కువ. చాలా సందర్భాల్లో క్యాన్సర్‌ను నయం చేయడానికి వీటిని నిర్వహించడంతో పాటు కొన్ని సందర్భాల్లో ముందే క్యాన్సర్ వచ్చే అవకాశాలను తెలుసుకొని, అవి రాకుండా నివారించడానికి కూడా సర్జరీలు చేయాల్సిన సందర్భాలుంటాయి. ఇతర ఏ భాగాలకూ వ్యాపించని దశలో క్యాన్సర్‌ను కనుగొంటే సర్జరీ వల్ల క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చు. ఈ సర్జరీలను నేడు చాలా చిన్న కోతతోనే, ఒక్కోసారి ఆరోజే రోగి ఇంటికి వెళ్లేలా డే-కేర్ ప్రొసిజర్‌గా చేయగలుగుతున్నారు.

ఆ సందర్భాలివే...

- **ప్రివెంటివ్ సర్జరీ:** పెద్దపేగు చివరి భాగం (కోలన్)లో పాలిప్ కనిపించినప్పుడు ఎటువంటి క్యాన్సర్ లక్షణాలు లేకున్నా సర్జరీ చేసి తొలగిస్తారు. కుటుంబ చరిత్రలో రక్తసంబంధీకులకు రొమ్ముక్యాన్సర్ వచ్చిన సందర్భాలు ఎక్కువగా ఉంటే బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 వంటి జీన్ మ్యుటేషన్ పరీక్షలతో క్యాన్సర్ వచ్చే ముప్పును ముందే తెలుసుకొని రొమ్మును (మాసెక్టమీ) తొలగిస్తారు. పాప్‌స్మియర్ పరీక్షలో తేడాలున్నప్పుడు హిస్టరెక్టమీ చేసి గర్భాశయాన్ని తీసివేస్తారు.
- **క్యూరేటివ్ సర్జరీ:** క్యాన్సర్‌ను తొలిదశలో కనుగొన్నప్పుడు ముందు రేడియేషన్, కీమో లేదా సర్జరీ తర్వాత ఇతర థెరపీలతో కలుపుకుని, దాన్ని పూర్తిగా నయం చేయడానికి చేసే సర్జరీలివి. ఒక్కోసారి సర్జరీ చేస్తున్నప్పుడే రేడియేషన్ కూడా ఇస్తారు.
- **పాలియేటివ్ సర్జరీ:** క్యాన్సర్‌ను చాలా ఆలస్యంగా, చివరి దశలో కనుగొన్నప్పుడు ఆ కణితి పరిమాణాన్ని తగ్గించి, కొంతవరకు ఇబ్బందిని తగ్గించడానికి ఈ సర్జరీలను చేస్తుంటారు.
- **రిస్టోరేటివ్ (రీకన్‌స్ట్రక్టివ్) సర్జరీ:** క్యాన్సర్ చికిత్సలో చేసే సర్జరీలలో క్యాన్సర్ వచ్చిన భాగంతో పాటు, చుట్టూ ఉన్న లింఫ్‌నోడ్స్‌నీ, ఇతర కణజాలాన్నీ తొలగిస్తారు. రొమ్ము, హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లలో నోటికి సంబంధించిన భాగాల్ని తొలగించినప్పుడు, బాధితుల్లో ఆత్మన్యూనతను నివారించడానికి దేహంలోని ఇతర భాగాల నుంచి కణజాలాన్ని సేకరించి రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీలను చేస్తారు.

కీమోథెరపీ: క్యాన్సర్ చికిత్స అనగానే సర్జరీ కంటే కీమోథెరపీకి ఎక్కువగా భయపడుతూ ఉంటారు. వాంతులు, వికారం, బరువు తగ్గడం, అలసట, కనురెప్పలతో పాటు జుట్టంతా రాలిపోవడం... ఇలాంటి లక్షణాలవల్ల కీమో అంటే అందరికీ భయం. ఈ దుష్ప్రభావాలన్నీ కేవలం తాత్కాలికమే. కొత్త టార్గెటెడ్ థెరపీలతో కొంతవరకు సైడ్‌ఎఫెక్ట్స్ తగ్గినా ఇవి అందరికీ అందుబాటులో లేకపోవడం బాధాకరం.

రేడియేషన్ థెరపీ: వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న రేడియేషన్ థెరపీలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వీటివల్ల అరగంట పైగా సాగే చికిత్స ఇప్పుడు కొద్ది నిమిషాల్లోనే పూర్తవుతుంది. కొన్ని కొన్ని క్యాన్సర్‌కు రేడియేషన్‌తో మాత్రమే చికిత్స కొనసాగుతుంది. రోగిని ఏమాత్రం కదిలించకుండా కొనసాగే త్రీ-డైమన్షనల్, స్టిరియోటాక్టిక్, బ్రాకీథెరపీ వంటి అనేక కొత్త చికిత్స వల్ల తక్కువ వ్యవధిలోనే చికిత్స పూర్తవ్వడమే కాకుండా, దుష్ప్రభావాలు కూడా చాలావరకు తగ్గాయి.

ఇటీవలి పురోగతితో అధునాతన చికిత్సలు: స్టెమ్‌సెల్ థెరపీ, సర్జరీలలో లేజర్ ఉపయోగించడం, లైట్‌ను ఉపయోగించి చేసే ఫోటో డైనమిక్ థెరపీలు, అతివేడి లేదా అతి చల్లటి ఉష్ణోగ్రతలను ఉపయోగించి చేసే చికిత్సలు, మన రోగనిరోధకశక్తిని బలపరచి క్యాన్సర్ కణాల మీద దాడి చేసేటట్లు చేసే ఇమ్యూనో థెరపీలు, మాలిక్యులార్ టార్గెటెడ్ థెరపీలు క్యాన్సర్ చికిత్స రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చాయని చెప్పవచ్చు.


డా. సీహెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్,
ఒమెగా హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్ నంబరు 9849022121



భారత టెన్నిస్ క్రీడాకారిణులకు నిరాశ

చెన్నై ఓపెన్ డబ్ల్యూటీఏ-250 క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణులకు నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్‌లో బరిలోకి దిగిన ఐదుగురు ప్లేయర్లు సౌజన్య బవిశెట్టి, లక్ష్మీ ప్రభ, రియా భాటియా, రుతుజా భోస్లే, సాయి సంహిత తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. శనివారం చెన్నైలో జరిగిన మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ అమ్మాయి సౌజన్య 4-6, 0-6తో క్యోకా ఒకమురా (జపాన్) చేతిలో ఓడిపోయింది. ఇతర మ్యాచ్‌ల్లో లక్ష్మీ ప్రభ 4-6, 1-6తో యుకీ నైటో (జపాన్) చేతిలో... సంహిత 1-6, 0-6తో నావో హిబినో (జపాన్) చేతిలో... రియా 4-6, 0-6తో మికుల్‌స్కైటీ (లిథువేనియా) చేతిలో... రుతుజా 3-6, 2-6తో ఎన్‌మవో లియాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి చవిచూశారు. భారత్‌కే చెందిన అంకిత రైనా, కర్మన్‌కౌర్‌లకు మెయిన్ 'డ్రా'లో ఆడేందుకు వైల్డ్ కార్డు కేటాయించారు.

స్పోర్ట్స్ రీల్

సెమీస్‌లో భారత్



సౌమ్య

కఠ్మాండు (నేపాల్): దక్షిణాసియా మహిళల ఫుట్‌బాల్ (శాఫ్) చాంపియన్‌షిప్‌లో భారత్ వరుసగా రెండో విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 9-0 గోల్స్ తేడాతో మాల్దీవులు జట్టుపై ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ (55వ ని.లో) ఒక గోల్... అంజు తమాంగ్ నాలుగు గోల్స్ (24వ ని.లో, 45+2వ ని.లో, 85వ ని.లో, 88వ ని.లో)... డాంగ్మే గ్రేస్ (53వ ని.లో, 86వ ని.లో) రెండు గోల్స్.. కష్మీనా (84వ ని.లో) ఒక గోల్ సాధించారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లో 13న బంగ్లాదేశ్‌తో ఆడుతుంది.

ఒకే రోజు 17 వికెట్లు



బ్రాడ్, రాబిన్సన్

లండన్: ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మధ్య మూడో టెస్టును బౌలర్లు శాసిస్తున్నారు. రెండు రోజులు ఆలస్యంగా మొదలైన మూడో టెస్టులో ఒక్క మూడో రోజు ఆటలోనే 17 వికెట్లు కూలాయి. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 36.2 ఓవర్లలో 118 పరుగులకే ఆలౌటైంది. జాన్సెన్ (30; 4 ఫోర్లు), జోండో (23; 1 ఫోర్, 1 సిక్స్) కాసేపు ఆడారు. మిగిలిన వారిని రాబిన్సన్ (5/49), స్టువర్ట్ బ్రాడ్ (4/41) జంటగా పడగొట్టేశారు. తర్వాత తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇంగ్లండ్ ఆట నిలిచే సమయానికి 33.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. ఒలీ పోప్ (67; 13 ఫోర్లు) రాణించడంతో ప్రస్తుతం ఇంగ్లండ్ 36 పరుగుల ఆధిక్యంలోనే ఉంది. జాన్సెన్ 4, రబడ 2 వికెట్లు తీశాడు. తొలి రోజు ఆట వర్షార్పణం కాగా... రెండో రోజు క్వీన్ ఎలిజబెత్-2 మృతికి సంతాప సూచకంగా ఆటను రద్దు చేశారు. మూడో రోజు ఉదయం ఇరు జట్ల ఆటగాళ్లు బ్రిటన్ రాణికి నివాళులు అర్పించాకే ఆట మొదలైంది.

'నంబర్‌వన్' సమరం

- యూఎస్ ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్, కాస్పర్ రూడ్
- టైటిల్ సాధిస్తే 'టాప్' ర్యాంక్ కూడా సొంతం



అల్‌కరాజ్



కాస్పర్ రూడ్

7 ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరుసగా మూడు ఐదు సెట్‌ల మ్యాచ్‌లు గెలిచి ఫైనల్ చేరిన ఏడో ప్లేయర్‌గా అల్‌కరాజ్ గుర్తింపు పొందాడు. గతంలో అగస్సీ (అమెరికా: 2005 యూఎస్ ఓపెన్), ఎడ్బర్గ్ (స్వీడన్: 1992 యూఎస్ ఓపెన్), బన్‌గెర్ట్ (జర్మనీ: 1967 వింబుల్డన్), టోనీ రోచ్ (ఆస్ట్రేలియా: 1967 ఫ్రెంచ్ ఓపెన్), రాయ్ ఎమర్సన్ (ఆస్ట్రేలియా: 1962 ఫ్రెంచ్ ఓపెన్), అలెక్స్ ఒల్మెడో (పెరూ/అమెరికా: 1959 ఆస్ట్రేలియన్ ఓపెన్) ఈ ఘనత సాధించారు.

న్యూయార్క్: పురుషుల టెన్నిస్ చరిత్రలో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో ఇద్దరు క్రీడాకారులు ఏక కాలంలో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తోపాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌నూ సొంతం చేసుకోవడానికి సిద్ధమయ్యారు. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఏడో ర్యాంకర్ కాస్పర్ రూడ్ (నార్వే) పురుషుల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు. ఫైనల్లో గెలిచిన ప్లేయర్‌కు తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తోపాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ లభిస్తుంది. భారత కాలమానం ప్రకారం నేటి రాత్రి ఒంటి గంట 30 నిమిషాలకు ఈ ఫైనల్ మొదలవుతుంది. సెమీఫైనల్స్‌లో ఏడో సీడ్ కాస్పర్ రూడ్ 7-6 (7/5), 6-2, 5-7, 7-2తో 27వ సీడ్ ఖచనోవ్ (రష్యా)పై... మూడో సీడ్ అల్‌కరాజ్ 6-7 (6/8), 6-3, 6-1, 6-7 (5/7), 6-3తో 22వ సీడ్ టియాఫో (అమెరికా)పై గెలిచారు. 23 ఏళ్ల కాస్పర్ రూడ్ తన కెరీర్‌లో రెండోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరగా... 19 ఏళ్ల అల్‌కరాజ్ తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. ఈ ఏడాది కాస్పర్ రూడ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచాడు.

పక్కా ప్రణాళికతో...

నాన్న క్రిస్టియాన్ శిక్షణలో రాటుదేలిన కాస్పర్ పక్కా ప్రణాళికతో ఆడి రష్యా ఆజానుబాహుడు ఖచనోవ్ ఆట కట్టించాడు. 6 అడుగుల 6 అంగుళాల ఎత్తు, 87 కేజీల బరువున్న ఖచనోవ్ శక్తివంతమైన సర్వీస్‌లను రిటర్న్ చేయడానికి కాస్పర్ బేస్‌లైన్ వెనుక నిల్చొని రిటర్న్ చేశాక సుదీర్ఘ ర్యాలీలు ఆడాడు. తొలి సెట్ టైబ్రేక్‌లో కాస్పర్, ఖచనోవ్ మధ్య 12వ పాయింట్ కోసం ఏకంగా 55 షాట్‌ల ర్యాలీ జరగడం విశేషం. మూడు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కాస్పర్ పది ఏస్‌లు సంధించాడు. నెట్ వద్దకు 23 సార్లు దూసుకొచ్చి 20 సార్లు పాయింట్లు గెలిచాడు. 53 విన్నర్స్ కొట్టిన కాస్పర్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. ఖచనోవ్ 41 అనవసర తప్పిదాలు చేశాడు.

వరుసగా మూడో మ్యాచ్‌లో...

ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అల్‌కరాజ్ ఈ టోర్నీలో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఐదు సెట్‌ల పోరాటంలో విజయాన్ని దక్కించుకున్నాడు. 4 గంటల 19 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 59 విన్నర్స్ కొట్టిన అల్‌కరాజ్ నెట్ వద్దకు 42 సార్లు దూసుకొచ్చి 32 సార్లు పాయింట్లు గెలిచాడు. మరోవైపు టియాఫో 15 ఏస్‌లు సంధించి ఆరు డబుల్ ఫాల్ట్‌లు, 52 అనవసర తప్పిదాలు చేశాడు.

రాజీవ్-సాలిస్‌బరీ జోడీకి డబుల్స్ టైటిల్

పురుషుల డబుల్స్‌లో రాజీవ్ రామ్ (అమెరికా)-జో సాలిస్‌బరీ (బ్రిటన్) జోడీ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఫైనల్లో రాజీవ్ రామ్-సాలిస్‌బరీ ద్వయం 7-6 (7/4), 7-5తో వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీపై గెలిచింది. వరుసగా 22వ ఏడాది యూఎస్ ఓపెన్‌లో ఆడిన రాజీవ్ 11 వేర్వేరు భాగస్వాములతో బరిలోకి దిగాడు. వుడ్‌ఫర్డ్-వుడ్‌బ్రిడ్జ్ (ఆస్ట్రేలియా; 1995, 1996) ద్వయం తర్వాత యూఎస్ ఓపెన్‌లో వరుసగా రెండేళ్లు డబుల్స్ టైటిల్ నెగ్గిన తొలి జోడీగా రాజీవ్-సాలిస్‌బరీ ద్వయం గుర్తింపు పొందింది.



లంకకు ఎదురుందా!

- పాక్‌తో నేడు ఆసియా కప్ ఫైనల్
- సూపర్ ఫామ్‌లో సింహళ జట్టు
- నిలకడలేని బాబర్ బృందం
- రాత్రి గం.7:30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం



బాబర్ ఆజమ్, షనక

దుబాయ్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో 'అండర్ డాగ్'గా బరిలోకి దిగి అదరగొట్టిన శ్రీలంక ఇప్పుడు టైటిల్‌పైనే కన్నేసింది. 'సూపర్-4'లో అజేయంగా నిలిచిన సింహళ జట్టు ఇప్పుడు ఫైనల్లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సూపర్-4లో తడబడుతూ తుదిపోరుకు చేరిన పాకిస్తాన్‌తో నేడు అమీతుమీ తేల్చుకోనుంది. భారత్‌తో బాగా ఆడిన పాకిస్తాన్ తర్వాత క్రికెట్ కూన అఫ్గానిస్తాన్‌తో చచ్చిచెడి చివరి ఓవర్లో ఆఖరి వికెట్‌తో గట్టెక్కింది. గత మ్యాచ్‌లో ఎదురుపడిన శ్రీలంకతో తేలిపోయింది. ఐదో వరుస బ్యాటర్స్ దాకా ఒక్క కెప్టెన్ బాబర్ ఆజమ్ మినహా ఇంకెవరూ 14 పరుగులైనా చేయలేకపోవడం జట్టు బ్యాటింగ్ వైఫల్యాన్ని చూపిస్తోంది. మిడిలార్డర్ కూడా లంక బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోయింది. 20 ఓవర్ల కోటా కూడా పూర్తిగా ఆడలేక 121 పరుగులకే ఆలౌట్ అవడం పాక్ నిలకడలేమికి అద్దం పడుతోంది.

దుర్భేద్యంగా షనక బృందం

ఐసీసీ టి20 ర్యాంకింగ్స్‌లో టాప్‌లో ఉన్న భారత్, రెండో స్థానంలో ఉన్న పాకిస్తాన్ కంటే 8వ ర్యాంకులో ఉన్న లంక జట్టే ఈ టోర్నీలో అద్భుతంగా రాణించింది. ఓపెనర్లు నిసాంక, కుశాల్‌లతో పాటు భానుక రాజపక్స బ్యాట్‌తో చెలరేగుతున్నారు. డెత్ ఓవర్లలో కెప్టెన్ షనక, హసరంగ కూడా రాణిస్తుండటం, బౌలింగ్‌లో తీక్షణ, మదుశంక స్థిరంగా వికెట్లు తీయడం జట్టును ఎదురులేని జట్టుగా మార్చింది. గతమ్యాచ్‌లో హసరంగ తన స్పిన్ ఉచ్చులో పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఈ నేపథ్యంలో ఏరకంగా చూసినా లంకను ఆపడం పాక్‌కు కష్టమే!

22 పాకిస్తాన్, శ్రీలంక జట్ల మధ్య ఇప్పటివరకు 22 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 13 మ్యాచ్‌ల్లో పాకిస్తాన్, 9 మ్యాచ్‌ల్లో శ్రీలంక గెలిచాయి.

5 ఇప్పటివరకు ఆసియా కప్ టోర్నీ 14 సార్లు జరిగింది. శ్రీలంక ఐదు సార్లు... పాకిస్తాన్ రెండుసార్లు చాంపియన్‌గా నిలిచాయి. భారత్ ఏడు సార్లు విజేతగా నిలిచింది.

జట్లు (అంచనా)

శ్రీలంక: షనక (కెప్టెన్), నిసాంక, కుశాల్, దనుష్క గుణతిలక, ధనంజయ, కరుణరత్నే, భానుక రాజపక్స, హసరంగ, తీక్షణ, మదుశంక, మదుషన్.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), రిజ్వాన్, ఫఖర్, ఇఫ్తికార్, ఖుష్‌దిల్, షాదాబ్, నవాజ్, ఆసిఫ్ అలీ, హారిస్ రవూఫ్, హస్‌నైన్, నసీమ్ షా.

వన్డే క్రికెట్‌కు ఫించ్ గుడ్‌బై

నేడు న్యూజిలాండ్‌తో చివరి మ్యాచ్ ఆడనున్న ఆసీస్ కెప్టెన్



కెయిర్న్స్: ఆస్ట్రేలియా కెప్టెన్ ఆరోన్ ఫించ్ అంతర్జాతీయ వన్డే క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో సిరీస్‌లో ఈరోజు జరిగే మూడో వన్డేనే తన కెరీర్‌లో ఆఖరి వన్డే అని 35 ఏళ్ల ఫించ్ వెల్లడించాడు. వన్డేల్లో అతని ప్రదర్శన నానాటికి తీసికట్టుగానే తయారైంది. ఈ జూన్‌లో శ్రీలంకతో 62 పరుగులు చేసిన ఆస్ట్రేలియన్ ఆ తర్వాత అత్యంత పేలవమైన ప్రదర్శన కనబరిచాడు. శ్రీలంక, జింబాబ్వే, న్యూజిలాండ్‌లతో జరిగిన సిరీస్‌లలో ఏడు ఇన్నింగ్స్‌లలో ఫించ్ 3.7 సగటుతో 26 పరుగులే చేయగలిగాడు. మూడుసార్లు డకౌటయ్యాడు. అయితే ఓవరాల్‌గా వన్డే కెరీర్‌లో 145 మ్యాచ్‌లాడిన ఫించ్ 39.13 సగటుతో 5,401 పరుగులు చేశాడు. 17 సెంచరీలు, 30 అర్ధసెంచరీలు చేశాడు. ఇందులో 54 మ్యాచ్‌లకు సారథ్యం వహించాడు. వన్డేల నుంచి తప్పుకున్నప్పటికీ ఫించ్ టి20 సారథిగా కొనసాగుతాడని, వచ్చే నెలలో స్వదేశంలో జరిగే టి20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్స్‌ను నడిపిస్తాడని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఒక ప్రకటనలో తెలిపింది. 'ఆస్ట్రేలియా జట్టుతో ఎన్నో మధురానుభూతులున్నాయి. ఇలాంటి జట్టుతో ఇన్నాళ్లు కొనసాగడాన్ని గౌరవంగా భావిస్తున్నా. కొత్తవాళ్లకు అవకాశమిచ్చేందుకు ఇదే సరైన సమయం. అందుకే వన్డే క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నా' అని ఫించ్ అన్నాడు.

సినిమా

తొలి పరిచయం



సమంత

నయనతార.. తమన్నా.. సమంత.. ఈ ముగ్గురి కెరీర్ పదేళ్లకు పైనే. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ కెరీర్ కూడా సేమ్ టు సేమ్. ఎవరి ఇండస్ట్రీలో వాళ్లు స్టార్ హీరోయిన్. ఇక రష్మికా మందన్నా కూడా సౌత్‌లో స్టార్ ఇమేజ్ తెచ్చుకున్నారు. ఇలా 'స్టార్' ఇమేజ్ ఉన్న ఈ కథానాయికలు వేరే భాషల్లో 'తొలి పరిచయం' కానున్నారు. ఆ వివరాల్లోకి వెళదాం.

దాదాపు ఇరవై ఏళ్లు ఇండస్ట్రీలో ఉంటున్నప్పటికీ హీరోయిన్‌గా నయనతార క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఆ క్రేజ్ ఇంకా పెరిగిందని ఆమె పారితోషికం గురించి వస్తున్న వార్తలు చెప్పకనే చెబుతున్నాయి. దక్షిణాదిలో దాదాపు 75 సినిమాలు చేశాక నయనతార ఓ హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అట్లీ దర్శకత్వంలో షారుక్ ఖాన్ హీరోగా రూపొందుతున్న 'జవాన్' చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయం కానున్నారు నయనతార. ఈ చిత్రంలో షారుక్ ఖాన్ హీరోగా నటిస్తుండగా, ప్రియమణి, విజయ్ సేతుపతి, దీపికా పదుకోన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 2న విడుదల కానుంది. నయనతార స్టోరీయే దీపికా పదుకోన్ స్కీన్ లైఫ్‌లో ఉన్నట్లు కనిపిస్తోంది. బాలీవుడ్‌లో డిఫరెంట్ సినిమాల్లో డిఫరెంట్‌గా నటించిన ఈ స్టార్ హీరోయిన్ తెలుగులో చేస్తున్న తొలి స్ట్రయిట్ ఫిల్మ్ 'ప్రాజెక్ట్ కె'. ప్రభాస్ హీరోగా అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ఇది. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన దీపిక తన కెరీర్‌లో 15 సంవత్సరాల తర్వాత తెలుగులో హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. 'ప్రాజెక్ట్ కె' చిత్రం 2024 మొదట్లో రిలీజ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక దక్షిణాదిలో సమంతకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పాలా! ఇండస్ట్రీకి వచ్చిన దగ్గర్నుంచి ఇప్పటివరకు అగ్రహీరోయిన్ల జాబితాలో సమంత పేరు లేని రోజులు లేవు. ఇదే స్టార్‌డమ్‌ను హిందీలో కూడా రిపీట్ చేయాలనుకుంటున్నారు సమంత. ఆల్రెడీ 'ది ఫ్యామిలీమేన్ 2' వెబ్ సిరీస్ సమంతకు బాలీవుడ్‌లో మంచి ఫాలోయింగ్ తీసుకువచ్చింది. దాంతో సమంతకు హిందీ నుంచి అవకాశాలు వస్తున్నాయి. ఆయుష్మాన్ ఖురానా హీరోగా అమర్ కౌశిక్ దర్శకత్వంలో రూపొందనున్న సినిమాకు సమంత గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఈ సినిమాకు సంబంధించి ఆల్రెడీ వర్క్‌షాప్స్ కూడా ఆరంభం అయ్యాయట. ఇదే నిజమైతే హిందీలో సమంత అంగీకరించిన తొలి సినిమా ఇదే అవుతుంది. మరో బ్యూటీ తమన్నా మాలీవుడ్‌లో తొలి అడుగు వేస్తున్నారు. ఇప్పటికే తెలుగు, తమిళం, హిందీ, కన్నడ (యశ్ 'కేజీఎఫ్ 2'లో స్పెషల్ సాంగ్) భాషల ప్రేక్షకులకు తమన్నా సుపరిచితురాలే. ఇప్పుడు మలయాళంకి హాయ్ చెబుతున్నారు. మలయాళ నటుడు దిలీప్ హీరోగా అరుణ్ గోపీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఈ సినిమాతోనే తమన్నా మాలీవుడ్‌కు వెళుతున్నారు. ఇటీవల కేరళలో జరిగిన ఈ సినిమా ప్రారంభోత్సవంలో తమన్నా పాల్గొన్న సంగతి తెలిసిందే. కథానాయికగా కెరీర్ స్టార్ట్ చేసిన పదిహేడు సంవత్సరాల తర్వాత తమన్నా ఓ మలయాళ సినిమా చేయడం విశేషం. ఇక ఒక భాషలో నటించిన తొలి సినిమా విడుదల కాకముందే మరో రెండు సినిమాలకు సైన్ చేసే చాన్స్ తక్కువమంది హీరోయిన్లకు లభిస్తుంది. ఈ లిస్ట్‌లో రష్మికా మందన్నా ఉన్నారు. బాలీవుడ్‌లో హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో 'మిషన్ మజ్ను', అమితాబ్ బచ్చన్ కాంబినేషన్‌లో 'గుడ్ బై', రణబీర్ కపూర్ 'యానిమల్' చిత్రాలకు సైన్ చేశారు రష్మికా మందన్నా. అయితే రష్మికా సైన్ చేసిన తొలి హిందీ చిత్రం 'మిషన్ మజ్ను' అనే వార్తలు ఉన్నాయి. కానీ ఆమె నటించిన మరో హిందీ చిత్రం 'గుడ్ బై' ముందు (అక్టోబరు 7న) విడుదల కానుంది. సో... రిలీజ్ ప్రకారం బాలీవుడ్‌లో రష్మికా మందన్నాకు 'గుడ్ బై' తొలి చిత్రం అవుతుంది. వీరే కాదు... మోహన్‌లాల్ 'మాన్‌స్టర్' చిత్రంతో లక్ష్మీ మంచు, 'ఓట్టు'తో ఈషా రెబ్బా మలయాళ పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. అలాగే ఓ బెంగాలీ సినిమా హిందీ రీమేక్‌తో సాయి పల్లవి హిందీలో ఎంట్రీ ఇవ్వనున్నారనే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.



రష్మికా మందన్నా



తమన్నా



నయనతార



దీపికా పదుకోన్



శ్రీ కార్తీక్, అమల, శర్వానంద్, ఎస్‌ఆర్ ప్రభు

ఇంతకంటే గొప్ప విజయం ఏముంటుంది

– శర్వానంద్

''థియేటర్స్‌లో 'ఒకే ఒక జీవితం' సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ అందరూ చప్పట్లు కొడుతున్నారు. ఇంతకంటే గొప్ప విజయం ఏముంటుంది. ఈ సినిమా ఇంకెంత విజయం సాధిస్తుంది, ఎంత కలెక్ట్ చేస్తుంది? అనే అంశాలను అటుంచితే థియేటర్స్‌లో ప్రేక్షకుల చప్పట్లను వినాలనిపించింది. ప్రేక్షకులు నేను కోరుకున్న ప్రేమను ఇచ్చారు'' అన్నారు శర్వానంద్. శ్రీ కార్తీక్ దర్శకుడిగా పరిచయం అవుతూ శర్వానంద్ హీరోగా నటించిన చిత్రం 'ఒకే ఒక జీవితం' (తమిళంలో 'కణం'). రీతూ వర్మ హీరోయిన్‌గా కీలక పాత్రల్లో అక్కినేని అమల, 'వెన్నెల' కిశోర్, ప్రియదర్శి నటించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజైంది. ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తోందని చిత్ర యూనిట్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో శర్వానంద్ మాట్లాడుతూ – ''గొప్ప కథ రాసి, విజయానికి కారణమైన దర్శకుడు శ్రీ కార్తీక్‌కు ధన్యవాదాలు. థియేటర్స్ స్క్రీన్‌పై అమలగారు కనిపించినప్పుడు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. అమలగారు ఇంకా మరిన్ని చిత్రాలు చేయాలని కోరుకుంటున్నాను. ఎస్‌ఆర్ ప్రభుగారు అభిరుచిగల నిర్మాత. మౌత్ టాక్‌తో ప్రేక్షకులు మా సినిమాను ముందుకు తీసుకుని వెళ్లాలని కోరుతున్నాను'' అన్నారు. ''యువత ధైర్యంగా జీవితాన్ని ఎదుర్కొని విజయం సాధించేందుకు మార్గం చూపే చిత్రం ఇది. ఈ సినిమాకు అందరూ కనెక్ట్ అవుతారు. శర్వానంద్ పరిపూర్ణ నటుడు'' అన్నారు అమల. ''శర్వానంద్-అమలగార్లు స్క్రీన్‌పై తల్లీకొడుకులుగా ప్రేక్షకుల మనసును హత్తుకున్నారు. ఈ సినిమా అందరికీ ఎమోషనల్‌గా కనెక్ట్ అవ్వడాన్ని గొప్ప విజయంగా భావిస్తున్నా'' అన్నారు శ్రీ కార్తీక్. ''ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది'' అన్నారు ఎస్‌ఆర్ ప్రభు. నటుడు 'వెన్నెల' కిశోర్, ఈ చిత్రం కెమెరామేన్ సుజిత్ పాల్గొన్నారు.

వెంకీమామ చెప్పింది వంద శాతం నిజం!



ఉషా, నాగశౌర్య, షిర్లే సేథియా, అనీష్ ఆర్. కృష్ణ

''ప్రతి సినిమా ముఖేష్ యాడ్‌తో మొదలైనట్లు.. నా కథ వీడితో మొదలవుతుంది. సత్య.. నా డాక్టర్.. ఈ డాక్టర్ కోమా నుంచి బయటకు రావడం వీడికి ఎంత ఇంపార్టెంటో నాకు తెలియదు కానీ నాకు మాత్రం ఇంపార్టెంట్.. ఎందుకంటారా..' అని నాగశౌర్య చెప్పే డైలాగ్‌తో ప్రారంభం అవుతుంది 'కృష్ణ వ్రింద విహారి' చిత్రం ట్రైలర్. అనీష్ ఆర్. కృష్ణ దర్శకత్వంలో నాగశౌర్య, షిర్లే సేథియా జంటగా శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. 'ఎఫ్ 2'లో వెంకీమామ చెప్పింది 100 పర్సెంట్ కరెక్ట్. ప్రపంచంలో బాధలన్నీ వాళ్లే భరిస్తున్నారంటారే .. మరి వాళ్లను భరిస్తున్న మనల్ని ఏమనాలి రా'' అంటున్న నాగశౌర్య డైలాగ్స్‌తో ఈ సినిమా ట్రైలర్ సాగుతుంది. ''అగ్రహారం బ్రాహ్మణ కుర్రాడు కృష్ణ (నాగశౌర్య) ఓ ఎమ్మెన్సీ కంపెనీలో ఉద్యోగం సంపాదించి సిటీకి వచ్చి వ్రింద (షిర్లే) అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. కృష్ణది సనాతన బ్రాహ్మణ కుటుంబం. వ్రింద మోడ్రన్ గర్ల్. వీరి ప్రేమ ఎలా వర్కౌట్ అయ్యింది? వీరి పెళ్లికి ఎదురైన ప్రధాన సమస్య ఏంటి? అన్నది చిత్రకథ'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్, సహనిర్మాత: బుజ్జి.

న్యాయం సాక్షిగా..



చిత్రా శుక్లా

సమాజంలోని సత్యం, కఠినమైన వాస్తవాల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'గీత సాక్షిగా'. పుష్పక్, జేబీహెచ్ ఆర్‌ఎన్‌కేఎల్ సమర్పణలో చేతన్ రాజ్ నిర్మిస్తున్నారు. ఆదర్శ్, చిత్ర శుక్లా, రూపేష్ శెట్టి, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు నటిస్తున్నారు. ఆంథోని మట్టిపల్లి స్క్రీన్ ప్లే రాసుకొని దర్శకత్వం వహిస్తున్న తొలి చిత్రం ఇది. చేతన్ రాజ్ ఈ సినిమాకు కథ అందించి, నిర్మిస్తున్నారు. ''నేరం, న్యాయంపై ఆధారపడిన బలమైన సబ్జెక్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. నిజ జీవిత ఘటనల ఆధారంగా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: వెంకట్ హనుమ.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



వెంకట్ రెడ్డి/55yr, నెలకి 2 లక్షలు ప్రాపర్టీ, శ్రీనివాస్/50yr, నెలకి 1.5 లక్షలు ప్రాపర్టీ, వెంకటేశ్వర్లు/45yr, Govt/ నెలకి 75K, స్వంత ఇల్లు. Ph: 9063855739 [H-784179]

యాదవ/M.Tech/C.Govt.Asst Engineer/(HPCL)/80,000/-PM/5'8" ఎత్తు /28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008965895 [HA-8366]

మాల హిందూ/M.Tech/C.Govt. A.E. (Railway) 75,000/- PM/5'8"ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-8366]

మాల క్రిస్టియన్/B.Tech/M.B.A/C.Govt. Union Bank Manager/98,000/-PM/5'8" ఎత్తు /28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-8366]

కాపు(డైరెక్ట్)/40/లేట్ మ్యారేజ్/ 5'8"/ B.Com/బిజినెస్ చేస్తున్న వెల్ సెటిల్డ్ వరునికి మంచి సంప్రదాయ వధువు కావలెను. Ph: 7032918043 [H-784179]

ఓం గం గణపతయే నమః/CNB/45K PM/3 కోట్ల ప్రాపర్టీ గల పెళ్ళికాని బ్రాహ్మణ PG వరునికి 5 సం॥లోపు పిల్లలున్నా 2వ సంబంధం వధువు కావలెను (కెనడా ఛాన్స్). Ph: 9912736916 [H-784086]

మాదిగ/29/5'9"/B.Tech/MBA / Govt. Job (ASO) 12L P/A వెల్ సెటిల్డ్ in Hyd/AP బాగా స్థిరపడిన వరుడికి వధువు కావలెను. Ph: 6281925716 [HA-8370]

II Match/CNB/45/5'9"/B.Tech/ Govt. జాబ్ 12L P/A (HPCL) సొంత ఇల్లు బాగా స్థిరపడిన వ్యక్తి వరుడికి వధువు కావలెను. విడో, డైవర్సీ, II Match చూడబడును. 9391653299 [HA-8370]

కుమ్మరి/కట్నప్రసక్తి లేదు/CA/చార్టర్డ్ అకౌంటెంట్/80,000/-PM/5'11"ఎత్తు /28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-8371]

క్రిస్టియన్ మాదిగ/M.Sc/Govt. అకౌంటెంట్/ఎలక్ట్రికల్ Dept/45,000/-PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-8371]

క్రిస్టియన్ మాల/కట్న ప్రసక్తి లేదు/ M.Tech/ C.Govt.PO/SBI బ్యాంక్/ 60,000/- PM/5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-8371]

రెడ్డి/M.Tech/SWE/1 Lakh PM/ "6'ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-8371]

SC మాదిగ/ఏకైక కుమారుడు/C.A/ చార్టెడ్ అకౌంటెంట్/Sr.Audit ఆఫీసర్/1 Lakh PM/ 5'10"ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 7032058965 [HA-14487]

SC మాల/32/5'10"/B.Tech/Pvt. జాబ్/ 70,000/-PM/వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. కట్నం సమస్య కాదు. Ph: 9676812525, 9030056547. [HA-14487]

క్రిస్టియన్/30/5'9"/B.Tech, MS/ అమెరికా నుండి వచ్చి ఉన్నాడు/ SWE/వరునికి తగిన వధువు కావలెను. Ph: 8919759359 [HA-14487]

యాదవ/కట్న ప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/SBI/70,000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 7842467951, 7075953400 [HA-14487]

Christian/కుల ప్రసక్తి లేదు/26 సం॥లు /4'5"ఎత్తు/B.Tech (NIT)/Sr. Software Eng/ MNC Co./11L. PA అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9866036051 [HA-14487]

SC మాల/M.Tech (EEE)/C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/75000/-PM/ 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9666887287 [HA-14487]

యాదవ/B.Tech(సివిల్)/M.Tech, NIT/ Govt.A.E.E./ ఇరిగేషన్ Dept/ 65000/- PM/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9515755529 [HA-14487]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/MBA/Business/1994/5'9" / 400Cr/(No Dowry). * Cont: K.C. Reddy, Mar-Bureau- Road No-3, B.Hills- Hyd. Ph: 9347807015

Reddy/(Divercee) /MBA /Very Handsome Boy/1986/5'5"/1000Cr. * Cont: K.C. Reddy- Mar-Bureau- Hyd. Ph:9849321309/9347807015

Reddy/ Business/ B.Tech/ MBA/ Very Handsome Boy/ 1995/ 6'/ Jubli Hills - Hyd/ 100Cr. * Cont : K.C. Reddy, Hyd. Ph:9849321309

Reddy/ B.Tech/ Business/ 1992/ 5'10"/ 300Cr * Cont: K.C. Reddy, Mar-Bureau- Road No. 3, B.Hills- Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/MBBS/MD/Handsome Boy/1995/ 5'10"/300Cr/20L/M Rental Income * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech/ MS/ H1/ USA/ 1991/ 5'11"/ 130K/ 200Cr * Cont: K.C. Reddy, Mar-Bureau- B.Hills- Hyd. Ph:9849321309/ 9347807015

